
ఆంధ్రసచిత్రవార
పత్రి

2 1991


తప్పక చూడండి!
శ్రీ సరస్వతీ చిత్ర
కథానాయకురాలు
కథ-స్క్రీన్‌ప్లే-దర్శకత్వం: గిడుతూరి సూర్యం, B.A.
నిర్మాతలు: గిడుతూరి సూర్యం - నల్ల వెంకట్రావు
NAVRANG

వనితాలోకం వ్యాసరచనపోటీలో బహుమతులని పొందిన రచయిత్రులు!



శ్రీమతి మంచాళ శ్రీలక్ష్మి



శ్రీమతి పి. జయలక్ష్మి

వనితాలోకం వ్యాసరచనపోటీలో మొదట, రెండవ బహుమతులుపొందిన రచయిత్రుల ఫోటోలు, జీవిత వివరాలు ఈ సంచిక ముద్రణకి వెళ్లే సమయానికి మాకు అందలేదు. మూడవ బహుమతి, ప్రత్యేక బహుమతి పొందిన రచయిత్రులు శ్రీమతి మంచాళ శ్రీలక్ష్మి, శ్రీమతి పి. జయలక్ష్మిగార్లు రాసిన ఉత్తరాలని, ఫోటోలని ఈ క్రింద వేస్తున్నాము. ప్రత్యేక బహుమతి పొందిన శ్రీమతి పిన్నాక ధనలక్ష్మిగారు రాసిన ఉత్తరం వేస్తున్నాము. —సం॥

మంచాళ శ్రీలక్ష్మి (మూడవ బహుమతి)

– నా జననం 1945 లో నిడదవోలులో. చదువు రాజమండ్రిలో. పి. యు. సి. ప్యాసయ్యాను. హిందీ పరీక్షలలో విశారదలో ఉత్తీర్ణురాలనయ్యాను. చిన్నప్పటినించీ కథలు రాయడంలో ఉత్సాహం ఉంది. దానికి తగ్గట్లు వివాహం తరువాత ఇంట్లో నా ఉత్సాహానికి తగ్గ ప్రోత్సాహం లభించడంతో కొన్ని కథలు రాయడం అవి పత్రికా ముఖంగా వెలువడడం జరిగింది. ప్రస్తుతం నివాసం హైదరాబాదు.

పి. జయలక్ష్మి (ప్రత్యేక బహుమతి)

– జన్మ స్థలము రాజమండ్రి. ఆంధ్రా యూనివర్సిటీ నుంచి డిగ్రీ తీసుకున్నాను. శ్రీవారి ఉద్యోగరీత్యా బొంబాయిలో ఉంటున్నాము. మాకు ఏడాది నిండని ఒక బాబు ఉన్నాడు.

తెలుగులో కాల్పనిక సాహిత్యం అంటే అభిరుచి ఎక్కువ.

పి. ధనలక్ష్మి (ప్రత్యేక బహుమతి)

– ఫోటో పంపలేకపోతున్నందుకు మన్నించి ఈ క్రింది వివరాలు మాత్రం స్వీకరించవలసినదిగా కోరుచున్నాను.

నా జన్మస్థలం వేజెండ్ల (గుంటూరు తాలూకా) నేను యస్. యస్. యల్. సి. వరకు చదివాను. మావారి ఉద్యోగరీత్యా ప్రస్తుతం కనగాల (రేపల్లె తాలూకా)లో ఉంటున్నాము. మావారి సహాయ సహకారాలతో అప్పుడప్పుడు చిన్న చిన్న వ్యాసాలు వ్రాస్తూండటం అలవాటు.

ఉత్తరాలు

పాఠకులకి రచయిత(త్రు)లకి మా ఉగాది శుభాకాంక్షలు. సకాలానికి అందని కారణంగా ఈవారం రాజధానికబుర్లు వెయ్యలేక పోతున్నాము. —సం॥

కథలు

5—3—71 సంచికలోని కె. లక్ష్మిసోమంగారు రాసిన దగాపడిన తల్లి చదివిన పిదప ఈ ఉత్తరం వ్రాయకుండా ఉండలేక పోయాను. చాలా దినాల తర్వాత ఒకమంచి కథ చదివాననే సంతృప్తి కలిగింది. భర్తచే తిరస్కరించబడి, తల్లిదండ్రులను కోల్పోయిన శంకుతల, కొడుకుని చూసుకుంటూ బతికింది. కాని తనయుడు కూడ తల్లిని దగాచేసి తండ్రి దగ్గరికి వెళ్తాడు. ఇలాంటి పరిస్థితిలో ఆ తల్లి, మనసులోని అల్లకల్లోలాన్ని భరించలేక చనిపోవడంలో ఎంతో సహజంగా కనిపిస్తుంది.

—పర్వతాపురం చంద్రశేఖర్, (56 ఎ.పి.ఒ.)

* * *

నువ్వు నాకు కావాలమ్మా కానవరపు అలివేలుమంగగారు రచించిన కథ చాలా బాగుగా ఉన్నది. కథా వస్తువును సరియైన పద్ధతిలో మలచటమేకాక చక్కని పద సమూహముతో వ్రాసారు.

—చటక్. పెరుమాళ్ళాచారి, (హైదరాబాదు.)

* * *

మీ పత్రిక (తే 19—3—71) లో అంగర వెంకటకృష్ణారావు గారి కథ నాగరికత మీద విజయకుమార్‌గారి ఉత్తరం చదివాను. ఆయన కథకి యీయన ఉత్తరానికి ఏమి సంబంధము లేదు. పందిని కర్రతో కొట్టి చంపి, మేకను కోసిపెట్టి చంపుతున్నారని రచయితగారు ఆ కథలో అన్నారు. పంది మాంసం తిన్నవాళ్లే అనాగరికులని, యితర మాంసం తిన్నవాళ్లు నాగరికులని కథలో యెక్కడైనా సూచనప్రాయంగానైనా ఉందా? అసలు మాంసాహారం గూర్చి యీ కథలో ప్రసక్తే లేదు. కథ చదువుతుంటే దారుణహింస కళ్ళకి కట్టి గుండె ద్రవిస్తోంది. అంతే.

—ఎ. ఏ. పద్మజ, (విశాఖపట్నం.)

సీరియల్

ఈవారం 12.3.1971 సంచికలో, శ్రీషమ్మి హైదరాబాదువారు వ్రాస్తూ, తాజమహల్ ప్రపంచమందలి ఏడు వింతలలో ఒకటిగా జనరల్ నాలెడ్జి పుస్తకములో లేదని వ్రాశారు. కాని వారీ క్రింది విధంగా గమనించగలరని విశ్వసిస్తాను.

ప్రపంచపు ఏడువింతలు, పురాతన, మధ్యకాలపు, అధునాతన అని మూడువిధములు.

అందు పురాతన వింతలలో, పిరమిడ్స్, హాంగింగ్ గార్డన్స్ ఆఫ్ బాబిలోనియా, గ్రేట్‌వాల్ ఆఫ్ చైనా మున్నగునవి కలవు.

మధ్యకాలపు ఏడువింతలలో తాజమహల్ ఒకటి. ఇక అధునాతనపు వింతలు, రాకెట్, టెలివిజన్ మున్నగునవి.


అంతేకాని పుస్తకమందు వ్రాసిన పురాతన వింతలు చదివి, రచయితను అపార్థం చేసికోరని ఆశిస్తాను.

—ఎస్. ఎ. ముబారక్, (హైదరాబాదు.)

ముగ్గురు మూర్ఖులు

శ్రీ మహేష్‌గారి ఈవారం ముగ్గురుమూర్ఖులు కథలో చెప్పిన వినోదంలో మన ప్రభుత్వం అవలంభించిన వైఖరి అవివేకంవల్లనేనని చెప్పటానికి ఇంకొక నిదర్శనం కూడా ఉంది.

1970వ సంవత్సరంలో అల్‌ఫటావాళ్ళు విమానాల్ని బలవంతంగా మళ్ళించి పేల్చివేసిన తరువాత ఇంటర్నేషనల్ సివిల్ ఏవియేషన్ ఆర్గనైజేషన్ వారు వివిధ దేశాలు ప్రపంచ ప్రయాణీకులకోసం తీసుకోవలసిన తగిన జాగ్రత్తలు చర్చించడానికోసం ఒక సభను ఏర్పాటు చేసింది అక్టోబరులో. భారత ప్రభుత్వమువార్నికూడా ఆహ్వానించింది. కాని భారత ప్రభుత్వం సదరు సమావేశానికి ఒక ప్రతినిధిని



మర్ఫీ
ట్రాన్సిస్టర్
ప్రతి ఒక దానిలో అందమూ శ్రవణానందమూ
మేళవించ బడినవి
—మ్యూజిషియన్—
మీడియం వేవ్‌లో 25 మీటర్
బ్యాండ్ స్ప్రెడ్ రు. 125*
మ్యూజిక్ మాస్టర్
3-బ్యాండ్ రు 160*
మీరు ఎన్నుకునేటందుకు
ఎన్నో రకాల ట్రాన్సిస్టర్లు
ఉన్నాయి. ప్రతి ఒక
ట్రాన్సిస్టరు కూడా మీకు
నేత్రానందము
శ్రవణానందము కల్గిస్తుంది.
సుమధురమైన,
సుస్పష్టమైన,
పటిష్టమైన ధ్వని
నిచ్చుటకు ప్రతి
మర్ఫీ మాగ్ని-ట్యాక్ట్
చేయబడింది.
*ధర ఎక్సైజు డ్యూటీ
మాత్రము కలిపి.
ఇతర పన్నులన్నీ అదనం.
—మినీ మాస్టర్—
2-బ్యాండ్ రు. 210*
మినీ బాయ్ డీలక్స్
2-బ్యాండ్ రు. 175*
మస్తానా
3-బ్యాండ్ రు. 245*
హీరా- ముసాఫిర్
4-బ్యాండ్ డీలక్స రు. 328*
మర్ఫీ ఇంటిలో అందరి ఆహ్లాదమునకు!

HAS-C.45-D

కూడా పంపించడం మర్యాదగా భావించలేదు. కాని ఎయిర్ ఇండియా వారుమాత్రం తమ సెక్యూరిటీ విభాగానికి అధిపతిగా ఉన్న శ్రీ జి. బి. పిట్వాని పంపించింది. అదీ ప్రేక్షకునిగా మాత్రమే. లేకపోతే ప్రభుత్వానికి కోపం వస్తుంది.

ఇంకొకటి:

దాదాపు అదేకాలంలో బి. వో. ఎ. సి. వారు ఒకయంత్ర పరికరాన్ని దిగుమతి చేశారు. ఈ పరికరం ద్వారా ప్రయాణికుని వద్ద పిస్తోలు, గ్రెనేడు వస్త్రాలు ఉంటే తెలుసుకోవచ్చును. భారతప్రభుత్వం ఆ యంత్రంమీద 110 శాతం దిగుమతి పన్ను విధించింది. బి. వో. ఏ. సి. వారు ఏం చెప్పారంటే ఆ పరికరాన్ని మిమ్మల్ని కూడా పూర్తిగా వాడుకోనివ్వ

ఉత్తరాలు

దానికి మాకు పూర్తి అంగీకారమే, కారణం— ప్రయాణికుని క్షేమమేకదా మీకూ మాకూ కావలసింది అని. భారత ప్రభుత్వంవారు పన్ను తగ్గించమన్న వారి ప్రార్థనని మన్నించనేలేదు.

భారతప్రభుత్వం ఈవిధంగా దిగుమతికి ఎగుమతికి, సంబంధించిన కస్టమ్స్ చట్టాన్ని పట్టుకుని వ్రేలాడటం చూస్తుంటే మామిడిపళ్ళ బుట్ట క్లియరెన్సు వచ్చే సరికి పురుగులైపోయి ఉంటుందని అనిపిస్తుంది. నిజంగా గర్వించతగ్గ విషయాలే!

—కె. కృష్ణమూర్తి, (ఆనంద్‌పూర్.)

ఆంధ్రసచిత్ర వారపత్రిక

వ్యవస్థాపకులు:
దేశోద్ధారక కాశీనాథుని
నాగేశ్వరరావు పంతులుగారు

శుక్రవారం 2-4-'71
శ్రీ విరోధికృన్నామ సం॥ చైత్ర మాసం శు॥ సప్తమి
సంపుటము : 64 సంచిక : 30

స్థాపితము:
1908

ముఖ్య సంపాదకుడు:
శివలెంక శంభుప్రసాద్

ఆంధ్రపత్రిక కార్యాలయము
7, తంబుచెట్టి వీథి, మద్రాసు-1
విడి ప్రతి వెల 40 పైసలు

పోస్టుద్వారా

సంవత్సర చందా	26.00
6 మాసముల చందా	13.00
3 మాసముల చందా	6.50

విషయానుక్రమణిక

ముఖచిత్రం: వినాయకుడు

(చిత్రకారుడు శ్రీ జి. వెంకట్రావు.)

కథలు:

సీరియల్ నవలలు:

వ్యాసాలు, శీర్షికలు. సినిమా:



ఇందిర పక్షి కెరటం
గుజరాత్ ప్రభుత్వం
బీహార్ ప్రభుత్వం
ఉ.ప్ర. ప్రభుత్వం
మైసూర్ ప్రభుత్వం
ఒక పోటాటలో ఓడిపోయాం. కాని, యుద్ధంలో కాదు!
కామరాజ్
నిజలింగప్ప
ముందు మత్తెక్కిస్తే తరువాత అంతం చెయ్యొచ్చు
ఇక్కడ నల్లమందు అమ్మబడును
జయించవలసిన శిఖరాలను జయించడానికి మనం సిద్ధంగా ఉండాలి
నిరుద్యోగం
పేదరికం

ఉగాది గురించి

పండుగుల్లోనూ, పబ్బాల్లోనూ ప్రాధాన్యాన్ని వహించి, ఆ వద్దులో మొదటపేరు వేయించుకున్నది ఉగాది. ప్రతియేడూ వస్తూవున్నా, యెప్పటికప్పుడు కొత్తగానే ఉంటుంది. 'నూతన' అనే విశేషణం దీనికి తప్ప మరో పండుక్కి లేదు.

కాలానికి ఆద్యంతాలు లేవు. అయినా దాన్ని చిన్న భాగాలుగానూ, పెద్ద భాగాలుగానూ విభజించుకుంటేనేగాని నిత్య వ్యవహారాలు జరగవు. ఈ కాల విభాగం సూర్యచంద్రుల గమన మూలంగానే ప్రధానంగా జరుగుతుంది. అందులోనూ సూర్యుని బట్టే కాలవిభాగం జరుగుతుంది. సూర్యోదయాస్తమయాలవలె చంద్రోదయాస్తమయాలు నియతంగా వుండవు. అందువల్లనే సూర్యుడు కాలాత్మకుడని అనిపించుకుంటున్నాడు.

ప్రతి సంవత్సరమూ—సంవత్సరం పొడుగునా పండుగులు వస్తూనే ఉంటాయి. అన్నిటికీ మొదటిది యీ పండుగ. సంవత్సర ప్రారంభదినాన్నే ఇది వస్తుంది. వసంత నవరాత్రులు దీనితోనే ప్రారంభం. ఆ వెంటనే శ్రీరామనవమి — కొద్ది వ్యవధిలో చిత్రాపూర్ణిమ. ఇలాగున వస్తూనే ఉంటాయి.

ఈ సంవత్సరాదికి ఉగాది అనే పేరు రావడానికి కారణం ఏమిటి? అనే ప్రశ్న కలగడానికి కారణం లేకపోలేదు. మానవుల కాలంలో యుగం పరమావధి. యుగాలు కృత — త్రేతా—ద్వాపర — కలి భేదాలవల్ల నాలుగు ఉన్నవి. యుగ ప్రారంభం ఒకప్పుడు చైత్రశుద్ధ పాడ్యమితోనే ప్రారంభమయి ఉండేది. బ్రహ్మదేవుడు సృష్టిని ఈ దినమే ప్రారంభించినట్లునూ చెప్పడం ఉన్నది. యుగానికి ఆది—అంటే మొదలు కావడంవల్ల ఇది యుగాది అయి, క్రమంగా యుగాది ఉగాదిగా మారి పోయింది. అదే సంవత్సరాదికి నామాంతరమయింది!


యుగాది నామం సంవత్సరాదికి ఉచితమయి కూడా ఉన్నది. జీవిత వసంతంలో నూతన యుగానికి ఇది ఆది—ప్రారంభం! ఇంతకు పూర్వం వుండేది శిశిరర్తువు. ఆకులన్నీ రాలి చెట్లు మోడులైపోతాయి. ఇప్పుడే అవి కొత్త చిగుళ్ళతో కళకళలాడడం ప్రారంభిస్తాయి! కాలం సమశీతోష్ణంగా వుండి, మనస్సుకు ఆనందాన్ని కలిగిస్తుంది. జీవితంలో యౌవనం మంచి వయస్సయినట్లు సంవత్సర పరిమితమైన కాలంలో ఇది మంచికాలమని మనీషుల భావన.

మనం ఏ పనినయినా ప్రారంభిస్తే దానికి విఘ్నం కలగకూడదు. కలిగితే తర్వాతి కార్యాలకు కూడా ఆటంకాలూ, చిక్కులూ కలుగుతూ వుంటాయి. ఈ నమ్మకం మనలో చాలా మందికి ఉన్నది. అనుభవసిద్ధం కూడాను. ఈ పండుగను ఆనందంగా జరుపుకుంటే— తర్వాతి పండుగులు కూడా సంతోషంతోనే జరిగిపోతాయి. అందువల్లనే యీ దినం సంతోషంగా ఉండడానికే అందరూ యత్నిస్తారు. విచారంతో ఉంటే సంవత్సరం పొడుగునా విచారమే కలుగుతూ వుంటుందనే చాలామంది నమ్మకం.

ఈ పండుగను జరుపుకునే విధానం యిది—

'అబ్దాదౌ బంధు సంయుక్తో
మంగళస్నాన మాచరేత్,
వస్త్రాభరణైర్దేహ
మలంకృత్య తతశ్శుచిః,
నవగ్రహాంశ్చ పంచాంగం
గణేశం చ సుభక్తితః,
దైవజ్ఞమపి సంపూజ్య
సాన్వయః సపురోహితః,
సత్వా కాలాత్మకం సూర్యం
పంచాంగం గణితాగతం,
తిథివారాదికం సర్వం
శ్రుణుయాత్తత్ఫలంచవై.'

సంవత్సరాదినాడు బంధువులతో కూడా వేకువనే తలంటుకొని మంగళస్నానం చెయ్యాలి. నూతన వస్త్రాలు కట్టుకొని, నగలను ధరించి శుచిగా ఉండాలి. తర్వాత నవగ్రహాలనూ, పంచాంగాన్నీ, పంచాంగాన్ని వినిపించే జ్యోతిష్కుణ్ణీ, ముఖ్యంగా వినాయకుణ్ణి బంధుపురోహిత సహితంగా పూజించాలి. తర్వాత కాలస్వరూపుడైన సూర్యునికి నమస్కరించి, గణితానుసారంగా తిథి, వార, నక్షత్ర, యోగ, కరణరూపాలయిన అయిదు అంగములతోడి పంచాంగాన్ని విని, ఆ సంవత్స





"ఉగాదిపచ్చడి"
(చిత్రకారుడు: శ్రీ వై. బాలయ్య)

ఠవు ఫలాన్ని తెలుసుకోవలసి ఉన్నది.

ఈ పంచాంగానికి దేశకాల జాతిమతాదులతో సంబంధం లేదు. సంవత్సర ఫలాలు అన్ని మతాలవారికీ, అన్ని దేశాలవారికీ సంబంధించినవే! భవిష్యత్తు ఎలా ఉంటుందో తెలుసుకోవలెననే కుతూహలం అందరికీ సమానమే. పంచాంగంలో వివిధ ప్రాంతాల కాలమాన పరిస్థితులను గురించీ, పాడి పంటలను గురించీ వివరాలు ఉండడంవల్ల అందరికీ తెలుసుకోదగినవే !

ఉగాదినాడు నింబకందళ భక్షణం — అంటే లేత వేపచిగురు తినడం పూర్వం వుండేదట !

'శతాయుర్వజ్ర దేహాయ
సర్వసంపత్కరాయ చ,
సర్వారిష్ట వినాశాయ
నింబకందళ భక్షణం.'

నూరేండ్ల ఆయుర్దాయం, వజ్రంవంటి దృఢమైన దేహం ఉండడానికీ, సమస్త సంపదలూ కలగడానికీ, సర్వారిష్టాలూ నశించడానికీ వేప చిగుళ్లను భక్షించవలసి వుంటుందని దీని అభిప్రాయం.

ఈ శ్లోకాన్ని చదువుతూ కొత్త వేప చిగుళ్లను తినాలని కొన్ని పంచాంగాలలో చెప్పబడి ఉన్నది. నింబకందళాలు తింటే ఆరోగ్యంగా ఉండడమే కాకుండా, దేహం వజ్రదేహంగా తయారవుతుందని దీనివల్ల తెలుస్తూ ఉన్నది. సంవత్సరం ఆదిలోనే నింబకందళ భక్షణ నియమంవల్ల — ఆ సంవత్సరంలో కష్టాలు వచ్చినా వాటిని ప్రశాంతచిత్తంతో సహించవలసి ఉంటుందనే సంగతి సూచితమవుతున్నట్లు కానవస్తున్నది. ఇది కేవలం ఊహామాత్రమే అనుకోవచ్చును.

వేప చిగుళ్లు చాలా చేదుగా ఉంటాయి సదా! వాటిని పరగడుపున తినడం ఎలాగ? అని సంకోచం కలగవచ్చును. అందువల్లనే కొంచెం బెల్లం కూడా చేర్చుకుని వాటిని భక్షించాలని కొన్ని పంచాంగాలు అనుమతి నిస్తున్నవి, బెల్లం సంగతి శ్లోకంలో లేకపోయినా. తర్వాత తర్వాత వీటితో పుల్లని కొత్త చింతపండు, వగరు మామిడి పిందెలు, పచ్చిమిరపకాయలు, ఉప్పు చేరి వుంటాయి. వేపచిగుళ్ల స్థానాన్ని వేపపువ్వు ఆక్రమించి కొత్త రుచిని కలిగించే ఉగాది పచ్చడి మరి కొంతకాలానికి ఏర్పడి వుండవచ్చునేమో అని తోస్తుంది. ఏమయితేనేం ? దీనిలో 'వేప' సంబంధం ఉండడంవల్ల మనం శాస్త్రాన్ని పాటిస్తున్నామనే తృప్తి పొందాలి.

ఆయా సంవత్సరాలలో సంభవించే సంఘటనలకూ, మంచి చెడ్డలకూ సంవత్సర నామంతో సంబంధం వుంటుందనే అభిప్రాయం చాలా మందికి ఉంటుంది. ఈ విరోధికృత్సంవత్సరంలో ప్రపంచంలోని పలు ప్రాంతాల్లో, పరస్పర విరోధాలు, యుద్ధాలు, జననష్టం అధికంగా ఉంటుందనే పంచాంగాలవల్ల తెలుస్తున్నది. కాని, పేరునుబట్టి భయపడడంగాని, సంతోషించడంగాని సముచితం కాదు. ఒకప్పుడు 'బహుధాన్య' సంవత్సరంలో కాటకం వచ్చి ప్రజలు తిండికి లేక మలమల మాడిపోయిన సంగతి శతవృద్ధులు చెప్తూ ఉండడం గమనించవచ్చును. 'విరోధికృత్' అని వున్నది కాబట్టి దాన్ని సార్థక పరుచుకోడానికి కాకుండా, ఆ పేరు సార్థకం కాకుండా ఉండేటట్లు అందరూ ప్రయత్నించడం అత్యావసరం!

—అంగీరస

పాఠకులకి మనవి

ఆంధ్రసచిత్రవారపత్రిక పాఠకులందరికీ ఉగాది శుభాభినందనలు!

ఉగాదికి వెలువడుతున్న ఈ సంచిక మొదటి అట్టమీద వినాయకుడి చిత్రం వేస్తున్నాము. కొత్త సంవత్సరాది సందర్భంలో విఘ్నేశ్వరుడి చిత్రం వెయ్యటానికి ప్రత్యేక కారణం ఒకటి ఉంది. కొంతకాలం కింద ఆంధ్రసచిత్ర వారపత్రిక ముద్రణని అభివృద్ధి చెయ్యటానికని కొత్త ముద్రణా యంత్రాన్ని ఒకదానిని కొన్నాము. ఇది ఒకేసారి అరురంగులని ఆఫ్‌సెట్ పద్ధతిమీద వెయ్యగలదు. క్రమంగా, ఆంధ్ర సచిత్ర వారపత్రికని పూర్తిగా ఈ ఆఫ్‌సెట్ మెషిన్‌మీదనే ముద్రించే ఏర్పాట్లు చేస్తాము. కాని అది ఇటీవలే నెలకొల్పబడటంచేత అట్టమీద బొమ్మలతో ప్రారంభించదలచాము! ప్రారంభానికి విఘ్ననాయకుడి బొమ్మ వెయ్యటంకన్నా ఉచితమయినది ఉండదు కాబట్టి ఆంధ్ర సచిత్ర వారపత్రిక ఉగాది సంచికని పాఠకులకి వినాయకుడి చిత్రంతో అందజేస్తున్నాము!

అయితే సకాలంలో ఆఫ్‌సెట్‌లో ముద్రించిన అట్టమీద బొమ్మ అందకపోవటంవల్ల మామూలుగా ముద్రించే యంత్రంమీదనే ఈ సంచిక ముఖచిత్రం వెయ్యడం జరిగింది. ఆఫ్‌సెట్ ముద్రణతో అట్టమీది బొమ్మని వైవారంనించీ వెయ్యగలమనుకుంటున్నాము.

కాగితం కొరతవల్ల ఈ వారం ఎక్కువ పేజీలు వెయ్యలేకపోతున్నాము.

— సంపాదకుడు.

కేన్సర్ అంటే ఏమిటి?

ఈ శతాబ్దంలో మనలను బలి చేసే ఘోర వ్యాధులలో అగ్రతాంబూలం కేన్సరు (పుట్టకురుపు)కు చెందుతుంది. అమెరికాలాంటి దేశాల్లో గుండెజబ్బు తర్వాత మృత్యు కారణమయ్యే మానవ వ్యాధులలో ముఖ్యస్థానం కేన్సరుకిచ్చారు. గ్రీకుభాషలో కేన్సరు అనగా పీత (ఎండ్రకాయ) అని అర్థము. పీతలాగా వ్యాపించే యీ వ్యాధి కణాలలక్షణం వల్ల కలిగిన ఈ పేరును తొలిసారిగ గ్రీకువైద్య పితామహుడగు హిపోక్రటీస్ ప్రయోగిస్తే, తర్వాతిగ రోమనులవల్ల వాడుకలోనికి వచ్చింది. ఇంతకూ కేన్సరు అంటే ఏమిటో కొద్దిగా తెలుసుకొందాం.

శరీర కణజాలంలో ఎక్కడయినా పుట్టే జీవకణాల, అసాధారణ పెరుగుదలను ట్యూమరు అనవచ్చు. ఇవి బినైన్ మరియు మాలిగ్నంటు ట్యూమర్లని రెండు రకాలు. ఒక ప్రాంతంలో నియమితంగా వృద్ధిచెంది అసంఖ్యాకమూ, అసాధారణమూ అయిన జీవకణాల అభివృద్ధి ద్వారా చుట్టూగల ఆరోగ్యవంతమైన కణాలను ఆక్రమించి బలి చేయటం ట్యూమర్ల ముఖ్యలక్షణం. ఇలాంటి మాలిగ్నంటు ట్యూమరునుమనం కేన్సరు అనవచ్చు. ఇంతకూ కేన్సరు (పుట్టకురుపు) అన్నది ఒకేఒక వ్యాధి కాదనీ కొన్ని సాధారణ లక్షణాలు గల ఒకపెద్ద వర్గానికి చెందిన వ్యాధుల స్వరూపమని శాస్త్రజ్ఞులందరు ఒప్పుకున్నదే. వీటన్నింటి కామన్ కేరక్టర్ ఒక్కటే—నిర్విరామంగా కొనసాగే అసంఖ్యాకమైన కణ విభజనలూ, తద్వారా సంభవించే అసాధారణమైన పెరుగుదలా. హార్మోనులు, వైరసులు, రసాయనాలు, వికిరణాలు, పొగాకు వాడకము జీవకణాలపై కలిగే కాన్స్టంట్ ఇరిటేషన్‌లాంటి ప్రభావకాలవల్ల కేన్సరు సాధారణంగా రావచ్చు. కేన్సరు ప్రవాహానికి గురయ్యే మానవ శరీరభాగాలు— చర్మము, పెదవులు, మరియు నోరు, స్వరపేటిక, గొంతు, జీర్ణకోశము, పేగు, రొమ్ము, శ్వాసకోశాలు ముఖ్యమైనవి. అంతేగాక ల్యూకేమియా, హాడ్జ్‌కిన్స్ డిసీజ్, మరియు లింఫోసార్కోమా అన్న వాటిని కేన్సరు అనుబంధ వ్యాధులుగ పరిగణిస్తున్నారు.

కేన్సరు ఎలా వస్తుంది?

కేన్సరు ఎలా వస్తుంది? అన్న అంశంపై కొనసాగిన శాస్త్ర పరిశోధనలు చాల సందర్భాల్లో తృప్తికరమైన సమాధానాన్ని పొందలేకపోయాయనే చెప్పవచ్చు. పుట్టకురుపు దానంతటదే స్వతస్సిద్ధంగా వస్తుందన్న జవాబుతో ఇప్పటికి ఈ అంశాన్ని సరిపుచ్చుకుంటున్నారు. భయంకరమైన ఈ వ్యాధి నివారణకు ప్రస్తుతం వ్యాప్తి చెందిన చికిత్సా విధానాలు—సర్జరీ, కీమోథెరపీ, రేడియేషన్ థెరపీ అన్న మూడు మాత్రమే వున్నాయి. అయినా శరీర భాగాల్లో వ్యాప్తిచెందిన ట్యూమర్లను శస్త్రచికిత్స ద్వారా తొలగించే సాధారణ వైద్యవిధానం సర్జరీ. అలాగాక రసాయన ఔషధాలను రోగికివ్వటం ద్వారాను, రేడియేషన్ల ప్రభావానికి కేన్సరు కణాలను గురి చేయుటం ద్వారాను ఈ వ్యాధి నివారణకుపయోగంలో వున్న నవీన పద్ధతులే కీమోథెరపీ మరియు రేడియేషన్ థెరపీ.


నివారణ:

పుట్టకురుపు నివారణ కీమోథెరపీ విధానంపై ప్రాథమిక పరిశోధనలు సాగించినవారు ప్రఖ్యాత సర్జనగు డాక్టర్ చార్లెస్‌హగ్గిన్స్. 1941 వ సంవత్సర ప్రాంతాల్లో కేన్సరు వ్యాధి హార్మోనుల ప్రభావానికి లొంగి వుంటుందన్న అంశం ఆధారంగా బ్రెస్ట్ మరియు ప్రోస్టేటు కేన్సరు రోగులకు టెస్టోస్టిరోన్, స్టిల్‌బెస్ట్రాల్, హెక్సెస్ట్రాల్ లాంటి హార్మోను పదార్థాలను ప్రయోగించి సత్ఫలితాలను పొందాడాయన. ఇలాగే కార్టిసోన్, పొడోఫిల్లిన్, విన్‌బ్లాస్టిన్, విన్‌క్రిస్టిన్ల వాడకం ద్వారా ఇతర శరీరభాగాల్లో వచ్చే పుట్టకురుపు నివారణకు తగు ఫలితాలను పొందవచ్చని శాస్త్రజ్ఞుల విశ్వాసం.

ఈసందర్భంగా ఒక ముఖ్యవిషయం మనం పేర్కొనవచ్చు. ఈ శతాబ్దంలో జరిగిన రెండు ప్రపంచ యుద్ధ కాలాల్లో మానవ శరీరకణాలను హరించే సైటోటాక్సిక్ రసాయనాలను గూర్చిన శాస్త్ర పరిశోధనలు భారీగా కొనసాగాయి. ఈ పరిశోధనల సందర్భంగా వెలువడ్డ రసాయనాలగు నైట్రోజన్, సైక్లో ఫాస్ఫమైడ్, ట్రై ఎథిలీన్ వంటివి వెలువడ్డాయి. కొరెంబుసిల్, బ్యూసల్ఫాన్ ఇత్యాదులు కేన్సరు కణాల నాశనానికి అద్భుత ఫలితాలనిస్తాయని గుర్తించబడ్డాయి. మంచి—చెడూ కలిసి వుంటాయంటే ఇదేనేమో? మరి!

వ్యాధినిరోధం

కేన్సరు కణాల సర్వనాశనాన్నిపై అంశాలద్వారా సాధించటానికి ఎన్నో ప్రయత్నాలు చేస్తున్నారు. అసలు ఈ వ్యాధి కణాలే పుట్టకుండా చేస్తే సరిపోదా? రియల్లీ, ఎ గుడ్ ఐడియా! కానీ—ఇది సాధించటానికి జీవకణ స్వరూపాన్ని, కేంద్రక నిర్మాణాన్ని గూర్చిన విషయాలు కావాలి మరి, ఈ అంశంపై కొనసాగిన పరిశోధనలు కేన్సరుకణాల్లో డిఎన్ఏ సింథసిస్‌ని కట్టడానికి తగిన అంటే—మెటబోలైట్ వగైరా



ల్లాలను వాడుకలోనికి తెచ్చాయి. కెమోతెరపీ విధానం ఇలా ఆవిష్కరింపబడ్డ 6— మెర్కాప్టోప్యూరీన్, 8—ఎజాగ్వానీన్, 5— ఫ్లోరోయురసిల్, ఎమెతాప్టరీన్, ఎజాసెరీన్ లాంటివి ఎన్నో రకాలపుట్ట కురుపులపై తృప్తికరమైన ఫలితాలనే ఇచ్చాయి.

నూతన చికిత్సా విధానం

సర్జరీ, కీమోతెరపీ లేగాక వైద్యరంగంలో కేన్సర్ నివారణకుపయోగించబడుతున్న నూతన చికిత్సా విధానం రేడియేషన్ తెరపీ. రేడియేషన్లకు గల అయనీకరణము అన్నముఖ్యలక్షణం ఆధారంగా పుట్ట కురుపు కణాలపై యీ వికిరణజాలం వ్యక్తపరిచే ప్రభావాన్ని శాస్త్రజ్ఞులు గుర్తించటంతో రేడియేషన్ తెరపీ వైద్య చరిత్రలో ప్రారంభమయిందనవచ్చు. ఈరంగంలో ప్రాథమికంగా రాంట్‌జన్ ఎక్స్‌కిరణాలు, క్యూరీల రేడియంతో ప్రారంభమైన పరిశోధనలు తర్వాత గామాకిరణాలు, ఎలెక్ట్రానులు, ప్రోటానులు, న్యూట్రానులు, పై-మీసానులు మున్నగు వాటిని కేన్సరు వ్యాధి నివారణకు తగినవాటిగా శాస్త్రజ్ఞుల గుర్తింపుతో కొనసాగాయి. కాని పై అంశాల్లో ఒకటయిన రేడియం విలువ గ్రాముకు సుమారు 1,87,000 రూపాయలు కావటంవల్లా, కేన్సరు రోగి చికిత్సకు ఒక్కొక్క వ్యక్తికి చాల గ్రాముల రేడియం కావలసి వుండటం వల్లా రేడియం తెరపీ సామాన్యుడి కందుబాటులో లేని చికిత్సయింది.

కోబాల్ట్ బాంబ్స్

ఈ అడ్డంకి నధిగమించటానికి కొనసాగిన పదార్థ విజ్ఞాన శాస్త్ర పరిశోధనల ద్వారా వ్యాప్తి చెందిన హై ఎనర్జీ ఏక్సిలరేటర్సు, ఎటామిక్ రియాక్టర్సు, సైక్లోట్రానులు రేడియం కన్నా అధికశక్తివంతమయిన ఎలెక్ట్రానులకు, రేడియోయాక్టివ్ ఐసొటోపులను వైద్య ప్రపంచానికి వెల్లడించాయి. ఈ పరిశోధనలు కేన్సరు చికిత్సకు సంబంధించిన వైద్య చరిత్రలో విప్లవాత్మకంగా రూపొందాయనవచ్చు. తత్ఫలితంగా నేడు ఎన్నో వైద్య శాలల్లో రేడియం స్థానంలో కోబాల్ట్ బాంబ్స్ వినియోగించబడుతున్నాయి. ఈ విధానంలో వుపయోగించబడే రేడియోయాక్టివ్ కోబాల్ట్ యూనిట్లునుండి వెలువడే గామా రేడియేషను 2.5 మెగాఎలెక్ట్రాను వోల్టుల ఎక్స్—కిరణాల ప్రభావానికి సమానంగా చొచ్చుకొనిపోయే సామర్థ్యం (Pene trating Power.) కలిగి వుంది. అంతేగాక ఈ పదార్థాన్ని సులభవిధానాల భారీ ఎత్తున కూడా పొందే సౌకర్యం వుంది.

ఓషధులు, సర్పవిషాలతో చికిత్స

అదేవిధంగా రేడియోయాక్టివ్ ఐసొటోపులయిన కిరణధార్మిక అయోడిన్ మరియు ఫాస్ఫరస్‌లు థైరాయిడ్ మరియు బ్లడ్ కేన్సర్ల నివారణలో విస్తృతంగా వ్యాప్తిలోనికి వచ్చాయి. ఇవేగాక ధర్మల్ న్యూట్రాన్లపై గాలించబడ్డ వైద్య పరిశోధనలు కొన్ని రకాల బ్రెయిన్ కేన్సర్ల చికిత్సలో సత్ఫలితాల నిస్తాయని గుర్తించబడ్డాయి. ప్రస్తుతం అమెరికాలోని బ్రూక్‌హావెన్ నేషనల్ లేబరేటరీలోను, మెసాచుసెట్స్ ఇన్స్‌టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ వికాగంలోను, లాస్ ఎలామోస్ సైంటిఫిక్ లేబరేటరీలోను లండన్‌లోని చెస్టర్ బియుట్టీ రిసర్చ్ ఇన్స్‌టిట్యూట్ లోను ఈ రంగంలో కేన్సరు వ్యాధిపై విస్తృతమైన ప్రయోగాలు కొనసాగించుతున్నాయి. కేన్సరు పరిశోధనలకు ప్రాముఖ్యంగా పనిచేస్తున్న శాస్త్రజ్ఞుల బృందాలకు భారతదేశం కూడా నీమీ తీసిపోదు. ఇండియన్ కేన్సరుకు రిసర్చి ఇన్స్‌టిట్యూట్‌కు చెందిన వైద్యశాస్త్రజ్ఞులు (డాక్టర్స్ బగాంకా, పాన్‌సే, పేమాస్టర్, సంఘ్వీ ఇత్యాదులు) ఓషధులు, సర్పవిషాలూ వుపయోగించి కేన్సరు నివారణకు ప్రయోగాలు గావిస్తున్నారు. అంతే గాక ట్రాంబే ఎటామిక్ ఎనర్జీ ఎస్టాబ్లిష్‌మెంటుకు చెందిన డాక్టర్ గోపాల అయ్యంగార్ అధ్వర్యంలో కేన్సరుపై ఐసొటోపుల ప్రభావాన్ని గూర్చిన పరిశోధనలు బహుముఖంగా సాగుతున్నాయి.

కొత్త ప్రయోగాలు

ఈ విధంగా కేన్సరు వ్యాధి నివారణకు వైద్య రంగంలో గత కొన్ని దశాబ్దాలుగా సాగుతున్న పరిశోధనలే గాక జీవ భౌతిక, జీవరసాయన విభాగాల్లోను, ఎంజైమ్ కెమిస్ట్రీ మరియు మాలిక్యులార్ బయాలజీ రంగాల్లోను జరుగుతూవుండే ఎన్నో పరిశోధనలు త్వరలో మనం కేన్సరు బారినుండి బైట పడే రీతిన కొనసాగుతున్నాయనవచ్చు. అంతేగాక కేన్సరు రాకకు ముఖ్యకారణం డిఎన్ఎ అణునిర్మాణంలోని సంకేతస్వరూపంలో వచ్చే ఆకస్మికమార్పు అన్న అంశాన్ని నవీనపరిశోధనలు బాగా ధృవపర్చాయి. ఈ మార్పును సరిదిద్ద గలిగితే కేన్సరు పుట్టుకను నివ్వందేహంగా మనం అరికట్ట గలమన్న ఆశ చాల మందిలో కలిగిందికూడా, మరియు నేడు డిఎన్ఎ అణువుపై శాస్త్రరంగంలో కొనసాగుతున్న అతి ప్రాముఖ్యమైన పరిశోధనలకు మార్గదర్శకము లయిన డాక్టర్ కొరాన్ మరియు నీరెన్‌బర్గుల వంటి వారి ప్రయోగాలు ఎందరో జీవరసాయన వైద్య శాస్త్రజ్ఞులకు వెలుగుబాట చూపిస్తూ కేన్సరేగాక అలాంటి వ్యాధులెన్నింటినో సమూలంగా రూపు మాపే శుభదినం దగ్గరలోనే వుందని ఆశిద్దాం. మేగాక్ బ్లిస్‌ఆజు ఇన్‌దిస్ వెంచర్ !!

—పి. రమేష్‌నారాయణ

అమ్మ, అమృతమే గదమ్మ అవనిలో
అమ్మలేని నా జీవితమే నిరర్థక నిర్భరమమ్మ
అయ్యో నీవులేని నన్నాదరించు వారెవరమ్మ
అకటా! నన్నేల వదలి వెడలితివమ్మ

అధర రసమాశించిన అధమనమ్మ
అమ్మ అని అరచి చిద్భ్రాంతినైతినమ్మ
అకళంక, నీ నామ స్మరణయే గతియమ్మ
అశ్రుధారలు, ధారావాహినిగా గురిపించి స్పృశింతునమ్మ

అమ్మా, అమ్మా, నీవే నాఅమ్మవమ్మ
అచిరములో నీలో ఐక్యమై పోదునమ్మ
అమ్మా అనురాగముతో అంజలి ఘటించెదనమ్మ
అమ్మ నీ లాలన మెరుంగని నిర్భాగ్యనమ్మ

అమ్మవడిలో తలదూర్చినచో వేదన వటాపంచలవానమ్మ
అమ్మ, సావిత్రమ్మ నన్ను మురిపించి పోలేదమ్మ నీవు
అమ్మ, నీ అనుంగుబిడ్డ లోకానికే అమ్మనైతినమ్మ
అమ్మ, నీ ఆత్మశాంతికి నంకితమిచ్చితి నమ్మరో

రచయిత్రి : శివభక్తురాలు.

(శ్లోకాలు రాసిన వారిపేరు భారతదేశంలో వారందరికీ సుపరిచితమే కావి వారి కోరిక పయిన మారు పేరుతోనే ప్రచురిస్తున్నాము— సం)

ఎన్నికల ఫలితాలని విని గుండె పగిలి మరణించిన వ్యక్తి

సంయుక్త సోషలిస్టుపార్టీ నాయకుడు మధూలిమాయే, జార్జిఫెర్నాండెస్ మొదలైన వారు ఎన్నికలలో ఓడిపోయారన్న విషయాన్ని రేడియోలో విన్న మునియాండి అనే ఆయన (రాజపాళం సంయుక్త సోషలిస్టుపార్టీవ్యక్తి) గుమ్మన వ్రుహితప్పి క్రిందపడిపోయారట. ఆసుపత్రిలో చేర్చేసరికి, ఫలితంలేక ఆయన చనిపోయారట.

అడవి జంతువులకి ఆహుతి అయిన ఎన్నికల అధికారి

హిమాచల్‌ప్రదేశ్‌లో సిర్మోర్ అనేచోట ఎన్నికల అధికారిగా వెళ్ళిన 24 ఏళ్ళ మంగారామ్ అనే ఆయన పోలింగు పూర్తిఅయ్యాక, థియోరిఘాట్ అనే చోటునుంచి వెళ్తుండగా అడవిజంతువులు, ఆయన్ని తినేశాయట. అవి తినగా మిగిలిన శరీరాన్ని 9వ తేదీ వుదయాన్నే పోలీసులు చేజిక్కించుకున్నారట--దేని కొరకు!!



ఒక వారం విపరీతం

పాఠకుడు

కూరలో విషం?

రెంటాడి (సోలింఘుర్) గ్రామంలో వళ్ళియమ్మ అనే ఆమె తను చేసిన కూర, కుళంబు, తన కొడుకు మునిక్రిష్ణన్‌కుపెట్టి, తనూ తిన్నదట. అనక ఆమె మరో కొడుకు షణ్ముగం, పక్కింటి మునియమ్మ అనే అమ్మాయి ఆ కుళంబు రుచిచూశారట. వళ్ళియమ్మ మునిక్రిష్ణన్ మాత్రం చనిపోయారట. మిగతా యిద్దరూ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారట. ఆ కుళంబు కూరల్లో విషం వచ్చిందని తేలినా అదెలా వచ్చిందో తేలవలసి వున్నది.

అప్పు — తాకట్టు — హత్య

పచ్చికానవల్లిలో నల్లప్పన్ అనే 45 ఏళ్ళ అతను తన అన్నగారు నాదప్పన్‌వద్ద 150 రూపాయలు అప్పు తీసుకున్నాడట. నల్లప్పన్ తమ్ముడు అణ్ణామలై నల్లప్పన్ భార్య నగలు ఎక్కడో తాకట్టు పెట్టాడట. తన అన్నగారు తనని డబ్బు తీర్చేయమనడంతోసరికి నల్లప్పన్ తన తమ్ముడు అణ్ణామలైని ఆ నగలు తీసుకు రమ్మన్నాడట. దాంతో నాదప్పన్ అణ్ణామలై కలసి నల్లప్పన్‌ని కొడవలితోనూ, కర్రతోనూ కొట్టి చంపేశారట.

అబలని బెదిరించి నగల దోపిడీ

ముజాఫర్‌పూరులో ఒకామె యింట్లో ఏడవ తేదీరాత్రి ఇద్దరు దొంగలు పడి తుపాకులు గురిపెట్టి నీకున్న నగా నట్రా అన్నీ యిస్తావా— లేక నీ కూతుర్ని ఎత్తుకు పొమ్మంటావా! ఏదో ఒకటి ఆలోచించి తేల్చుకో అనే సరికామె క్షణం కూడా ఆలోచించకుండా ఇనప్పెట్టె తీసి, తన విలువైన నగలన్నీ ఓ పెద్ద మూటకట్టి ఆ దొంగలకు నైవేద్యం పెట్టిందట—షింయాత్తె మదర్!

* * *

పాసారపట్టిలో మాదప్పగవుండర్ అనే ఆయన తన భార్య అముద, చెల్లెలు కుముదను కూడా తనే పెళ్ళి చేసుకోవాలనుకున్నాడట. రాని దాసన్ అనే అతను కుముదను ప్రేమించి, పెళ్ళి చేసుకుంటానని మాట యిచ్చాడట. ఈమాటవిన్న మాదప్పగవుండర్‌కు కోపం వచ్చి, దాసన్ని తుపాకితో కాల్చి చంపేశాడట.

బట్టలషాపులో రు. 5000 అపహరణ

హైదరాబాదు కింగ్ కోఠీరోడ్డులో వున్న ఒక బట్టల షాపుకు ఓ యిద్దరు వ్యక్తులు వచ్చి చేతికందిన 5 వేల రూపాయలు ఊడలాక్కుని, రెడీగావున్న కారులో పారిపోయారట. దీన్ని గురించి పోలీసు విచారిస్తున్నది.


కొలనులో శవం

బెంగుళూరు బురిఫోసు కంపెనీలో పని చేస్తున్న టి. సర్కార్ అనే అతని శవం వైట్‌ఫీల్డ్ అనేచోట ఒక కొలనులో దొరికిందట. బహుశా ఆత్మహత్య అయ్యుండవచ్చని పోలీసు అభిప్రాయపడుతోందట.

చింపాంజీ చేష్టలు!

పిల్లలులేని ఓ డేవిస్ దంపతులు కాలిఫోర్నియాలో ఓ చింపాజీని పెంచుకున్నారట. అయితే చింపాంజీ పెంపుడు జంతువుకాదని, అడవి మృగమనీ కనుక పెంచుకో వీల్లేదని వారిపక్కింటాయన కేసుపెట్టాడట. ఆ చింపాంజీ తనముఖం తానే కడుక్కుని, పౌడరు రాసుకుంటుందట. బట్టలూ తానే తొడుక్కుంటుందట. ఫోర్కు, కత్తి ఉపయోగించి తినగలదట. గ్లాసుతో పానీయాలు తాగగలదట. ఈ చింపాంజీ చాలా తెలివైనది. కోర్టులోనూ, బయటా దీని ప్రవర్తనను చూసి చెప్పినవారే వున్నారు. కొండొకచో మనిషి కన్నా కూడా మంచి మర్యాద తెలిసినదానిలా ప్రవర్తిస్తోంది. కనుక దీనిని క్రూర జంతువనీ, అడవి మృగమనీ అనడం సబబు కాదు అని జడ్జిగారు కేసు కొట్టి పారేశారట. తనను గెలిపించిన జడ్జిగారితో చింపాంజీ కరచాలనం (షేక్‌హ్యాండ్) చేసిందట.





ఒకవారం విపరీతాలు

న్యూయార్క్ ఘరానా దొంగలు!

న్యూయార్క్ షాపుల్లో ఘరానా దొంగలు వీరవిహారం చేస్తున్నారట. కొనుక్కోడానికి వచ్చినట్టే వచ్చి అదుందా, యిదుందా అనడిగి, వెళ్ళేటపుడు చేతికి అందినది పట్టుకుపోతున్నారట. వీరిని పట్టుకోడానికి, తెల్సుకోడానికి టెలివిజను కెమెరాలు, మఫ్టీ సి.ఐ.డి.లను పెట్టి యింకా నానాయాతనా పడుతున్నారటక్కడ— దట్సజ ఫారిన్!!

జీప్ ప్రమాదంలో ఇన్‌స్పెక్టర్ మరణం!

పుదుక్కోటలో ఎన్నికల పనులు చూసుకుని, మద్రాసుకు తిరిగివెళ్తున్న పోలీసు ఇన్‌స్పెక్టరు కిలార్ అనే ఆయన జీపును సీలావట్టం అనే ప్రాంతంలో వో లారీ గుద్దిందట. దాంతో బుర్రపగలి, ఆయన అక్కడికక్కడే చనిపోయారట.

పట్టాలుతప్పిన ఐలెండ్ ఎక్స్‌ప్రెస్

12వ తేదీ వుదయం 4 గంటలకు తిరుపత్తూర్ స్టేషన్ వదలి, వో పది మైళ్ళ దూరం పరుగెత్తిన ఐలెండ్ ఎక్స్‌ప్రెస్ తిరగబడి పోయిందట. ఇంజను ఇంజనుతోపాటు వో నాలుగుపెట్టెలు కూడా తిరుగబడిపోయాయట. రైలుమార్గం మంచి పట్టాను తొలగించారుట ఎవరో దుండగులు. దీనివల్ల ఈ రైలు నేలమీదికి దిగి, ఫర్లాంగు పరుగెత్తి అనక తిరుగబడిపోయిందట. ఈ ప్రమాదంలో చావులు ఏమీ లేవని, 29 మంది గాయపడ్డారనీ తేలింది.

నయ వంచకుడు

నీకూతుర్ని నాకిచ్చి పెళ్ళిచేయుము అని కణ్ణాయ అనే అతను వెళ్ళసామి అనే అతనిని అడిగాడట. కానీ, వెళ్ళస్వామి తన కూతురు కిష్టంలేని సంబంధం తాను చేయనని, అనేసరికి కణ్ణయ్య కోపంతో వళ్ళదానట్టే వెళ్ళిపోయాడట. అనక ఒక రోజున కళింగ పట్టిలో వున్న తన పెద్దకూతుర్ని చూడ్డానికి వెళ్ళిస్వామివెళ్ళేసరికి కణ్ణయ్య అతన్ని వళ్ళదానట్టికి తీసుకు వెళ్ళి 10రోజులు తనకు అతిథిగా వుంచుకుని, అనక ఆ వూరు పక్కనున్న అడవికి తీసుకువెళ్ళి అక్కడ ఆయన్ను హత్య చేశాడట.

* * *

బెంగుళూరుకు చెందిన సెంగుణం అనే వూరిలో 70 ఏళ్ళ అబ్దుల్ గపూర్ అనే అతను గణపతిగవుండర్ అనే ఆయన మిరపతోటలో జొరపడి, మిరపకాయ, కోసుకుంటున్నాడట. గణపతి గవుండర్ కొడుకు 28 ఏళ్ళ సాము గవుండర్ అది చూసి, అబ్దుల్‌గపూర్‌ను చితకబాదాడట. విపరీతమైన గాయాలతో వేలూర్ ఆసుపత్రిలో చేరాక గపూర్ చనిపోయాడట.

* * *

చెక్కు చెదరని శవం

మాడ్రిడ్‌లోని సెయింట్ బార్బరా చర్చిలో 344 ఏళ్ళ క్రితం చనిపోయిన ఒకామె భౌతిక దేహం వో గాజు తొట్టెవంటి దానిలో భద్రపరచారట. అది ఈ నాటికీ చెక్కు చెదరకుండా వున్నదట, ఇది చాలా ఆశ్చర్యకర విషయమని, శరీరం కొంచెం కూడా కుళ్ళిపోకుండా ఇన్నేళ్ళు, ఇన్నాళ్ళు వుండడం విజ్ఞానశాస్త్రానిక్కూడా అంతు దొరకటంలేదని జోసిష్టో రెన్ను గాసియోనా అనే ఆయన అన్నారట.

నేలవిడిచి సాము!

రష్యా వారి ఆహారాలలో బంగాళదుంపలే ఎక్కువట. అలాంటి బంగాళ దుంపలకు కరువు వచ్చిందటక్కడ. పోయిన ఫిబ్రవరినుంచీ అన్నీ చెడ్డదుంపలే అమ్మబడుతున్నాయట. మనకురాకెట్లున్నాయి. స్పుత్నిక్కులున్నాయి. అవునా!! ఎందుకివన్నీ...భూమి వదిలి మరో గ్రహానికి పరుగెడుతున్నామా! ఎందుకు!! ఈ కుళ్ళుదుంపలను కూడా అక్కడకు పట్టుకెళ్ళమనండి అన్నదటొకావిడ వాళ్ళ మండి. తాను కొన్న 21 బంగాళ దుంపల్లో అయిదు మంచివి దొరికాయని, అవి కూడా కుళ్ళిన భాగాలు కోసేస్తేనె తినడానికి పనికొస్తాయని ఒకాయనన్నారట— పాపం కదా!!




తల్లి పాలవల్ల కాన్సర్!

తల్లి పాలలో కలిసివచ్చే వోవిధమైన రసికాన్సరులో పుట్టించే గుణం వుందని, బ్రెస్ట్‌కాన్సర్ చనుపాలు ద్వారా పిల్లలకు చేరుతోందని వాషింగ్టన్‌లో విజ్ఞాన శాస్త్రం వివరించిందట. 56 మంది స్త్రీల చనుపాలను పరీక్షించిన మీదట బ్రెస్ట్‌కాన్సరుకు సంబంధించిన విషయాలు ఆ పాలలో వున్నట్లు తేల్చారట. కామెన్, న్యూజర్సీ, డెట్రాయిట్, మిచిగాన్, బొంబాయి విజ్ఞాన వేత్తలీ విషయాన్ని ఏకగ్రీవంగా ఆమోదించారట. కనుక.......

ఫిలిప్పైన్స్ పురోగమనం!

హాలీవుడ్ సెక్స్ సినిమాలతో ముఖాముఖి పోటీ చేస్తూ ఫిలిప్పైన్స్ సినిమాలు ఏకంగా దిగంబరత్వాన్నే ప్రవేశ పెట్టాయటీటీవల. ఈ జోరు పెరిగినందువల్ల చివరికి ప్రెసిడెంటు ఫెర్డినాండ్ మార్కోస్ కూడా జోక్యం కలుగ జేసుకున్నారట. సెన్సారువారు స్త్రీల వస్త్ర ధారణలో బొడ్డుకు పైభాగం ఆచ్ఛాదన లేక పోయినా ఫరవాలేదని, అయితే ఆ సందర్భంలో ఏవిధమైన అశ్లీలపు మాటలూ వుండకూడదని, అన్నారట. డబ్బిచ్చి చూస్తున్న ప్రజలు దేనిని చూడగోర్తారో దానిని చూపడమే కర్తవ్యమని, న్యాయమని, ప్రముఖులలో ఒకాయనన్నారట. సినిమా సాంతం అయిపోయాక యిలాంటి దృశ్యాలన్నిటినీ టోకున చూపిస్తున్నందువల్ల, అక్కడ సినిమా ఆయ్యే వెళ్ళేకే జనం భక్తి శ్రద్ధలతో కూర్చుంటున్నారట. అహా!! హుశాఫార్ యిబాజా ఫిలిప్పైన్స్ ప్రమిండియా!! ●



అయిదు పాత్రలలోని వైవిధ్యం!



అక్కినేని నాగేశ్వరరావుతో ఇంటర్వ్యూ!

హోటల్ సవేరాలోని రూము నెం.31లో ప్రవేశించాము. హీరో అక్కినేని 'పవిత్రబంధం' డి. సి. ఆర్. ను చూస్తున్నారు.

ప్ర : మీకు గుర్తుందా? దేవదాసు, బాటసారి, లైలామజ్ను, అనార్కలి, విప్రనారాయణ పాత్రల వైవిధ్యం గురించి ఒక ప్రశ్న వేసాను. తీరికగా చెపుతానన్నారు. అందుకే వచ్చాను.

జ : మీరు అడిగిన అయిదు పాత్రలు పవిత్రమైనవి, ఉదాత్తమైనవి, క్లిష్టమైనవి మరియు ఒక నటుడి శక్తిని పరీక్షించేవి. ఈ పాత్రలను పోషించే అవకాశం నాకు రావడం, ఆ పాత్రల్ని బాగా నటించానన్న పేరు రావడం నా ఒక్కడిపైన ఆధారపడలేదు అని బల్లగుద్ది చెప్పగలను.

ప్ర : మరి యింకెవ్వరు బాధ్యులో చెప్పగలరా ?

జ : పాత్రలు పవిత్రమైనవి; తీసిన వాళ్ళందరూ గట్టివాళ్ళు; అనుభవజ్ఞులు. నిర్మాతకు, దర్శకునికి రచయితకు శుద్ధి, సిద్ధి వుండేవి. నేను కూడా భయ, భక్తులతో ఆ పాత్రల అంతరాంతరాల్లోకి వెళ్ళి, రాత్రింబగళ్ళు పాత్రల స్వభావాన్ని జీర్ణించుకుని నటించేవాడ్ని. పరమభక్తునికి దేవుడిపట్ల ఎంత ఏకాగ్రత వుంటుందో, ఆ పాత్రలపట్ల నాకు అంత ధ్యేయం వుండేది.

ప్ర : లైలా మజ్నులోని ఖయిస్‌కు, విప్రనారాయణలోని రంగనాథ భక్తునికి గల వ్యత్యాసం ఏమిటి ?

జ : మజ్ను పిచ్చివాడు; లైలా తప్ప మరో ప్రపంచం తెలియదు. తన్ను రాళ్ళతో కొట్టినా, తన్నుచూచి పరులు అసహ్యించుకున్నా పట్టించుకోడు; ప్రేమభక్తుడు. లైలాను మనస్సులో ముద్రించుకుని, ఆమె కోసం పరితపించిన భగ్నప్రేమికుడు ఖయిస్.

విప్రనారాయణకు శ్రీ రంగనాథుని సేవ తప్ప మరేమీ తెలియదు. పరమ భాగవతోత్తముడు. తన జీవితాన్ని ఆ పరంధామునికి అంకితం చేసిన భక్తాగ్రేసరుడు; ఒక రోజు దేవదేవిని చూస్తాడు. ఆమె క్రీగంటి చూపులకు, వలపు బాణాలకు లొంగిపోతాడు. ఆమె రూపాన్ని తన రంగనాథుని స్థానంలో ప్రతిష్ఠించుకుంటాడు. జగన్నాథునిపై కేంద్రీకరించిన భక్తిపారాన్ని దేవదేవిపై మరల్చి ఆమెలో తనస్వామిని చూడగలిగాడు. ఆమెతోపాటు రంగనాథుని సాన్నిధ్యాన్ని చేరుకున్న పవిత్ర మూర్తియే విప్రనారాయణుడు.

ప్ర : దేవదాసు ప్రేమకు, అనార్కలిలోని సలీమ్ ప్రేమకు గల తేడా యేమిటి?

జ : పిచ్చి ప్రేమికుడు. అందుకే తన మనస్సు యెవరిపట్ల లగ్నం అయిందో తెలుసుకోలేక, తల్లి తండ్రులకోసం తన ప్రేమస్వరూపిణి పార్వతిని చేతులారా పోగొట్టుకుంటాడు. పార్వతి అన్యాక్రాంత మయిన తర్వాత, ఆమెను మరువలేక, పొందలేక త్రాగుడుకు లోనై, అవసానదశలో తన పార్వతి గుమ్మంలో ప్రాణం విడచిన అభాగ్య ప్రేమికుడు దేవదాసు.

సలీమ్ రాచబిడ్డ. కాని పేదరాలికి మనసిస్తాడు; రాచరికపు బాధ్యతలను, ఆచారాలను విస్మరించి, తండ్రిని యెదిరించి తన ప్రేయసి జీవసమాధినుండి తలబాదుకుని విలపించిన భగ్నప్రేమికుడే అనార్కలి ప్రియుడు.

ప్ర . 'బాటసారి! సురేన్ గురించి...?

జ : తను యీ ప్రపంచానికి అల్లంత దూరంలో వుండాలనుకుంటాడు. ధ్యేయం లేకుండా పైచదువులు చదువుతాడు. ఒక చోట ట్యూషను మాష్టరుగా చేరుతాడు. అక్కడ ఒక కమ్మని పాటను వింటాడు. ఆమెయే మాధవి. ఆమెను మనస్సులో ఆరాధిస్తాడు; అభిమానిస్తాడు—కాదు—కాదు—పూజిస్తాడు—ఏం చేస్తున్నాడో అతనికి తెలియదు. ఇతరులు తన్ను ప్రేమిస్తున్నారో లేదో తెలుసుకోలేడు. మాధవి పాడిలో ప్రాణత్యాగం చేసేవరకు సురేన్‌కు తెలియదు. ఆమెను తను అభిమానిస్తున్నట్టు.

ప్ర: ఇప్పుడెవరయినా మిమ్మల్ని ఆ పాత్రల్లో నటించమని అడిగితే ఒప్పు

కుంటారా ?

జ : అంతటి ఏకాగ్రత, పవిత్రత, జాగరూకత యిప్పట్లో యెవరికయినా వుందంటారా ? అలా రచించడం, చిత్రీకరించడం, నటించడం క్రమంగా కుదురుతుందంటారా ? ఏమో — నాకేమో సందేహంగానే వుంది. మరలా అలాంటి పవిత్రమైన పాత్రలకు పరిపూర్ణన్యాయం జరగడం కష్టమనిపిస్తుంది.

ప్ర : దేముడిపై మీకు నమ్మకముందా? తిరుపతి కొండపైకి వెళ్ళితే నమస్కరిస్తారా ?

జ : దేముడు వున్నాడా లేడా అని రిసెర్చి చెయ్యడానికి యీ జీవితం చాలదు. నేను మానవుడిగా కనీస ధర్మాన్ని నెరవేరుస్తున్నాను. కొండపైకి వెడితే, నమస్కారం అందరితోబాటు నేను పెడతాను.

ప్ర : నమస్కరించేటప్పుడు, వరాన్నేదయినా కోరుతారా ?

జ : మనం మంచివాళ్ళమయితే, దేముడు అనేవాడుంటే ఆయనే మనకు సహాయం చేస్తాడు. నేనూ ఏ వరాన్ని కోరను.

ప్ర : మీ స్నేహితులకు మూఢనమ్మకాలుంటే, వారిని వారిస్తారా ?

జ : ఎవరి అభిరుచులు వారివి నా బిడ్డలు కొలిచినా నేను అడ్డు చెప్పను.

ప్ర: మీరు ఆస్తిలో అందరికీ (మగ, ఆడబిడ్డలకు) సమభాగం యిస్తారా?

జ : ఆస్తిని ఏడు భాగాలు చేసి, నాకు, అన్నపూర్ణకు, నా అయిదుగురు బిడ్డలకు సమానంగా పంచి యిస్తాను.

ప్ర : మీ అమ్మాయి పెండ్లి ఎప్పుడు? శాస్త్రయుక్తంగా పెండ్లి చేస్తారా...లేక ?

జ : పెండ్లి ఒకరు చేసే పని కాదుగా. ఎదుటివాళ్ళ తృప్తికోసం మనం కొన్ని చెయ్యక తప్పదు. వేదోక్తంగా పెండ్లి జరుగుతుంది. హైద్రాబాదులో మే 7 న రాత్రి గం. 10:20 ని. లకు ముహూర్తం నిశ్చయమైంది.

ప్ర : మీరు ఏ సంస్థ స్థాపించినా మీ భార్యపేరు పెడతారు ? ప్రత్యేక కారణం...?

జ : 'అన్నపూర్ణ' అంటే అన్నం ప్రసాదించే కల్పవల్లి. భారతదేశంయొక్క ప్రతిరూపం 'అన్నపూర్ణ' నామం. నాభార్య పేరుకూడా అదే కావడంవల్ల మీకు ఈ సందేహం కలిగి వుండొచ్చు.

ప్ర : మన దేశానికి 'ప్రజాస్వామ్యం' ఉపయోగ కరమేనా ?

జ : డెమొక్రసీ ఈజ్ ఏ నెసెస్సిటీ ఫార్ ఎనీ నేషన్. బట్... వోటు విలువను వివరించి, ఆ వోటును సద్వినియోగం చేసే పద్ధతి తెలిసిన పిదప ప్రజాస్వామ్యం వచ్చి వుంటే మనదేశం ఆరోగ్యకరంగా వుండేదేమో అనిపిస్తుంది.

ప్ర : మీకు ఎలెక్షన్‌లో నిలిచే అయిడియా వుందా ?

జ : ఇప్పటికి లేదు. మున్ముందు అయిడియా రాదు అని చెప్పలేను.

ప్ర : ఎన్. టి. ఆర్. నటనపై మీ అభిప్రాయం !

జ : మనకున్న ఉత్తమనటుల్లో రామారావుగారు ఒకరు. ఆయన నటించిన రావణాసురుడిపాత్ర నాకు బాగా నచ్చింది. పురాణ పాత్రలకు సరికొత్త రూపకల్పన చేసారు ఎన్. టి. ఆర్.

ప్ర : మీరు, ఎన్. టి. ఆర్. కలిసి నటించే అవకాశం వుందా ?

జ : మా యిద్దరినీ భరించే నిర్మాత వుండాలి. ఇద్దరికీ సరిపడే పాత్రలుండాలి? ఇద్దరినీ తృప్తిపరచాలి. ఎవరిచిత్రాలు వారికున్నాయిగా. అయినా, మేమిద్దరం కలిసి 11 చిత్రాల్లో యింతకుముందు నటించి వున్నాముగా.

ప్ర : మీ రష్యాప్రయాణం ఎప్పుడు

జ : రష్యా ప్రభుత్వం పంపిన ఆహ్వానాన్ని త్వరలోనే అవెయిల్ చేసుకోవాలి. ఎక్కడండీ? ప్రతిరోజూ షూటింగు లేకపోతే కథల డిబేటింగు—యిలా వుంది— అని ఆయన చెపుతూ వుండగానే ఫోను మ్రోగింది. 'పుల్లయ్యగారి వద్దనుండి రింగ్ వచ్చింది. సారీ వినిపిస్తాము, రమ్మంటున్నారు !' అన్నారు నాగేశ్వరరావు. థాంక్సు చెప్పి వచ్చేసాము.

—శ్రీనివాస్ ●

ప్రశ్నోత్తరం

...కె. రామలక్ష్మి...

కె. వి. ఆర్, రూర్కెలా

మీరిచ్చే సమాధానాలకి మీరే ఆలోచించి సమాధానాలిస్తారా? లేక ప్రసిద్ధ కవిగారు మీ భర్తగారు ఏమైనా సలహాలిస్తారా?

నాకు తెలియక అడుగుతాను—ఆడదానికి ఆలోచించి పెట్టడానికో ప్రత్యేక వ్యక్తి కావాలనా మీ వూహ? ఒక నిజం మీరు గ్రహించటం మంచిది. మీరు తింటే నా ఆకలి ఎలా తీరదో, ఆలోచించడం అంతే—ఇది ఎవరికి వారు చేసుకోవలసిన పని. నేను బట్టలు ఉతికి ఆరేస్తాను. నువ్వు ఇస్త్రీ చెయ్యి అంటే పని అవుతుందేమోగాని నే నాలోచిస్తాను నువ్వురాయి అంటే కుదరదు. ఆయనగారు కూడా నా కో పాఠకు. పత్రికలోనే చదువుతారు నా సమాధానాలు.

ఎస్. వి. ఎల్, సంతనూతలపాడు

...మీ సమాధానం పటిష్ఠంగానూ సూక్ష్మంగానూ ఉంటుంటాయి కదా? మీరు ఎంతవరకు చదువుకున్నారు?

చదువుకీ కష్టంలోనే పిట్టు రానిస్తుందన్న సత్యం గ్రహించడానికీ సంబంధం లేదు విజయ లక్ష్మిగారూ, ఆరు పేజీలు రాసి జోకేశానంటు నవ్వు రాదు సరికదా ఏడుపొస్తుంది. అలాగే సమాధానాలు కూడా. పదాడంబరం, భావ సంక్లిష్టత అంటేట గారడీలు, ప్రపంచ చరిత్ర పోకడలు బాగుంటాయిగాని వాటితో అడిగిన వారి ప్రశ్నకి సమాధానం సలుప్పైపోతుందని నేను అనుకుంటాను.

టి. ఆర్. బి, రాయపూరు

స్త్రీకి జీవితాంతం ఉండవలసిన లక్షణములు ఏమిటి?

1. స్త్రీగానే యుండుట.
2. చేసుకున్న వాణ్ణి కాస్తూ కూస్తూ కాల్చుకు తిన్నా, అభిమానంతో చూచుట.
3. వ్యక్తిగా తన హోదా చంపుకోకపోయినా కుటుంబ సంస్థలో తలలో నాలిక కాకట్టుట.
4. ఆడదాన్ని నా మూలం నేనేం చేయగలను? అని కించపరచుకుని ఎదుటివారికి కించపరిచే అవకాశం ఇవ్వకుండా జాగ్రత్తపడుట.
5. ధనమో పణమో పుణ్యంకోసం కాకున్నా తోటి మనిషిపై సానుభూతితో కర్చు చేయటంలో వెనుకాడకుండుటయే కాక, చేస్తున్న వారిని వారించకుండా యుండుట. ముఖ్యమైన ఎన్నో లక్షణాలు స్త్రీ జీవితాంతం మిగుల్చుకోవాలి. ఎన్నని చెప్పను?

ఎ. కె. ఎమ్ శివిని

'లైఫ్ ఈజ్ లైక్ ఎ డబుల్ ఎడ్జెడ్ నైఫ్' అంటారు. దీనితో మీరెంత వరకు ఏకీభవిస్తారు.

పెళ్లాం అన్నది మొండికత్తిగా ఉన్నాకంటె రెండు పక్కలా పదునున్న కత్తిగా ఉండడమే బాగుంటుంది. అదొక థ్రిల్లింగ్, జీవితం చప్పగా నల్లేరుమీద బండిలా సాగిపోతే ఏముంది? కత్తి మీద సాములా ఉంటేనే రసవత్తరంగా ఉంటుంది. ఏమంటారు?

జి. వి. ఆర్, మద్రాసు

...మాంసాహారులపై మీకున్న దురభిప్రాయం గురించి...

పొరపాటు, నా కలాంటి దురభిప్రాయం లేదు. మాంసం తినేవాళ్లే లేరనా నా స్నేహితుల్లో. పెళ్లి అన్నాక రక రకాల సర్దుబాటు పోవడాలు తప్పవు. కాని వరుడు మాంసాహారి అయిన పక్షంలో అమ్మాయి మాంసం వండగల్గాలి కదా? పోనీ హోటళ్లలో తింటాడంటారా? ఎన్నాళ్ళు? ఇది పైకి చాలా చిన్న సంగతిగా తోచవచ్చు. లేటర్ లైఫ్‌లో పెద్ద సమస్యగా తయారు కావచ్చు. నువ్వు తినితీరాలి అని పట్టుపట్టే భర్త లుండరంటారా? ఉంటారు. జీవితం నరకప్రాయం అయే అవకాశాలు మనకి మనం అయి ఏర్పరచుకోకూడదని నా నమ్మకం. అంతేకాని మాంసాహారులంటే అయిష్టం కాదు. అంతెందుకు? మా ఇంట్లోనే ఉన్నారు. శాకాహారులూ, మాంసాహారులూ—అంతా ఒకచోట తినడం లేదా?

జి వి. ఆర్, మదనపల్లి

ఎవరైనా తా ను గా బలవన్మరణం పొందితే ఆత్మహత్య చేసుకున్నారని అంటారు కదా. అసలు ఆత్మకు అంతమనేదే ఉండ దంటారే. అంతమయేది శరీరమే కదా?

శరీరాన్ని అంతం చేసేస్తే యీ లోకంలో నుంచి యీ లోకపు ఇక్కట్లలోనుంచి విముక్తి కదా? ఆ శరీరాంతాలూకు ఆత్మకి అక్కడితో అంతం—ఫిజికల్‌గా. ఆత్మ అంటే స్వ అని కూడా చెప్పుకుంటే స్వహత్యే...ఆత్మహత్య...పోతూ పోతూ నువ్వే కారణం అంటూ ఎవరినీ ఇరికించకుండా పోదామనుకోటం—బ్రతికి ఉన్నవారిపట్ల చచ్చిపోదలిచినవాడు ప్రకటించవలసిన సానుభూతి!

వంగం, కొవ్వూరు

పురుషుణ్ని ఎత్తిపొడుస్తూ అనేక వ్యాసాలలో ఎందుకు పనికిరానివాడని తెగ రాస్తున్నారు ... పురుషుడు తోడ్పడకపోతే ఈ స్త్రీ ఎందుకు పనికిరాదని గ్రహించుకోండి మీరు.

చిత్రం. యింకా గ్రహించుకోవలసినవన్నీ చెప్పండి. నే నెప్పుడూ స్త్రీ పురుషులు శత్రువులని భావించలేదు. స్త్రీ సగం—పురుషుడు సగం—ఇద్దరూ కలిస్తేనే సంపూర్ణత్వం అని నమ్మే రకం నేను. మగవాడు మనిషని రాస్తున్నానేమోగాని ఎందుకూ పనికిరాని వాడని రాయలేదు. పైగా శీర్షిక చూసి దడుసుకుంటే ఎలా? వ్యాసాలు చదవండి—దాల్లో తిట్లు కవిత్వం లేదు. ఆత్మీయతతో కూడిన వేళాకోళం ఉంది. అందరాడువారూ చూడని నిశిత పరిశీలన వుంది. అంతేగాని అవహేళన కాదు. మరి టైటిల్ చూసి ఇలా అనడం దారుణం.

జి. ఎమ్, బలంగీర్

అన్నిటినీ జయించగల్గుతున్న మానవుడు ఆశను, స్వార్థాన్ని ఎందుకు జయించలేక పోతున్నాడు.

ఆశ, స్వార్థం లేనిదే ఈ ప్రపంచం ఎలా సాగుతుంది? వాటిని నరికేస్తే—ఇంక జయించడం ఎందుకు? వృథా.

ఎస్. బి. వి. ఎస్, వినుకొండ

ఈ మధ్య ఒక వ్యాసంలో శ్రీ మదిరెడ్డి సులోచనగారు కూడా వీణాదేవి స్త్రీయా? పురుషుడా? అంటే ఆ పేరు స్త్రీదో పురుషునిదో త న కే తెలియదన్నారు. ఏమిటీ వింత? ఎందుకిలా రాస్తున్నారు? మీరైనా నిజం చెప్తారా? దాటవేస్తారా?

అయ్యో ఆడదాన్ని నేనంటే అన్నాను శ్రీ మదిరెడ్డి సులోచనగారు కూడా అలా అన్నారా?!...ఈ పరిస్థితి కొంచెం గొడవగానే ఉంది. తెగించి ఆ వీణాదేవిగారే తెల్పి చెప్పాలి మరి. పోనీ లేకుంటే ఏ రావికొండలరావుగారినైనా అడగండి చెప్పగల్గుతారు.

ఇ. ఎస్. కె హైదరాబాదు

నాకు ఒక పెద్ద రచయిత్రినైపోవాలని వుంది. ఇంట్లో కూడని అమ్మ చూడకుండా నాలుగైదు కథలు రాశాను. కాని అమ్మ చదువుకుని ఉద్యోగంచేసి తనకి ఆసరా కమ్మంటుంది. ఈసమయంలో నా రచనాత్మక ఉత్సాహాన్ని ఆపివేయటమా?...

చదువుకుంటూ రచన సాగించకూడదని ఎక్కడా రూలు లేదు. కాలం గడిచితే అబ్బనిది చదువు. కాలం గడిచినకొద్దీ పదును తేలేది రచన. నీది మరీ చిన్నపిల్ల వ్యవహారంలా వుంది. అవసరం అయినపని ముందు చేపట్టాలి. తరవాతే కోరికలు—(అదే పెద్ద రచయిత్రినైపోవా లన్నలాటివి)

కె. కె. ఆర్, సామర్లకోట

స్నేహితులెవరు?

ఒకే ఆత్మ. రెండు శరీరాలు.



గతుక్కుమన్నాడు రామారావు.

ఆ చిరునవ్వు—సరిగ్గా అదే చిరునవ్వు—ఎన్నడో ఎక్కడో చూసినట్లు పిస్తోంది! ఎంత ప్రయత్నించినా గుర్తు రావటం లేదు.

మనం ప్రధానంగా భావించేవీ—మన మనసుకు హత్తుకొనేవీ మాత్రమే మనకు గుర్తుంటాయి— మిగిలినవి అనంతమైన భావవాహినిలో పిల్లకెరటాలలా తేలిపోతాయి.

ఎక్కడికీపోవు—

అప్పుడు జాగృతి అంతరాంతరాల ఏ పొరలలోనో చిక్కుపడి ఉంటాయి.

సరిదాకే శ్రుతి సోకినపుడు మాత్రం చిక్కులను విప్పుకుంటూ మేధతో దోబూచు లాడతాయి. ఎక్కడ చూసాడు అలాంటి చిరునవ్వు? రాధ పెదవులమీద ఆ చిరునవ్వు ఇంకా అలాగే ఉంది—

సమాధానం దొరకని అనేక ప్రశ్నలకు సమాధానంలాంటి చిరునవ్వు! ఎలాంటి పరిస్థితికైనా తట్టుకుని దీరత్వాన్నే ప్రదర్శించగల చిరునవ్వు...

'ఏమిటి నాన్నా! అలా చూస్తున్నావు?'

'వెంకటగిరి జరీచీరమ్మా! నీకిష్టమైన లేత గులాబిరంగు — నీవంటి రంగులో కలిసిపోయేరంగు నీకు నచ్చలేదా?'

రాధ తను తెచ్చిన చీరను సరిగ్గా చూసిందో చూడలేదో అన్నట్లు వివరించాడు రామారావు. రామారావుకు అలాంటి అనుమానం కలగటానికి కారణం లేకపోలేదు—

మూడేళ్ల క్రిందటివరకూ రాధ లేత గులాబి రంగుచీర చూడగానే చిన్నపిల్లలా సంబరపడిపోయేది—అందులో వెంకటగిరి జరీ చీరలంటే మరీ ప్రాణంపెట్టేది—

మేలిమి బంగారుఛాయలో మెరిసిపోయే రాధకు ఆచీరలెంతో బాగుండేవి—

చిన్నప్పటినుండీ రాధకు తండ్రిదగ్గర చనువెక్కువ—

ఏది కావాలన్నా నిస్సంకోచంగా తండ్రి నడిగేది—రాధ అడిగినదేదీ కాదనేవాడు కాదు రామారావు—

అసలా అమ్మాయి కోరికలు 'కాదు' అనటానికి వీల్లేనివిగా ఉండేవి—

సన్నజాజులు — విరజాజులు — మంచి మంచి పుస్తకాలు—మధుర రాగ భరితాలు, భావముక్తాలూ అయిన పాటలరికార్డులు— ఇలాంటివే రాధ కోరికలన్నీ...

కుమార్తె అభిరుచికి మురిసిపోతూ సగర్వంగా రాధ కోరినవి తెచ్చేవాడు రామారావు—

'నాన్నా!'

పారాణి కాళ్లతో—పచ్చని మంగళ సూత్రాల మెరుపుతో—వచ్చి పాదాలకు నమస్కరించింది రాధ—

సిగ్గుల పెళ్లికూతురు!

దుఃఖమూ ఆనందమూ ఒకదానితో ఒకటి పోటీలు పడుతూ నాట్యం చేస్తున్నాయి రామారావు మనసులో—

తన బంగారుతల్లికి అన్నివిధాల అనుకూలమైన సంబంధం దొరికినందుకు ఆనందం! తనకంటికీ తన ఇంటికీ వెలుగైన రాధ తనకు దూరమవుతోందనే దుఃఖం—కంఠం పూడుకుపోయి మాట రానట్లు కాగా చేతులు తలనిమిరాడు ఆప్యాయంగా...

'నాన్నా!' గోముగా పిలిచింది—

'పిచ్చితల్లీ! పెళ్ళయితే అయింది కానీ ఇప్పటికీ పసిపిల్లే!'

'ఏంకావాలి తల్లీ!'

'లేత గులాబిరంగు జరీచీర కావాలి నాన్నా! అక్కడికి వెళ్ళేటప్పుడు ఆ రంగుదే కట్టుకుంటాను—'

'ఎక్కడికి వెళ్తావమ్మా!'

'హి, నాన్నా!'

పకపక నవ్వింది—

'హాహో! అత్తవారింటికా!'

తనకూ నవ్వొచ్చింది — ఇంతకు పది క్షణాల క్రితం పసిపిల్ల అనుకున్నాడు— ఎంతలో ఎదిగిపోయి కనిపిస్తోంది! తను అత్తవారింటికి వెళ్ళబోయేముందు తన వంటికి ఎంతో అందాన్నిచ్చే చీరకట్టుకుని వెళ్ళాలనుకుంటోంది — అప్పుడే తన అందంతో భర్తను అలరించాలని తాపత్రయం—

'తప్పకుండా తెస్తానమ్మా! ఆ చీరలో నిన్నుచూసి అల్లుడిగారి కళ్ళు చెదిరి పోవాలి—'

'తనవోట అల్లుడుగారు' అన్నపదం వింటూనే ఎర్రబడ్డ చెక్కిళ్ళు—ఎంత కాంతిని సంతరించుకున్న అరమోడ్పు కనులు—మాధుర్యాన్ని చిందే చిరునవ్వు— రాధ మనసులో 'అల్లుడిగారి'కున్నస్థానాన్ని చెప్పక చెపుతోంటే సంతృప్తితో పొంగి పోతుంది రామారావు హృదయం—

స్ఫురణ

'పిచ్చితల్లీ!' అన్నాడు ఆప్యాయంగా నవ్వుకోనాడు—

'రేపు నాపుట్టినరోజు నాన్నా! గుర్తుందిగా!' ఆప్యాయత కంఠంలో ధ్వనిస్తున్నా ధోరణి బెబ్బులాడుతున్నట్లే ఉంది.

'ఎందుకుమరిచిపోతానమ్మా! ఏంకావాలో అడుగు...'

'నేను గుర్తుచేసాక తెస్తానంటున్నావ్! నాకేం అక్కర్లేదు! నీ అంతట నువ్వు అడగ వలసిందిపోయి—'

అంతలో అలక! మూతి ముడుపు! ఎంత అభిమానం!

'నిన్ను అడుగుదామని అనుకుంటున్నాను —అంతలో నువ్వే అడిగేసావ్! నా బంగారు తల్లివి కదూ! ఏం కావాలో అడుగు—'

'నాకేం అక్కర్లేదు! నాకసలు నువ్వేం తెచ్చి పెట్టక్కర్లేదు—'

సుతి మెత్తని ఆ సౌకుమార్యం వెనుక ఎంతటి రోషాగ్ని!

'సరే! అలా అయితే! ఇవాళరాత్రి నాకు నిద్రపట్టదు—రేపు తిండి నోటకెక్కదు— నీ పుట్టినరోజునాడు నీ నాన్నకు ఉపవాసమే గతి!' అంతటి రోషమూ క్షణంలో కరిగిపోయింది. కాముకలా బెదిరింపులకా లొంగని అహం అప్యాయతముందు తల వంచేసింది—

'మరేపాపం! నువ్వు తినకపోతే నేను ఊరుకుంటానా!'

'ఏం కావాలో అడుగుమరి...నాన్నా.'

'నీపేరు తలచినా చాలు...' రికార్డు తెచ్చిపెట్టు. ఆపాటలో భావానికి సుశీల కంఠం ప్రాణంపోసింది—'

రాధ కోపంపోయి రాజీకి వచ్చేసినందుకు పొంగిపోయాడు రామారావు—

లోకంలో చైతన్యమంతా రూపు కట్టినట్లు లేడిపిల్లలా చెంగు చెంగున ఇల్లంతా కలయతిరిగే రాధ అత్తవారింటికి వెళ్ళేరోజు వచ్చింది. లేత గులాబిరంగు జరీచీర కట్టుకుని తన పాదాలకు నమస్కరించి భర్తతో కలిసి జట్కాలో వెళ్ళే రాధను కనుమరుగయ్యేదాకా చూస్తూనే ఉన్నాడు—

కూతురు అత్తవారింటికి వెళ్ళిందనే ఆనందంకన్న అధికమయింది రాధను వదిలి ఉండాలనే వ్యథ...

అన్ని వ్యథలనూ మరపించగల కోమలి ఉండనే ఉంది—కోమలి లేపోతే తన జీవితం ఏమయి ఉండేదో?


చింత మొద్దులాంటి చదువూ సంస్కారమూలేని భార్య!

ఏ మాత్రమూ రసికతా, సంస్కారమూలేని ఆమె యాంత్రికంగా పనులు తాను చేసుకుపోతుంటే వివరించలేని పెదవి విప్పినా కదలని భావమయం! విచిత్ర మైన తన జీవితంలో కోమలి వలపు జల్లులు చిలకరించింది— ముడుచుకుపోతున్న తనగుండెకు చిరునవ్వులతో గిలిగింతలు పెట్టి రాగాలు పలికించింది. కోమలి సమక్షంలో ఒక్కొక్కక్షణం గడిచిపోయేది! తన వ్యథ అన్నీ మరిచిపోగలడు! హాయిగా కొన్ని క్షణాలకు సరిపడ జవాన్ని పుంజుకోగలడు!

దురదృష్టంలో అదృష్టం! తన భార్య తనకు కోమలితోటి అనుబంధాన్ని కూడా ఊహించుకోలేనంతటి మూర్ఖురాలు!

ఎన్ని పనులున్నప్పటికీ రాధ పుట్టిన రోజు మరిచిపోలేదు—! అందుకే లేత గులాబీరంగు జరీచీర కొనుక్కుని వచ్చాడు.

కానీ ఇదేమిటి? మూడేళ్ళలో రాధ అభిరుచులు మారిపోయాయా! గులాబి రంగు జరీచీర చూసినా అంత ఉదాసీనంగా ఉండిపోయింది' పైగా ఆ నవ్వే మిటి? ఎక్కడ చూసాడు ఆ నవ్వు?



'రేపు నీ పుట్టినరోజు కదూ! ఏం చేస్తావు?'

'రేపు నా పుట్టినరోజా?'

అప్పుడప్పుడే గుర్తుచేసుకుంటున్నట్లు అడిగింది...

'అదేమిటమ్మా! అక్కడ ఉన్నప్పుడు ఎంత హడావుడి చేసేదానివి? నీ పుట్టిన రోజే మరిచిపోయావా?'

'ఏదైనా ఎలా మరిచిపోతాను నాన్నా! అసలు ప్రయత్నించినా మనం కొన్ని మరిచి పోలేం!' ఇవును! మనం ఏదీ మరిచి పోలేం! అందుకే ఆ చిరునవ్వు తను మరిచిపోలేదు— కానీ స్పష్టంగా గుర్తు రావటంలేదు—

తలంటి పోసుకుని క్రొత్త చీర కట్టుకుని తల్లిదండ్రుల పాదాలకు నమస్కారం చేసింది రాధ—అంతలో ఆ చీర విప్పేసి అతి మామూలు చీర కట్టుకుంది—

విస్తుపోయాడు రామారావు—

క్రొత్త పెళ్లికూతురయినా సిగ్గుల తెరలు చీల్చుకుని తనతో తెల్ల గులాబీరంగు జరీచీర ఎన్నించుకుని అది కట్టుకుని భర్త ప్రక్కన కూర్చున్నరాధ ఈనాడు భర్త వచ్చేసమయానికి క్రొత్తచీర మార్చేసి అతి మామూలుచీర కట్టుకుంది—

ఏమయింది ఈ రాధ!

'హాహో! మావగారా! ఎప్పుడొచ్చారు?' నభ్యత ప్రతివదంలో గుమ్మరిస్తూ ప్రశ్నిం చారు, అప్పుడే క్యాంప్‌నుంచి వచ్చిన అల్లుడుగారు.

'నిన్ననే వచ్చాను. మీరు నిన్న ఇంటికే రాలేదు—'

'ఆఫీస్ పనులవల్ల క్యాంప్‌లోనే ఉండి పోవలసి వచ్చింది. కులాసాగా ఉన్నారా?'

'ఆ! ఇవాళ రాధ పుట్టినరోజు అందు కని...'

'ఐసీ! ఏం రాధా! ఏమిటీ అవతారం? పుట్టినరోజు నాడైనా ముచ్చటగా ఉండా లని తెలియదా? ఎప్పటికొస్తుంది నీకు సెన్స్? ఏమిటండీ మావగారూ! ఇంత పాతకాలపు మనిషి మీరాధ? నేనా అన్నం పెట్టించు—'

రామారావుకి మతిపోతోంది—

రాధ పాతకాలపు మనిషా?

పుట్టినరోజు నాడైనా ముచ్చటగా ఉండాలని తెలియదా?

అల్లుడుగారు భోజనం ముగించివచ్చారు. తాంబూలం సేవిస్తూ, కబుర్లు ప్రారం భించారు—

'మీ అమ్మాయికి బొత్తిగా ఏ సర దా లేదేమిటండీ? సినిమాకు రాదు— 'నాకు సినిమా లేవిటి?' అంటుంది— సంసారపక్షంగా ఉండటం మంచిదే అను కోండి—కానీ మరీ ఇంత జీవంలేకుండానా?'

ఏం మాట్లాడాలో తోచలేదు రామా రావుకు—ఇంగ్లీష్ సినిమాలు సహోతం చూస్తూ అందులో మంచిచెడ్డలు చర్చించే రాధ గురించేనా ఈమాటలు?

తీవ్రంగా ప్రతిఘటించాలను కున్నాడు— అంతలో రాధవచ్చి తనచేతిలో విరజాజి

మాల సీతారాముల ఫోటోకి వేసి తను కూడా అక్కడి సోఫాలో కూర్చుంది.

'మావారా! పూలు అలా దేవుళ్ల పటాలకు వేస్తుందే తప్ప హాయిగా తలలో పెట్టుకోదు—'

ఫిర్యాదు చేస్తున్నట్లే అన్నాడు—

'తలలో క్షణంలో వడిలిపోతాయి—దేవుడి పటానికివుంటే మరింతసేపు సువాసనలు విరజిమ్ముతా యి—అలానైనా ఆనదించవచ్చు—' చిరునవ్వుతో అంది రాధ—

ఏదో అనడానికి తెరచిన రామారావు నోరు తెరిచినట్లే ఉండిపోయింది—

చిరునవ్వు నవ్వే రాధను, చిరాకుపడే అల్లుడుగారినీ పూలను అలంకరించుకున్న నోరులేని దేవుళ్ని మార్చిమార్చి చూడటం తప్ప ఏమీ అనలేకపోయాడు—

ఆ సాయంత్రమే ఆ ఊళ్లో రామారావు పాత స్నేహితుడు కలిసాడు—

కుశలప్రశ్న అయ్యాక 'ఉంటావా నాలుగురోజులు!' అన్నాడు—

'అల్లుడుగారు కేంపునుండి ఇవాళ వచ్చారు—రేపు వెళ్లిపోతాను—'

మిత్రుడు విరగబడి నవ్వాడు—

'మీ అల్లుడికి కేంపేమిటయ్యా! కేంప్ వంకతో ఆ సుహాసిని దగ్గర గడిపి వస్తాడు—నెలకు పదిరోజుల కొకసారి!...'

'ఆ!...'

'ఈ సంగతి ఊరందరికీ తెలుసు—నువ్వయినా కాస్త మందలించు...'

రామారావు మనిష్కం మరిగిపోయింది—అల్లారుముద్దుగా పెరిగిన తన కూతురుకి — బంగారు బొమ్మకు—ఇంత ద్రోహం చేస్తాడా ఆ చండాలుడు? పాపం! రాధ అమాయకురాలు! దానికి ఏ సంగతీ తెలియదు-ఇవాళ చెప్పాలి...

'రాధా! అల్లుడుగారు వెళ్తున్నది కేంప్‌కు కాదు' భయంకర రహస్యాన్ని బట్టబయలు చేస్తున్నధోరణిలో అన్నాడు—

'అవును'

ప్రశాంతంగా అతి మామూలుగా అంది రాధ-మతిపోయినట్లు చూసాడు రామారావు—

'అయితే నీకు తెలుసా? తెలిసీ ఊరుకుంటున్నావా?'

తన పొరపాటు తెలిసివచ్చింది రాధకు—

'మీకెలా తెలిసింది?' అని అడిగింది నిదానంగా...

'ఎలాగో తెలిసింది—కనీసం నాకైనా చెప్పకూడదా?'

'చెపితే?'

'నాలుగుచీవాట్లు వేసేవాడిని—'

'వేస్తే...'

'బుద్ధి వచ్చేది!'

చిరునవ్వు! ఆ చిరునవ్వు!'

అలా చూస్తూ నిలబడి పోయాడు—

'ఆ 'అనవసరపుశ్రమ' నీ కియ్యకూడదనే చెప్పలేదు నాన్నా!'

చిరాకు పడిపోయాడు రామారావు—

'ఇదంతా నేను సహించలేను—నాతో వచ్చెయ్యి—'

'ఆ తర్వాత...'

'నాదగ్గరే వుందువుగాని—'

'ఉండటానికి ఎక్కడయితేనేం?'

'ఇంత అవమానం సహిస్తూ ఇక్కడుంటావా?'

'అక్కడికొస్తే, అవమానం పోతుందా?'

'రాధా! రాధా! ఏమిటమ్మా ఇది? అతనిని నిలదీసి అడగలేవా?'

'ఎందుకు అడగటం?'

'తాడో, పేడో తేల్చుకోవటానికి?'

'ఆ తరువాత?...'

'ఆ తరువాత...ఆ తరువాత...కాదు—ఇలా కాదు ... ఊరుకోవద్దు. దెబ్బలాడు. నీ హక్కు నువ్వు పొందు—'

'ఇక్కడ హక్కుల ప్రస్తావన లేదు—ఒక గృహిణిగా నా హక్కును ఎవరూ కాదనలేరు—అందుకే నిశ్చింతగా ఇక్కడ ఉన్నాను — తెలిసి సహిస్తున్న అభిమానహీనురాలిగా ఆయన దృష్టిలో నిలవటం కంటె ఏం తెలియని మూర్ఖురాలిగా ఉండటమే బాగుంది నాకు—నువ్వు ఈ విషయం గురించి ఆలోచించి మనసు పాడు చేసుకోకు నాన్నా! నాకేం? ఈ ఇల్లు నాది! ఈ వాకిలి నాది! ఫలానివారి భార్యగా ఈ హోదా నాది! నాకేం తక్కువ.' నవ్వుతోంది రాధ—

నిలవలేక పోయాడు రామారావు—

భర్త ముఖంచూసి భయపడింది రామారావు శ్రీమతి—

'రాధ కెలాఉంది?' అంది బెదురుగా...

'దరిద్రుడు! చండాలుడు! కిరాతకుడు! నీచుడు! దౌర్భాగ్యుడు! రాక్షసుడు! పిశాచం! వాడు...వాడు...'

ఆవేశం ఆగక—పిట్కు స్ఫురించక పిడికిళ్లు బిగించి పళ్లు కొరికాడు రామారావు...

'ఎవరు?' బెదురుగా అడిగింది—

'ఆ అల్లుడు వెధవ! వాడిని ఏంచేస్తే పాపముంది?'

'ఏం చేస్తారు? ఏం చేసినా ఎవరికి నష్టం?'

వెలవెలపోతూ భార్యవంక చూసాడు రామారావు.

'ఏం జరిగింది?...'

'రత్నంలాంటి మన రాధను నిర్లక్ష్యం చేసి ఆ సుహాసినితో కులుకుతున్నాట్ట! మన రాధ ఎంత మారిపోయిందో తెలుసా? పువ్వులు పెట్టుకోవటం లేదు—మంచి చీరలు కట్టుకోవటం లేదు—వెనకటి హుషారే లేదు—'

చివ్వున కళ్లలో నీళ్లు చిమ్మగా చటుక్కున తల దించుకుంది ఆవిడ!

'రాధను ఎంత అపురూపంగా పెంచాం మనం!'

'ఏ తల్లిదండ్రులు తమ బిడ్డలను అప్రూపంగా పెంచరు?'

'ఇక్కడ ఉన్నప్పుడెలా ఉండేది? ఎంత మారిపోయింది!'

'ఆడదాని జీవితమంతా భర్త చేతుల్లోనే ఉంది!'

'ఆ వెధవకా బుద్ధి రేమిటి?'

'సాగుతోంది! ఆనందిస్తున్నాడు—చెల్లుబడి అవుతున్నంతకాలం స్వార్థం ముందు మరేవీ కనిపించవు—'

'వాడి స్వార్థం గంగలో పడవ! మన రాధ! మన బంగారు తల్లి! దాని గతేమిటి?'

'పరవాలేదు లెండి—అమధ్య నెలతప్పిందని ఉత్తరం వ్రాసింది—ఎలాగో బ్రతుకుతుంది.'

గతుక్కుమని భార్య ముఖంలోకి చూసాడు—

ఆ ముఖంలో అరుదుగా మెరిసే చిరునవ్వు...మెరుపులా స్ఫురణకు వచ్చింది—

రాధ ముఖంలో చూసిన చిరునవ్వు... తాను ఎక్కడో చూసేనను కున్న చిరునవ్వు...ఇన్నాళ్లుగా తాను గుర్తించని చిరునవ్వు...

అది ఇదే!

అంటే...అంటే...

౭—4—71

'కుటుంబ నియంత్రణ ఉద్యమం ఎలా సాగుతోంది?'

వనితాలోకం వ్యాసరచన పోటీలో పాల్గొని దానిని విజయవంతం చేసిన రచయిత్రులందరికీ మా కృతజ్ఞతలు. పోటీలో మొదటి మూడుబహుమతులని పొందిన రచయిత్రులు శ్రీమతి వి. కమల, శ్రీమతి ఇందుర్తి రుక్మిణి, శ్రీమతి మంచాళ శ్రీలక్ష్మిగార్లు రాసిన వ్యాసాలని ఈ సంచికలో ప్రచురిస్తున్నాము. ఇవి కాక మరో రెండు ప్రత్యేక బహుమతులని పొందిన శ్రీమతి పిన్నక ధనలక్ష్మి, శ్రీమతి పి. జయలక్ష్మిగార్ల వ్యాసాలని పైవారం సంచికలో వేస్తాము. —సం॥

మనదేశంయొక్క పరిమాణాన్నీ, దాని జనాభా, అది పెరుగుతున్న తీరునీ దృష్టిలో పెట్టుకుని పరిశీలిస్తే నేటి కుటుంబ నియంత్రణ ఉద్యమం అవసరానికి తగిన విధంగా సాగటం లేదని తేలుతుంది. పెద్ద నగరాలలోనూ, పట్టణాలలోనూ, ప్రయాణసౌకర్యాలు గల గ్రామాలలోగల ప్రజలమీద చెప్పితే, మారుమూల ఉండి వివిధమైన ప్రయాణసౌకర్యాలు లేని పల్లె గ్రామాల్లో ఉన్న సామాన్య ప్రజానీకంమీద ముఖ్యంగా నిరక్షరాస్యులైన నిరుపేదల మీద ఈ ఉద్యమ ప్రభావం దాదాపు శూన్యమనే చెప్పాలి. మనదేశ జనాభాలో యిలాంటి వారే ఎక్కువ శాతంలో ఉన్నారు.

మనదేశంలో ఎక్కువమంది కుటుంబ నియంత్రణ సిద్ధాంతాన్ని మనఃపూర్వకంగా స్వీకరించటం లేదు. దీనికి కారణం పైన చెప్పిన నిరక్షరాస్యులైన పేద ప్రజలు ఎక్కువశాతంలో ఉండటమూ, కొన్ని మత, సాంఘిక పరమయిన విశ్వాసాలు బాగా వేళ్ళూనటంవల్ల నాస్తికమూ, శాస్త్రీయమూ అయిన దృక్పథంతో ఈసమస్యని పరిశీలించక పోవటమూ అని చెప్పాలి. ధనికులూ, విద్యావంతులూ, పెద్ద నగరాల్లోనూ, పట్టణాల్లోనూ ఉన్న ప్రజలూ, మధ్యతరగతి కుటుంబీకులూ ముఖ్యంగా ప్రభుత్వోద్యోగులూ కుటుంబ నియంత్రణ సిద్ధాంతాన్ని ఆమోదించి ఆచరణలో పెడుతున్నారు. దీనికి కారణాలు ప్రభుత్వం చేసే ప్రచార ప్రభావమూ, ప్రభుత్వం ఇచ్చే సౌకర్యాలు వారికి బాగా అందుబాటులో ఉండటమూ.

ప్రస్తుతం ప్రభుత్వం అమలు పరుస్తున్న కుటుంబ నియంత్రణ పద్ధతులు—ఆడవారికి సంబంధించినంతమట్టుకు సంతృప్తికరంగా లేవనే చెప్పాలి. లూప్‌లు అమర్చటమూ, ట్యూబెక్టమీ ఆపరేషను చెయ్యటమూ — రెండూ చెయ్యి తిరిగిన డాక్టర్లు చేయవలసిన పనులు. దేశంలో లేడీ డాక్టర్ల కొరత ఎక్కువ. పల్లెల్లో పని చేయటానికి యిష్టపడే లేడీ డాక్టర్లూ, డాక్టర్లూ మరీ అరుదు. లూపులు అమర్చిన కొన్ని కేసుల్లో వచ్చిన చిక్కుల్ని కుదర్చటానికి అందుబాటులో వైద్య సహాయంలేక బాధపడ్డవారిని చూసిన స్త్రీలు ఆ పద్ధతి అవలంబించటానికి జంకుతున్నారు. రెక్కాడితేగాని డొక్కాడని పేదప్రజలు ట్యూబెక్టమీ చేయించుకుని నెల్లాళ్లపాటు విశ్రాంతి తీసుకోగలిగే స్థితిలో లేరు. మింగే మాత్రలు ఉన్నాయి గాని వాటివల్ల కేన్సర్ రావటం, రక్తనాళాలు గట్టిపడటం లాంటి ప్రమాదాలు వున్నాయని వచ్చిన వార్తలవల్ల ఆ పద్ధతికి స్త్రీలు సుముఖంగా లేరు. పోతే మగవాళ్లకు సంబంధించినంత మట్టుకు ఈ పద్ధతులు నిరపాయంగా, సులువుగా, చవగ్గా ఉన్నాయి. జనాభాసమస్య ముఖ్యంగా పురుషులవల్లనే పరిష్కరించ బడాలి.

కుటుంబ నియంత్రణ ప్రచారం బాగానే సాగుతున్నా ఒక్కోసారి మరీ అతిగా వుంటోంది. అమర్యాదగా వ్రాసిన పోస్టర్లు, డాక్యుమెంటరీలో పురుషులు వాడే సాధనం చూపించిన తీరు కొంచెం జుగుప్సాకరంగా వుంది. చిత్రాల్లో పరిమిత కుటుంబాలవల్ల లాభాలూ, జనాభా పెరుగుదలవల్ల కలిగే ఉపద్రవాలూ సూచిస్తూ, సలహో సహాయమూ ఎక్కడ లభ్యమవుతాయో సూచిస్తే చాలు. ఏ ఏ సాధనాలు, ఎప్పుడు ఎలా ఉపయోగించాలో కరపత్రాల ద్వారానో, యింటింటికీ ప్రచారంచేసే సమయాల్లోనో, వివరించి చెప్పవచ్చు.

కుటుంబ నియంత్రణ పద్ధతుల దుర్వినియోగానికి—ముఖ్యంగా స్త్రీ పురుషులలో ఎచ్చలవిడితనానికి దారితీస్తున్నాయని వొచ్చిన ఆరోపణలు ఆధారం లేనివి. స్త్రీ పురుషుల అక్రమ సంబంధాలు శీలంలో లోపంవల్లనే కాని కుటుంబ నియంత్రణ పద్ధతులు అందుబాటులో ఉంటంవల్ల కాదు. అయితే అలాటిస్థితి ముందు ముందు రాదని గ్యారంటీ ఏమీ లేదు. కాని, కత్తితో పళ్ళూ, పీకలూ రెండూ కోయవచ్చు. రోగులకోసం కనిపెట్టిన మార్ఫియా, పెథిడిన్ లాంటి యింజక్షన్లు అలవాటు చేసుకొని ఆరోగ్యవంతులు 'ఛాయాలు' అవుతున్నారు. తప్పు వైద్యశాస్త్రానిదీ, మందుది కాదు. సరిగా ఉపయోగించని వాళ్ళది. వ్యక్తిగత దౌర్బల్యాలే దీనికి కారణంగా ఎంచాలి.

కుటుంబ నియంత్రణ ఉద్యమం సఫలం కావాలంటే ప్రభుత్వం గత రెండుమూడు సంవత్సరాలలో వ్యవసాయోత్పత్తులను పెంచటానికి అవలంబించిన 'క్రేష్ ప్రోగ్రామ్'లాటివి అమలుజరిపి స్వల్ప కాలంలో చాలా ఎక్కువధనం ఖర్చు పెట్టాలి. ఆపరేషను కేసుల్లో ప్రభుత్వం దేశంలో కొన్ని పెద్దపారిశ్రామిక సంస్థలు చేస్తున్నట్టుగా ఎక్కువ మొత్తం—కనీసం నూరు రూపాయలయినా యివ్వజాపితే చాలామంది కూలిజనం ముందుకు వస్తారు. చాలా స్వల్పవ్యవధిలో జననాల రేటుతగ్గి మాతాశిశు సంరక్షణ మీదా, ప్రాథమిక విద్యాబోధ మీదా పెట్టేఖర్చు తగ్గవచ్చు. తర్వాత జపాన్‌లోలాగా గర్భస్రావం చట్టబద్ధం చేయటం అవసరం. మనకు అలవాటయిన ఆలోచనా పద్ధతులవల్ల యిది

వనితాలోకం వ్యాసరచన పోటీలో మొదటి బహుమతి రు 250 పొందిన వ్యాసం

చాలా విపరీతంగా కనిపించినా, వీనివల్ల ఏటా జరిగే కొన్నిలక్షల అక్రమ గర్భస్రావాలవల్ల కలిగే దుష్ఫలితాలు నివారించి జనాభాని పెరుగుదలని అదుపులో పెట్టవచ్చు. ఈ విషయంలో ప్రగతి సాధించిన జపాన్‌లాంటి దేశాల సహాయమూ, సహకారమూ పొంది ప్రతి రెండు గ్రామాలకీ ఒక నియంత్రణ కేంద్రం రెండేళ్లపాటు పనిచేసేట్టు చూడాలి. గ్రామాలతో సన్నిహిత సంబంధం కలిగిన విలేజి లెవెల్ వర్కర్లకీ, హెల్త్ విజిటర్స్‌కీ, ఎలిమెంటరీ స్కూలు ఉపాధ్యాయులకీ, వ్యవసాయ శాఖలో ఉద్యోగులకీ కుటుంబ నియంత్రణ ప్రచార పద్ధతులలో శిక్షణ యిచ్చి ప్రచారం చేసినందుకు కొంత ధనరూపేణా ముట్టచెప్పాలి. అవసరమయితే ప్రతివారూ యిద్దరు పిల్లల తర్వాత విధిగా శస్త్రచికిత్స చేయించుకునేట్టు ఒక చట్టం రూపొందించటానికి వీలుగా ప్రజాభిప్రాయాన్ని కూడగట్టుకోవటానికి వెంటనే ప్రయత్నాలు జరగాలి.

—వి. కమల

రెండవ బహుమతి రు. 200 పొందిన వ్యాసం

దేశ ప్రగతిని ప్రజల ఉన్నతిని కోరి సుమారు 12 ఏళ్ళ క్రితం ప్రభుత్వము కుటుంబనియంత్రణను ప్రవేశపెట్టింది. కోట్లకొలదీ రూపాయలను వెచ్చించి, దేశం నలుమూలలా కుటుంబ నియంత్రణ కేంద్రాలను తెరచి రేడియోలలో, సినిమాలలో ప్రచారం చేయిస్తున్నది. అయినా ఫలితం మాత్రం సామాన్యంగానే ఉన్నది. 50 కోట్ల జనాభా కలిగిన భారతావనిలో 12 ఏళ్లలో, తక్కిన ప్రణాళికల లాగానే ఈ ఉద్యమంకూడ విశేష ఫలితాన్ని సాధించలేక పోయింది. కానీ, ప్రతివారికీ కుటుంబ నియంత్రణను, దానివల్ల కలిగే లాభాలను మన ప్రభుత్వం తెలియచెప్ప గలిగింది.

మన జనాభాలో 80 శాతం పైగా నిరక్షరాస్యులు. మూఢ నమ్మకాలను, పురాతనమైన అలవాట్లను వదులుకోలేక, పురోగమిస్తున్న శాస్త్ర విజ్ఞానాన్ని నమ్మలేక, క్రొత్త పంథాలను త్రొక్కే ధైర్య సాహసాలను పుంజుకోలేక వీరు కుటుంబ నియంత్రణను అసలు జరపడం లేదు. మిగిలిన చదువుకున్న వారిలోకూడ, కొందరికి ప్రస్తుతం అమలులో ఉన్న విధానాలు నచ్చటం లేదు. అందుకే మన ప్రజలలో 10—15 శాతంవారు మటుకే కుటుంబ నియంత్రణను అసలు జరుపుతున్నారు. క్రైస్తవులలో మహమ్మదీయులలో చాలా మంది మతసంబంధమైన కారణాలవల్ల కుటుంబ నియంత్రణ కిష్టగించటం లేదు. అందుకే ఈ ఉద్యమం మందగమనంతో సాగుతోంది.

స్టెరిలైజేషన్ కుటుంబ నియంత్రణోపాయాలలో ముఖ్యమైనది. ఎంత చిన్నదైనా ఆపరేషన్ అనగానే ప్రజలు భయపడతారు. లావెక్కిపోతామేమోనని స్త్రీలు, నిర్వీర్యులౌతామేమో అని పురుషులు దీనికి వెనుకంజ వేస్తున్నారు. రెండో విధానం లూప్. యిది గర్భాశయంలో ఉన్నంతవరకూ పిల్లలు పుట్టరు. 3—4 ఏళ్ళ వరకూ ఉండవచ్చు. దీనివల్ల మొదట్లో బహిష్టు చాలా అధికంగా ఉంటుంది. దీనికి ఉండే దారాలు పురుషులకు గుచ్చుకోవచ్చు. ఈ రెండు కారణాలవల్లా స్త్రీలు లూప్ అంటే యిష్టపడడం లేదు. మూడో విధానం గర్భనిరోధక మాత్రలు నెలలో మూడువారాల పాటుగాని, నెలంతాగాని, ఏమరుపాటు లేకుండా ప్రతిరోజూ వేసుకోవాలి. వేసుకున్నన్నాళ్ళూ పిల్లలు పుట్టరు. అరుదుగా ఈ మాత్రలవల్ల పచ్చకామెర్లు, రక్తనాళికలలో రక్తం గడ్డ కట్టుకు పోవడం వంటి ప్రమాదమైన జబ్బులు రావచ్చు. పనిపాటలలో బిడ్డల లాలనపాలనలో తల మునకలయ్యే గృహిణి మాత్ర వేసుకోవడం మరచిపోవచ్చు. ఈ రెండు కారణాలవల్ల, ఈ పద్ధతికూడ చాలమందికి నచ్చలేదు. వాడడం కష్టం కనుక, 'డయాఫ్రమ్‌ను' చాలామంది స్త్రీలు యిష్టపడ లేదు. గర్భధారణ కాలాలు ఎక్కువగావున్నా వాడడం సులభం కనుక పురుషులు వాడే 'కాండమ్' జనాదరణను పొందింది.

మిగతా ప్రణాళికలలోలాగే, ఈ ఉద్యమంలోకూడ ప్రచారం చాలవరకు కాగితాలపైనే నడుస్తోంది. కుటుంబ నియంత్రణ కేంద్రంలోని ఉద్యోగులు ప్రతిరోజూ యింటింటికీ తిరిగి ప్రచారం చేయవలసి ఉన్నా, కొన్నిచోట్ల వారానికి రెండుమూడు సార్లు మాత్రమే హోమ్ విజిటింగ్ చేస్తున్నారు. ప్రజలు చూపించే నిరసనభావం దీనికొక ముఖ్య కారణం. చాలామంది కాగితాలలో లెక్కలు చూపించడానికి తాపత్రయ పడుతున్నారే తప్ప, ప్రజల సంక్షేమాన్ని కోరి ప్రచారం చేయటం లేదు. మరి కొన్నిచోట్ల, బలవంతంగా ఏదో పద్ధతి ప్రజల తలమీద రుద్దాలనికూడ చూస్తున్నారు.

డబ్బును ఎరగా చూపించడంవల్ల కొన్నిచోట్ల వృద్ధులు, అవివాహితులు స్టెరిలైజేషన్ చేయించుకుంటున్నారు. స్త్రీలు పలుసార్లు లూప్ పెట్టించుకొంటున్నారు. కొందరు కుటుంబ నియంత్రణోద్యోగులుకూడ, బలవంతంగా స్టెరిలైజేషన్ చేయడం, లూప్ పెట్టడం, తప్పుడు లెక్కలు రాయడం చేస్తున్నారు. దీనికి ముఖ్య కారణం అయిన ధనాభావం లంచగొండితనం నశించిన నాడు కుటుంబ నియంత్రణోపాయాలు సద్వినియోగమవుతాయి. ఇంతేకాక కొందరు అవివాహితులు, దుర్మార్గులు, నీతి తప్పి సంచరించవచ్చు కదా అని వీనిని దుర్వినియోగ పరుస్తున్నారు.

కుటుంబ నియంత్రణ మనదేశంలో యింకా విజయవంతమవ్వాలంటే ప్రజలలో విద్యను విజ్ఞానాన్ని పెంపొందించాలి. అప్పుడు ప్రజలు వారి అవసరాలను వారే గుర్తించ కలుగుతారు. ఆహారం, డబ్బు చాలా కొరతగ ఉన్న ప్రస్తుత పరిస్థితిలో అతి త్వరలో ఏదో ఉపాయంచేత జనాభాను తగ్గించవలసిన ఈ సమయంలో, మన దేశ ప్రజలకు అన్నివిధాలా తగినవి స్టెరిలైజేషన్, లూప్. స్టెరిలైజేషన్‌వల్ల ఆరోగ్యం భంగం అవదని, లూప్‌వల్ల కలిగే అధిక రక్తస్రావం 5—6 నెలల్లో అదే సర్దుకుంటుందని, దారాలను పొట్టిగా ఉంచితే పురుషులకు గుచ్చుకోదని ప్రజలను

[illegible] యని జనాదరణను పొందుతాయి. 'కాండమ్'తో పాటు, స్త్రీలు ఔషధిగాని ఫోమ్‌టాబ్లెట్లుగాని వాడితే గర్భధారణావకాశాలు తగ్గుతాయని ప్రజలకు తెలియచెప్పాలి. గర్భనిరోధ మాత్రల వల్ల మాటికో, కోటికో ప్రమాదకరమైన జబ్బులు రావచ్చునీ, వానివల్ల గర్భధారణావకాశాలు చాలా తక్కువనీ ప్రజలకు నచ్చచెప్పాలి. అంతేకాక ప్రభుత్వం గర్భవిచ్ఛేదనాన్ని చట్టబద్ధం చేయాలి. చట్టవిరుద్ధమైన గర్భస్రావాన్ని చేయించుకొని, ప్రజలు ప్రాణంమీదకు తెచ్చుకొంటున్నారు. జిల్లా కేంద్రాలలోని ఆస్పత్రులలో, దాన్ని చట్టబద్ధం చేస్తే చాలామంది ప్రాణాలు దక్కుతాయి. పెద్ద ఆస్పత్రులలో బాగా తర్ఫీదు పొందిన డాక్టర్లు చేయడంవల్ల గర్భస్రావంలోని ప్రమాదాలుకూడ చాలా వరకు తగ్గుతాయి. అబార్షన్ చేయించుకోవాలన్న తపనలో చాలామంది స్టెరిలైజేషన్‌కు కూడ ఒప్పుకోవచ్చు.

కుటుంబ నియంత్రణ కేంద్రంలోని ఉద్యోగుల దృక్పథంలో కూడ మార్పు రావాలి. విసుగెత్తించే ప్రశ్నలతో ప్రజలు వీరిని వేధించినా, ప్రతి పద్ధతిలోని సాధక బాధకాలను వీరు ప్రజలకు వివరించి చెప్పాలి. ప్రజలు తమకు నచ్చిన పద్ధతిని తామే ఎన్నుకునేటట్లు చేయాలి. కుటుంబ నియంత్రణతోపాటు మిగతా కష్టసుఖాలను కూడ చర్చించి, చిన్న చిన్న జబ్బులకు మందులిచ్చి, ప్రజల విశ్వాసానికి పాత్రులవ్వాలి. గర్భిణీస్త్రీలకు, తనిఖీ చేసినప్పుడల్లా కుటుంబ నియంత్రణ గురించి బోధించాలి. కుటుంబ నియంత్రణ తమ సౌఖ్యం గురించి కాని, ప్రభుత్వం కోసంగాని కేంద్రంలోని ఉద్యోగుల జీతంకోసంగాని కాదు అనే నిజాన్ని ప్రజలు గుర్తించేలా చేయాలి.

అంతేకాదు సులభంగా, నిరపాయంగా, ఉంటూ, అవసరం వస్తే మళ్లీ సంతాన ప్రాప్తి కలిగిస్తూ ఉండే నూతన విధానాలను కనిపెట్టాలి. అప్పుడే ఈ ప్రణాళిక నూటికి నూరుపాళ్లు విజయవంతం అవుతుంది. డి. ఎన్. ఏను ఉత్పత్తి చేయగల్గిన మానవునకు యిదేమంత కష్టం కాదు. అలాంటిరోజు అతిత్వరలో వస్తుంది. అంతవరకూ ప్రజలు కొద్దిపాటి కష్టనష్టాలకు ఓర్చి కుటుంబాన్ని మితంగా ఉంచుకొంటే తాము సుఖపడుతూ దేశప్రగతికి తోడ్పడిన వారవుతారు.

— ఇందుర్తి రుక్మిణి ●

ఉపయోగిస్తున్న పద్ధతులన్నీ ప్రజలలో కొన్ని కొన్ని అనుమానాలు బయలుదేరాయి. ఉదాహరణకు 'వేసక్టమీ' చేయించుకున్న పురుషులకు బ్లడ్‌ప్రెషర్ వంటివి వస్తున్నా

మూడవ బహుమతి రు. 150 పొందిన వ్యాసం

మనదేశంలో 'పరిమిత కుటుంబం' ఉద్యమం కొంతకాలంగా సాగుతోంది. ఈ ఉద్యమం ప్రారంభదశను దాటి మరొక మెట్టు పైకి సాగింది. సాధ్యమైనంతవరకు మన ప్రభుత్వం ఈ ఉద్యమం కొనసాగడానికి అనేక పద్ధతులద్వారా ప్రచారం చేయుస్తున్నారు. ముఖ్యంగా రేడియోల ద్వారాను పత్రికల ద్వారాను ఈ ఉద్యమం కొనసాగించడమే గాకుండా, ఈ ఉద్యమం జయప్రద మయేటందుకు, అవసరమైన సలహాల నిచ్చేటందుకు దేశంలో పల్లెలలోనూ, పట్టణాలలోనూ కుటుంబ నియంత్రణ సంక్షేమ కేంద్రాలను నెలకొల్పుతున్నారు.

మనదేశంలో అధిక సంఖ్యాకులు నిరక్షరాస్యులుగా గ్రామములలో ఉన్నారు. వీరికి కుటుంబాన్ని పరిమితం చేసుకోవడమంటే 'భ్రూణహత్యకి పూనుకోవడమే'అన్న మూఢ నమ్మకాలు ఉన్నాయి. ఇటువంటి మూఢ నమ్మకం కలిగిన గ్రామప్రజలకు, కుటుంబ నియంత్రణయొక్క ప్రయోజనాలను విపులంగా చెప్పి, ఆ గ్రామప్రజలచే దీనివల్ల పొందినఉపయోగాలు వినిపింపచేస్తూనే ఉన్నారు.

అయితే ఈ ఉద్యమంయొక్క ప్రయోజనాలను సూటిగా చెప్పకుండా, చిన్న చిన్న కథల ద్వారాను, చలనచిత్రాల ద్వారాను వారికి తెలియచేసి, పరోక్షంగా కుటుంబ నియంత్రణ ప్రయోజనాలను ప్రజలకు తెలియబరిస్తే ఈఉద్యమం మరింత విజయవంతమవుతుందని నాఉద్దేశం.

మన ప్రజలలో నేడు విద్యాధికులైన అధిక సంఖ్యాకులు కుటుంబ నియంత్రణ సిద్ధాంతాన్ని స్వీకరిస్తున్నారని అనుకుంటున్నాను. పరిమితమైన కుటుంబాలను చూసి వారి సుఖసంతోషాలను చూసి, మూఢనమ్మకాలు గలిగినవారు కూడా తమ తమ కుటుంబాలను పరిమితం చేసుకోవాలని అనుకుంటున్నారు.

కుటుంబ నియంత్రణ కోసం ప్రభుత్వం

యని ప్రజలలో ఒక నమ్మకం ఏర్పడింది. అలాగే 'ట్యూబెక్టమీ' చేయించుకున్న స్త్రీలకు శరీరం లావు ఎక్కుతున్నదంటున్నారు. 'లావు' వలన 'కేన్సరు' వచ్చేందుకు అవకాశం ఉన్నదన్న వదంతి కూడా ప్రజలలో ఉంది. అయితే సమర్థులైన వైద్యులచే పైన చెప్పిన పద్ధతులను ఆచరించ దలచుకుంటే ఏ విధమైన ప్రమాదములు జరుగవని నా నమ్మకం. అందుకు ప్రభుత్వం 'పైన చెప్పిన పద్ధతులను ఆచరించినందువలన ఎటువంటి ప్రమాదములు జరుగవన్న' నమ్మకాన్ని ప్రజలలో కల్గించడానికి మరింత కృషి చెయ్యవలసి ఉంటుంది.

అన్నివిధాలా ప్రభుత్వం ఈ ఉద్యమం విషయంలో ఎంతో శ్రద్ధ వహిస్తున్నప్పటికీ ఈ కుటుంబ నియంత్రణ ఉద్యమం పద్ధతులు కొన్నికాలాల దుర్వినియోగానికి లోనవుతున్నాయని చెప్పక తప్పదు. నాగరికత పెచ్చుపెరిగిన మన సమాజంలో విద్యాధికులైన కొందరివల్ల ఈ ప్రచారం దుర్వినియోగానికి లోనుగావలసి వస్తోంది. నీతి నియమాలేవి సమాజంకోసం గాకపోయినా, ఎవరికి వారు బాగుపడేందుకైనా ఉండాలిగదా! ఎవరినివారు దిద్దుకుంటే సమాజాన్ని దేశాన్ని చక్కదిద్దినవారవుతారు.

ఇంకోవిషయం ఏమంటే కుటుంబనియంత్రణ ప్రచారం ప్రజలకి 'సుఖవంతమైన జీవితం' అని స్ఫురించేలా ఉండాలి. కుటుంబ నియంత్రణగుర్తు చిహ్నము స్త్రీలను సిగ్గుపరిచేలా చేస్తోందని నా నమ్మకం. ఈ ప్రచారానికి మరింకో విధమైన గుర్తు ఉంటే బాగుంటుందని నా అభిప్రాయం. పరిమిత కుటుంబ ప్రయోజనాలను సూటిగా గాకుండా, చిన్న చిన్న కథల ద్వారాను, చలనచిత్రాల ద్వారాను ప్రజలకు తెలియపరచాలి. అతి పెదదేశమైన భారతదేశ ప్రజలందరూ ఆచరించి తీరవలసినది కుటుంబ నియంత్రణ.

— మంచాళ శ్రీలక్ష్మి ●

యర్రం చంద్రశేఖరం

జరిగిన కథ

లక్ష్మయ్యగారొక మోతుబరి రైతు. శాంత ఆయనకి ఏకైక కుమార్తె. తల్లిదండ్రులు లేని మేనల్లుడు రామాన్ని చిన్నప్పటినుండీ తనే పెంచి పెద్ద చేస్తాడు. రామం చదువు హెచ్.ఎస్.సి.తో ఆపేసి వ్యవసాయపు పనులు చూసుకుంటాడు. అతను పంచాయతీబోర్డు ప్రెసిడెంటుగా వుంటాడు. శాంతను కాలేజి చదువుకు పంపిస్తారు. కాలేజిలో ఆమెకి శారద అనే బీదవిద్యార్థిని స్నేహితురాలవుతుంది. శారద విషాదగాథ శాంతను కదిలించి వేస్తుంది. శారదకి ప్రభాకరం పరిచయమవుతాడు. ప్రభాకరానికి కాశీలో ప్రసాద్ స్నేహితుడవుతాడు. ప్రభాకరం దుడుకు స్వభావాన్ని కని పెట్టి ప్రసాద్ అతని ప్రవర్తనని మార్చాలని ప్రయత్నం చేస్తాడు. రామంపై శాంతకి అభిమానం. శాంతతో పెళ్ళికి కారణం లవ గతం కాలేదు శారదకి. సుందరానికి తలవనితలంపుగా నీరజతో పరిచయమయ్యింది. నీరజ యింటికి వెళ్ళి ఆమె తండ్రికి వైద్యం చేసే భారం తన మీద వేసుకున్నాడు. నీరజ సుందరంపై ఎన్నో ఆశలు పెట్టుకున్నది. సుందరం తనవూరికే ప్రయాణమై వెళ్ళిపోయాడు.

12

పెళ్ళి చూపుల కోసం ముస్తాబైన అమ్మాయి ముఖంలా కళ కళ లాడుతోంది లక్ష్మయ్యగారి తోట. పెళ్ళికి తరలి పోతున్న వరుని ముఖంలోని ఠీవితో పోటి పడుతూంది ఆ తోటలో నూతనంగా నిర్మించబడిన ఆస్పత్రి భవనం. ఆ సందడి, ఆ హడావుడీ, తిరణాల సమయంలో కలిగే అలజడిని గుర్తుకు తెస్తూ ఉంది.

పిల్లలు, వృద్ధులు, యువకులు, యువతులు, నీరంతా ఎంతో ఉత్సాహంగా కళ కళ లాడుతూన్న ముఖాలతో ఆ ఆస్పత్రి భవన ప్రారంభోత్సవంలో పాల్గొన్నారు.

ప్రారంభోత్సవం ముగిసినతర్వాత ముఖ్య అతిథులకు, ఆస్పత్రి భవనంలో మిగతా వారందరికీ తోటలో భోజనాలు ఏర్పాటు చేశారు. తాయారు ఎక్కడ చూసినా తనే కనపడుతూ రామానికి కుడిభుజంలా పని చేస్తూ ఉంది. శాంత, శారదలుకూడా శక్తి వంచన లేకుండా వారికి తగిన పనులు చేస్తూనే ఉన్నారు.

తాయారు సుందరం చెల్లెలు. తండ్రిని ఒప్పించి అనుకున్న దానికన్న రెండువేలు ఎక్కువకట్నం ఖర్చుతో బస్తీ యువకుణ్ణి పెళ్ళాడింది. ఆరుమాసాలు బస్తీలో భర్తతో కాపురంచేసింది. ఆమెనుదుట బ్రహ్మ వ్రాసిన వక్రరేఖలు ఆమె సౌభాగ్యాన్ని ఏడవమాసంలో తుడిచిపెట్టాయి. భర్త మరణానంతరం అత్తమామలతో పేచీపడి శాశ్వతంగా ఉండి పోయేందుకు తల్లిగారింటికి వచ్చింది. మానసికంగా ఆమెకు సుందరం పోలికలే వచ్చాయి. బస్తీయింటికి కోడలిగా వెళ్ళి వచ్చిన ఆమె విధిలేక ఆమె మళ్ళీ పల్లెకే రావలసి వచ్చింది.

తాయారు శాంతతోపాటు హైస్కూలు చదువు పూర్తిచేసింది. ఇద్దరికీ స్నేహం కూడా ఎక్కువే! భర్త చనిపోయినా వేష ధారణలో ఆమె పిసరంత మార్పు కూడా తీసుకురాలేదు. సుమంగళిగా ముస్తాబవుతూ ఆమె వచ్చిన ఆ కొద్దిరోజులలోనే ఆ పల్లెలోని యువకులను నిద్రకు దూరంచేస్తూ ఉంది తాయారు.

తాయారు అక్కడికి వచ్చినప్పటినుండి రామంతో చనువుగా తిరగడానికి ప్రయత్నిస్తూ ఉంది. రామంమాత్రం తనకేమీ పట్టనట్టుగా తప్పుకు తిరుగుతున్నాడు.

ఆస్పత్రి భవన ప్రారంభోత్సవ ఉత్సవాలు ఆమెకు చక్కని అవకాశాన్ని కలిగించాయి. రామానికి సన్నిహితురాలని నలుగురూ ఊహించేవిధంగా అతనితో అసందర్భంగా మాట్లాడుతూ అసభ్యంగా ప్రవర్తిస్తూ ఉంది. ఆమెను మందలించడానికది తగిన సమయం కాదని, సహనంతో ముఖాన చిరునవ్వు తెచ్చిపెట్టుకొని నివురుగప్పిన నిప్పులా, గుంభనగా ఆమెతో మాట్లాడుతున్నాడు రామం.

యుక్తవయస్కులు, అవివాహితులైన ఆ గ్రామంలోని యువతులందరికీ రామం తనవాడౌతే ధన్యులవౌతామనే ఊహ మొదటినుండీ ఉంటూ వచ్చింది. కాని అతని స్వభావాన్ని పూర్తిగా అర్థంచేసుకున్న ఏయువతీ అతనిని పొందే ప్రయత్నం చేయలేదు. అతనినిగురించి తలపోస్తూ తీయని కలలు కంటున్నారేకాని కనీసం తమ అభిప్రాయాన్ని అతనితో చెప్పడానికి కూడా ఎవరూ సాహసించడంలేదు. రామం శాంతకు కాబోయే భర్తకాబట్టి అతనిని గురించి ఆలోచించడం నిష్ప్రయోజనమని తెలిసిగూడా ఆ ఆలోచలనుండి విరమించుకోలేక పోతున్నారు.

ఒక్క తాయారుతప్ప మిగతావారంతా రామానికి భయపడతారు.

తాయారు నిర్భయత, నిస్సంకోచత్వం, తెగింపు మొదలైన గుణాలుగల యువతి. రామం శాంతలు కాబోయే భార్యాభర్తలని తెలిసినప్పటికి విద్యార్థి దశలోనే రామంవద్ద ఒకసారి అతి చనువు ప్రదర్శించబోయి భంగపడింది. అప్పటినుండి రామం అంటే ఎక్కడో ఆమె హృదయంలో మారుమూల కొద్దిభయం ఏర్పడింది.

ఇప్పటి ఆమె పరిస్థితి వేరుగా ఉంది.

పూర్తిగా స్వతంత్రురాలు. అప్పుడే రెక్కలు వచ్చిన పక్షిలా ఊహాలోకాల్లో విహరిస్తూ ఉంది. తీరని కోరికలు ఆమె హృదయాన్ని గగ్గోలు పరుస్తూ ఉక్కిరిబిక్కిరి చేస్తున్నాయి.

శాంత తాయారును తన బావను గురించి ఎన్నో పిచ్చిపిచ్చి ఊహాలను తన మనసులో పెంచుకుంటూ ఉంది. శాంత అనుమానాలను శారద ఎంతో నేర్పుతో తుడిచేసింది. కాని ఉదయంనుంచీ తాయారు ప్రవర్తనను చూస్తున్న శాంత హృదయంలో పల్లేరుకాయలు కదిలాయి. తనవాడనుకున్న బావ తనకు దూరమైపోతున్నట్లు భావించ సాగింది. శారదకూడా ఈ విషయమే ఆలోచిస్తూ ఉన్నట్లు ఊహించిన శాంత ఆమె ముఖంలోకి భావయుక్తంగా చూసింది. ఆమె చూపుల నర్థంచేసుకున్న శారద 'కొద్దిగా వోపిక' పట్టమనే అర్థం వచ్చేట్లు సంజ్ఞ చేసింది.

ఆస్పత్రి భవన ప్రారంభోత్సవ కార్యక్రమం విజయవంతంగా ముగిసింది. ముఖ్య అతిథులంతా రామాన్ని, అతని కృషిని, ఎంతో మెచ్చుకున్నారు. ఆ తర్వాత ఊరి ప్రముఖులవద్ద శలవుతీసుకొని వెళ్ళిపోయారు. కార్యక్రమాలన్నీ ముగిసి యితర గ్రామాల నుండి వచ్చిన అతిధులు వెళ్ళిపోయేసరికి రాత్రి ఎనిమిది దాటింది. ప్రారంభోత్సవం రోజు రోగులకు చికిత్స ప్రారంభించాలి కాబట్టి అంతకుముందే రామం చేసిన ఏర్పాటు ప్రకారం నలుగురు రోగులు ఇన్ పేషెంట్లుగా, పదిమంది రోగులు అవుట్ పేషెంట్లుగా వచ్చి కార్యక్రమం ముగిసేంత వరకు ఎదురుచూస్తూ కూర్చున్నారు.

సుందరం ఆ పేషెంట్లను పరీక్ష చేస్తూ తనపనిలో లీనమయ్యాడు. శాంత, శారదలిద్దరూ ఆస్పత్రి భవనానికి కొద్ది దూరంలో ఒక మామిడి చెట్టుక్రింద కూర్చొని మాట్లాడుకుంటున్నారు. రామం రంగయ్యతాత కుటుంబానికి ఆరోజు తమ యింట్లో విందు ఏర్పాటు చేయడానికి లక్ష్మయ్యగారితో యింటికి వెళ్ళాడు.

లక్ష్మయ్యగారు శాంత, రామంల వివాహ ప్రసక్తిని తీసుకువచ్చినప్పుడు శాంత ముభావంగా ఊరుకుంది. రామం మాత్రం 'వచ్చే వేసవిలో ఆలోచిద్దాం! అప్పుడే తొందరేముంది? మొన్నటిదాకా ఆస్పత్రి గొడవతోనే సరిపోయింది' అని అన్నాడు.

శాంత ముభావంగా ఊరుకోవడం, రామం తమ వివాహాన్ని వచ్చే సంవత్సరానికి వాయిదా వేయమని కోరడంతో లక్ష్మయ్యగారి ముఖంలో శ్రావణ మేఘాలు కదిలి మాయమయ్యాయి. 'ఒరేయ్ రామం! ఇంతకాలం నీ యిష్టప్రకారమే జరుగుతూ వచ్చింది. వచ్చే సంవత్సరంవరకు వివాహాన్ని ఎందుకు ఆపాలో నా కర్థం కావడంలేదు' వారిద్దరినీ నిశితంగా చూస్తూ అన్నారు లక్ష్మయ్యగారు.

శాంత వంచిన తల ఎత్తలేదు—

'వ్యవసాయపు పనులు మొదలుపెట్టాను. అదీకాక పెళ్ళికిముందు కొంత వ్యవధి ఉంటే బాగుంటుందని నా ఉద్దేశ్యం. నిన్న నీవు పురోహితుణ్ణి అడిగి తెలుసుకున్నావట గదా! వారం లోపుగా ఉన్న ఒక్క ముహూర్తం తప్ప ఈ సంవత్సరంలో మా పేరు బలాలతో ఇక వేరే ముహూర్తాలు లేవని చెప్పినట్లు తెలిసింది. ఇంత కొద్ది వ్యవధిలో



వివాహమంటే మాటలా? అయినా అంత త్వరపడవలసిన అవసరమేముంది? మనదసలే పల్లెటూరు. ప్రతి చిన్న అవసరానికీ పట్నం పరుగెత్తాలి. అటువంటప్పుడు ఈ కొద్ది వ్యవధిలో అగ్నినిర్ణయం చేసుకొని బాధపడడ మెందుకు?' నచ్చచెప్తున్నట్లుగా అన్నాడు రామం.

'ముందొచ్చిన చెవులకన్న వెనుక వచ్చిన కొమ్ములువాడి. అలా ఉంది నీ వ్యవహారం. ఒక పెళ్లి జరిపించడానికి వారం రోజుల వ్యవధి కావాల్రా? తలచుకున్న మూడవ నాటికల్లా ఎన్నో పెళ్లిళ్లు నా చేతుల మీదుగా జరిగిపోయాయి. పిల్లొచ్చి గుడ్డును వెక్కిరించినట్లు లేనిపోని కబుర్లన్నీ చెబుతావేంరా?' తను హయాంలో జరిపించిన ఎన్నో పెళ్లిళ్లను గుర్తుకు తెచ్చుకుంటూ అన్నారు లక్ష్మయ్యగారు.

'ఇంత స్వల్ప వ్యవధిలో ముహూర్తం నిర్ణయించడం నాకు మాత్రం యిష్టం లేదు' అని అక్కడినుండి వెళ్లిపోయాడు.

'నాన్నా... బావ ఎప్పుడూ అనాలోచితంగా మాట్లాడడు. ఇంత త్వరలో ముహూర్తం కుదిరించుకొని తొక్కిసలాడడం ఏం సబబుగా ఉంటుంది?'

'సరే! మీ రిద్దరూ ఏకమైనతర్వాత నేనేం చేయగలను? ఎలా జరగవలనుంటే అలా జరుగుతుంది.' ఆయన ముఖంలో విషాదం తొణికిసలాడింది.

మల్లెలు...

'ఎందుకు నాన్నా అంత బాధపడతావ్? అసలు నీ భయమేమిటో నా కర్థం కావడం లేదు. బావను నేను వివాహమాడడానికి నిరాకరిస్తానని అనుమానమా? బావ నన్ను నిరాకరిస్తాడన్న సందేహమా?' తండ్రి ముఖంలోకి ప్రశ్నార్థకంగా చూస్తూ అడిగింది.

'ఏదైనా జరగవచ్చు! ఏ నిముషంలో ఏం జరుగుతుందో ఎవరు చెప్పగలరు?' కంఠస్వరంలో కాఠిన్యాన్ని నింపుకుంటూ శాంత కళ్లల్లోకి సూటిగా చూస్తూ అన్నారు లక్ష్మయ్యగారు.

'నిశ్చింతగా ఉండు నాన్నా! ఎటువంటి అశుభమూ జరగదు. నీవు బాధపడుతూ ఉంటే నేను చూడలేను' చిరునవ్వు చిందిస్తూ తండ్రిని సంతోషపరచాలని ప్రయత్నించింది శాంత.

లక్ష్మయ్యగారి ముఖ కవళికలలో ఎటువంటి మార్పూ రాలేదు. వారి ముఖంలో కనుపిస్తున్న గాంభీర్యాన్ని చూసి వారి వద్దకు వెళ్లడానికే భయపడింది శాంత.

ఈ సంభాషణలు మొదటినుండీ చివరిదాకా విన్నది శారద. వివాహ ప్రసక్తి రావడంతో ఆమె ఆలోచనలు ఎవరిమీదకో మళ్లాయి.

* * *

రామం తను కట్టించిన ఆస్పత్రికి తన తల్లిగారి పేరు పెట్టాడు. 'శ్రీ లక్ష్మీ వైద్యనిలయం' ఆస్పత్రిలో రోగుల సంఖ్య క్రమంగా అభివృద్ధిచెంద నారంభించింది. రామం తన తీరిక సమయాలను ఆస్పత్రి భవనంలోనే గడుపుతున్నాడు. నిరుపేదలైన రోగులకు ఆహార సదుపాయాలనుకూడా ఏర్పాటు చేస్తున్నాడు. అనతి కాలంలోనే ఆ ఆస్పత్రి పేరుప్రతిష్ఠలు ఆ చుట్టుపట్ల గల గ్రామాలన్నింటికీ వ్యాపించాయి. ఎవరి నోటవిన్నా రామంపొగడ్తలే! 'పుణ్యాత్ముడు' 'ధర్మదాత' 'దొడ్డ గుణం గల దొర' 'వెయ్యేళ్లు చల్లగా వర్ధిల్లాలి' ఇటువంటి వ్యాఖ్యానాలు రోజు రోజుకూ ఎక్కువవుతున్నాయి.

రామాన్నిగురించిన పొగడ్తలు వింటున్నప్పుడల్లా లక్ష్మయ్యగారు సంతోషంతో గర్వపడుతూండేవారు. 'రామం దొరగారి మామగారు' అని నలుగురూ అతని వెనుక అనుకుంటూ ఉంటే వారిముఖంలో దర్పం తొణికిసలాడుతూ ఉండేది.


రోజులు ఎటువంటిమార్పులు లేకుండా క్రమంగా గడిచిపోతున్నాయి. రెండురోజుల్లో బి. ఎ. రిజల్ట్సు వస్తాయని పత్రికలో ప్రకటించడం జరిగింది. ఆ ప్రకటన చూసిన శాంత, శారదల ఆత్రుత కొండ చీటి చేంతాడులా పెరిగిపోయింది. పరీక్షలు జరిగినతర్వాత గడిచిన రెండు మాసాలలో ఆదుర్దాపడని ఆ యిద్దరు ఈ రెండురోజులు తమ ఆత్రుతను అణుచుకోలేకపోవడం రామానికి ఎంతో విస్మయాన్ని కలిగించింది. తను హెచ్. ఎస్. సి. పరీక్షల ఫలితాల కోసం ఎదురుచూసిన రోజులు గుర్తుకు వచ్చాయి. 'అవును. ఆదుర్దాపడడం సహజమే!' అనుకున్నాడు రామం.

వారు నిరీక్షిస్తున్న ఆ రోజు రానే వచ్చింది. శాంతను, శారదను తోటకు వెళ్లమని తను పంచాయితీ ఆఫీసునుండి పత్రిక తీసుకు వస్తానని చెప్పి వెళ్లాడు రామం. శాంత, శారదలిద్దరూ తోటవైపు నడిచారు.

'రిజల్ట్సు వస్తున్నాయని తెలిసినప్పటి నుండీ నా హృదయం ఆత్రుతతో గాభరా పడుతూ ఉంది.' అంది శారద.

'అదేమిటే! నీవే యిలా బాధపడితే మరి నా విషయం!'

ఈ నియోజక వర్గంలో స్త్రీ ఓటర్లు అధికం అని తెలిసి నన్నెదిరించి నిలబడిందామె!!



'ఏం నాకు కొమ్ములున్నాయటే?'

'ఉన్నాయి' చిలిపిగా అంది శాంత.

ఇద్దరూ నవ్వుకున్నారు—

'బావ యింకెప్పుడు వస్తాడే?' ఆ దుర్గాతో ఆస్మృతి భవనంచుట్టూ ఉన్న పూలమొక్కలను చూస్తూ అంది శాంత.

'మన ఆదుర్దాయేగాని, అసలు పేపరు ఈ బస్సులో వచ్చిందో రాలేదో? ఒకవేళ వస్తే మరెవరైనా తీసుకువెళ్లారో ఏమో?' అనుమానపడుతూ అంది శారద.

'అబ్బ; ఆదుర్దా మనుష్యులను ఎంత చీకాకు పెడుతుందే!'

'ఆదుర్దా అంటున్నావేమిటే శాంతా?' అప్పుడే రోగులవద్ద తీరికచేసుకొని వీరిద్దరు కూర్చున్నవైపు వస్తూ సుందరం అడిగాడు

'ఈరోజు మా రిజల్ట్సు వస్తున్నాయి.'

'అందుకా యింత ఆదుర్దా? ఇద్దరూ ఫస్ట్‌క్లాసు స్టూడెంట్సే! తప్పకుండా ప్యాసౌతారు. మీరు ప్యాసు.కాకపోతే పరీక్షకు కూర్చున్నవాళ్లంతా తప్పవలసి వస్తుంది. చిరునవ్వుతో శాంతను చూస్తూ వారికి కొద్దిదూరంలో పచ్చికపై కూర్చున్నాడు సుందరం.

'ఏం సుందరం? ఎలా ఉంది ఈ వాతావరణం? విసుగు కలిగిస్తూ ఉందా? అప్పుడు రానని మొండికెత్తావుగదు! మరి ప్పుడేమో ఉత్సాహంగానే కనుపిస్తున్నావు.' అతని ముఖకవళికలను జాగ్రత్తగా పరికిస్తూ అంది శాంత.

'ఏం ఉత్సాహం లెద్దూ! ఒక విధంగా జైలు జీవితాన్ని గడుపుతున్నట్లు ఉంది. ఇక్కడ సినిమాలా? క్లబ్బులా? అయినా అసలు తీరితేగదు! మొత్తానికి నాతో నిముషం తీరిక లేకుండా పనిచేయిస్తున్నాడు రామం. ఏదో విధంగా కాలం గడిచిపోతూ ఉంది.' అన్నాడు సుందరం.

వీరిలా మాట్లాడుకుంటూ ఉండగానే అక్కడికి రామం వచ్చాడు. అతని ముఖకవళికలు ఉత్సాహకరంగా లేకపోవడంతో శాంత, శారదలు అనుమానపడ్డారు.

'ఏమన్నయ్యా? రిజల్ట్సు ఎలా ఉన్నాయి.' అతని కళ్లల్లోకి అనుమానంగా చూస్తూ అడిగింది శారద.

'ఏం చెప్పమన్నావమ్మా?' ఆ మాటలని [illegible]గిపోయాడు రామం.

'బావా?'

'అన్నయ్యా!'

'ఇద్దరితో ఒకేసారి పృశ్ని వేసినట్లు అన్నారు—

'ఇద్దరూ ఫేలయ్యారు.' ఇద్దరినీ జాగ్రత్తగా పరిశీలించి చూస్తూ అన్నాడు రామం.

'అసంభవం!' అన్నాడు సుందరం.

'నిజమే!' రెట్టించాడు రామం.

'నిజమేనా అన్నయ్యా!' అతని మాటలు నమ్మలేక మరోసారి అడిగింది శారద.

'ఔ'నని తల ఊపాడు రామం.

ప్రపంచంలో గల విషాదాన్నంతా తన ముఖంలో నింపుకొని 'అన్నయ్యా యిలా జరుగుతుందని కలలో కూడా ఊహించ లేదు. ఎంతో జాగ్రత్తగా చదివాను. శాంతకూడా నాతోపాటు చదివేలా చూశాను. ఇద్దరమూ తృప్తిగా పేపర్సు వ్రాశాము కున్నాము. ఈ విధంగా ఎందుకు జరిగిందో నా కర్థంకావడం లేదు.' చివరిమాటలు అంటున్నప్పుడు ఆమెకళ్లల్లోని కన్నీరు కనుకొనుకులనుండి క్రిందికి జారడానికి సిద్ధంగా ఉంది.

ఆమెను ఆస్థితిలో చూడలేక పోయాడు రామం. తను హాస్యానికి అన్నమాటలు శారదను ఎంతగా నొప్పించాయో అతనికి అర్థమైంది.

'బాధపడకమ్మా ! నీవు ప్యాసయ్యావు. అదీ డిస్టింక్షన్‌లో. కాని మా మొద్దమ్మాయి శాంతమాత్రం ఫేలైంది.' శారదను చిలిపిగా చూస్తూ అన్నాడు రామం.

'నిజమా అన్నయ్యా ! నీవలా చెబుతూ ఉంటే మొదట్లో నమ్మలేదు. కాని నీవు చెబుతున్నావు కాబట్టి నిజంగానే నేను పరీక్షలో తప్పానేమోనని భయపడిపోయాను.' సంతోషంగా అని మరుక్షణంలోనే తన ముఖ కవళికలను మార్చుకుంటూ 'అయ్యో ! శాంత తప్పిందా ? అదెలా సాధ్యమవ్వు ?' శాంత తప్పిందన్న విషయాన్ని నమ్మలేక సందేహపడుతూ అడిగింది శారద.

'నీవుండవే ! బావ నునను ఆట పట్టిస్తున్నాడు.' అని రామం తన వెనుకగా పెట్టుకున్న పేపరును అతను ఊహించ లేనంత చురుకుగా లాక్కుంది.

'మొదవే నా నెంబరు ! ఫస్టుక్లాసులో ప్యాసయ్యాను.' అని రామంవైపు తిరిగి 'అన్నీ కొంటెవేషాలు. అనవసరంగా శారదను ఏడిపించావు.' అతనికళ్లల్లోకి కొంటెగా చూస్తూ అంది శాంత.

పం ల్లైలు...

రామం శాంతను చూస్తూ 'నీ పట్టుదల నెరవేరింది. గ్రాడ్యుయేటువయ్యావు. మన మిద్దరమూ కలిసి ఇక మామయ్య మాటను మన్నించాలి.'

'ఫో బావా...!' సిగ్గుతో తల వంచు కుంటూ అంది శాంత.

వీరిద్దరి అన్యోన్యతను చూస్తూ తన ముఖంలో రంగులు మార్చుకున్నాడు సుందరం. శాంత, రామం ఈ విషయాన్ని గమనించలేదు కాని శారదమాత్రం సుందరం ముఖంలోని మార్పును గుర్తించ గలిగింది.

'అమ్మా శారదా ! నీవు ఘనంగా ప్యాసయ్యావు. నాకు చాలా సంతోషంగా ఉంది. యం. ఏ. చదువుతావా ?' ఆప్యాయంగా శారదను చూస్తూ అడిగాడు రామం.

'లేదన్నయ్యా ... ఇంకేమీ చదవను. ఇప్పటికే మీ ఋణభారం భరించలేకుండా ఉన్నాను.' ఆనందాశ్రువులు రాలుస్తూ అంది శారద.

'ఎందుకమ్మా కళ్లల్లో ఆ కన్నీరు ?'

'కన్నీరు కాదన్నయ్యా ! అవి ఆనంద బాష్పాలు.'

'చెల్లీ ! నాకు తోబుట్టువులు లేని కొరత నీతో తీర్చుకుంటున్నానమ్మా !' ఆమె ముఖంలోని సంతోషాన్ని గమనిస్తూ అన్నాడు రామం.



'అన్నయ్యా!' ఆ పిలుపులో ఎంతో ఆత్మీయత నిండి ఉన్నది.

'ఇప్పుడు చెప్పమ్మా! నీకు యింకా చద వాలని ఉంటే తప్పకుండా చదివిస్తాను. అన్నయ్యవద్ద ఏ చెల్లెలైనా సంకోచపడు తుందా ?'

'సంకోచం కాదన్నయ్యా? ఇప్పటికే నాకెంతో సాయంచే...'

'శారూ! ఇప్పుడవన్నీ ఎందుకే ? బావ అడుగుతున్నాడు. నీకు చదువుకోవాలని ఉంటె చెప్పు చదివిస్తాడు.' శారద మాటలను మధ్యలోనే త్రుంచుతూ ఆమెను ప్రోత్సహిస్తూ అంది శాంత.

'అన్నయ్యా...నాకు బ్యాచ్యులర్ ఆఫ్ ఎడ్యుకేషన్' బి. ఇడి.ట్రైనింగు పొందాలని ఉంది.'

'ఓహో! శారదమ్మగారు పంతులమ్మగా రవుతారన్నమాట!' నవ్వుతూ అంది శాంత.

'అలాగేనమ్మా ! ఆ యేర్పాట్లు నే చూస్తాను.' అని సుందరంవైపు తిరిగి 'సుందరం ప్రక్క ఊరికివెళ్లి ఒక పేషెంటును చూసి రావాలి. పద వెడదాం. అవసరమైతే అతనిని మన ఆస్పత్రిలో చేర్చ వలసివస్తుందికూడా. ఇంతకే వచ్చి కాళ్ళా వేళ్ళాపడి బతిమిలాడి వెళ్లారు.' సుందరాన్ని స్నేహ పూర్వకంగా చూస్తూ అన్నాడు రామం.

'అలాగే పద!' అన్నాడు సుందరం.

ఇద్దరూ అక్కడినుండి వెళ్లిపోయారు. శాంత, శారదలిద్దరూ యింటికి వెళ్ళడానికి లేచి నిలుచున్నారు.

*   *   *

అవి వర్షాకాలపు ప్రారంభపురోజులు. యుద్ధంలో చెదిరిపోయిన సైనికుల సహా కరణలా మేఘాలు ఒక్కదగ్గరకు చేరు తున్నాయి. పడమటిదిక్కుకు పయనమైన సూర్యుని 'చాలించు నీ ప్రతాపం' అనే ట్లుగా మేఘాలు కప్పివేస్తున్నాయి. అంత వరకూ దినబాంధవునే సూటిగా చూస్తున్న లక్ష్మయ్యగారి తోటలోని ప్రొద్దు తిరుగుడు పూలు అతను కనుమరుగవడంతో ప్రియుని కోల్పోయిన ప్రేయసిలా నిరుత్సాహంతో ముఖాలు వ్రేళ్లాడవేస్తున్నాయి.

సూర్యుడు మబ్బులమాటున చేరడంతో అంతవరకు ఉన్న వేడి తగ్గిపోయి చల్లదనం నలుదిశల అలుముకుంది.

అభిజ్ఞాన శాకుంతలంలోని దుష్యంత, శాకుంతలల గాంధర్వ వివాహఘట్టం ముగిసిన తర్వాతగం ప్రేమఘట్టాన్ని చదివి, ఆ గ్రంధపఠనంవల్ల కలిగిన మానసికోద్వేగంతో పారిజాతపుష్పవృక్షానికి తల ఆనించి మత్తుగా కళ్ళు మూసుకొని ఆలోచనలోపడిన శాంతకు ప్రకృతిలో వచ్చిన మార్పు తెలియడంలేదు. ఆమె అలంకరణ ఎంతో ఆకర్షణీయంగా ఉంది. ఆమె కళ్లల్లోని కాటుక అమావాస్య చీకటితో పోటీపడుతూ ఉంది. సిగ్గుతో ఎరుపెక్కిన కపోలములు, భావోద్వేగంవల్ల వణుకుతూన్న ఆ పెదిమలు, సిగలో తెల్లగా మెరుస్తూ తమ సౌరభాన్ని ఆ ప్రదేశమంతా విరజిమ్ముతూన్న దొంతర మల్లెలు, తెల్లని చీరెలో, లేత నీలి రంగు బ్లౌజుతో దివి నుండి భువికి దిగి వచ్చిన దేవకన్యలా ఉంది ఆమె.

పాల పొంగులాంటి యౌవనం, ఆ మధుర కావ్య పానం ఆమెను ఏవో ఊహా లోకాలలో విహరింపచేస్తూ ఉన్నాయి.

సన్నగా వాన చినుకులు ప్రారంభమై, మరుక్షణంలో ఆ చినుకులే పెద్ద వానగా మారాయి. ఆ తన్మయత్వం నుండి తేరుకొనే సరికి పూర్తిగా తడిసి పోయింది శాంత. ఆస్పత్రి భవనం వైపుగా పెద్ద పెద్ద అడుగులతో నడిచింది. అక్కడికి చేరుకునే సరికి ఒళ్ళంతా నీరు కారసాగింది.


శాంతను ఆ స్థితిలో చూసిన సుందరం 'ఏమే! ఇదేమిటే శాంతా? అలా తడిసి పోయావేం?' ఆశ్చర్యం ప్రకటిస్తూ తన గది లోపలికి ఆహ్వానించాడు.

ఆఫీసు గది కాకుండా సుందరానికి మరొక ప్రైవేటు గది ఏర్పాటు చేయబడింది. భోజనానికి మాత్రం తమ ఇంటికి వెళ్లి వస్తూ ఉంటాడు. రాత్రి పూట కూడా ఆస్పత్రిలోనే పడుకుంటూ ఉంటాడు.

తన గదిలోపలికి వచ్చిన శాంతను చూస్తూ 'ఇదిగో టవలు. పూర్తిగా తడిసిపోయావు. త్వరగా తుడుచుకోకపోతే జలుబు

చేస్తుంది. వర్షం వచ్చే సూచనలు అంత స్పష్టంగా తెలుస్తున్నప్పుడు నిర్లక్ష్యంగా తోటలో ఏం చేస్తున్నట్లు?' శాంత కళ్లలోకి ఆదరకంగా చూస్తూ ప్రశ్నించాడు సుందరం.

'...........'



మబ్బులు పట్టి వర్షం కురుస్తూ ఉండడం వల్ల గదిలో చీకటి ఆవరించింది. లైటు వేశాడు సుందరం. ఆ లైటు కాంతిలో తడిసిన శరీరంతో, వింత అందంతో కనుపిస్తూ ఉంది శాంత. తడిసిన ఆ దుస్తులు ఆమె శరీరంలో వంపులను బహిర్గతం చేస్తున్నాయి. వెంట్రుకల నుండి కారుతూన్న నీటి బిందువులు ముఖం పై పడి లైటు కాంతికి ముత్యాల్లా మెరుస్తున్నాయి. చలివల్ల కొద్దిగా ఒణుకుతూ ఉరది శాంత.

'చలితో వణికిపోతున్నావు. పొడిగుడ్డలు యిప్పుడెక్కడి నుండి వస్తాయి?' అని ఒక్క క్షణం ఆలోచించి 'మా యిల్లు యిక్కడికి చాలా దగ్గర, ఎవరినైనా పంపించి తాయారు గుడ్డలు తెప్పిస్తాను.' అని బయటికి వెళ్ళి ఆస్పత్రి పనివానికి ఆ పని పురమాయించి మళ్ళీ లోపలికి వచ్చాడు సుందరం.

అప్పటికి తల, ఒళ్ళు తుడుచుకొని చీరెకుచ్చిళ్ళు పిండింది శాంత.

'అతనిని ఎందుకు పంపావు సుందరం? గొడుగుంటే నేనే యింటికి వెళ్ళిపోయే దానినుగా.' ఆ పరిస్థితిలో అతని గదిలో ఒంటరిగా ఉండడం యిష్టం లేక అంది శాంత.

'ఇంత పెద్ద వర్షంలో ఎలా వెడతావు? కొద్ది సేపట్లో తగ్గిపోవచ్చు. తగ్గిపోయాక వెదుదువుగాని' అని శాంతను ఒళ్లంతా కళ్ళు చేసుకొని చూడసాగాడు సుందరం.

అతని చూపులు శాంతకెంతో సిగ్గును కలిగించాయి. ఆ పరిస్థితి ఏర్పడినందుకు మనసులో ఎంతగానో విచారపడ సాగింది. వర్షంలో బాగా తడిసినందువల్ల ఒంట్లో నుంచి చలి పుట్టుకు వస్తూ ఉంది. ఎంత ఆపుకుందామనుకున్నా ఆమెకు వణుకు పుట్టడం ఆగడం లేదు, ఎలాగో ఆ చలిని ఓర్చుకుంటూ అక్కడున్న కుర్చీలో ముడుచుకొని కూర్చుంది ఆమె.

'శాంతా! ఫ్లాస్కులో కాఫీ ఉంది. కొద్దిగా తీసుకో' అని ఫ్లాస్కు మూత తీసి ఆ మూతలోనే కాఫీపంచి ఆమెకు అందించాడు.

అలా అందించడంలో కావాలనే శాంత వ్రేళ్ళను తాకాడు. ఆ స్పర్శతో శాంతకు సికింద్రాబాదులో ప్లాటుఫాంమీదనువద్ద జరిగిన

పం ల్లెలు...

సంఘటన అప్పటి సుందరం ప్రవర్తన రెండూ గుర్తుకు వచ్చాయి. ఇందాక చూసిన చూపులు గత సంఘటనలకు బలాన్ని చేకూర్చాయి. సుందరం తనను వాంఛిస్తున్నాడన్న విషయం ఆమెకు స్పష్టమైంది. ఇప్పటిస్పర్శ ఆమెకు విద్యుద్ఘాతంలా తగిలింది. బెదిరిపోయింది.

ఏమీ మాట్లాడలేక మనసులో మధనపడుతూ అతనందిచ్చిన కాఫీ చప్పరిస్తూ కూర్చుంది. కాఫీత్రాగడం పూర్తిచేసేసరికి పొడిగుడ్డలు వచ్చాయి. సుందరాన్ని గది బైటికి వెళ్లమని సంజ్ఞచేస్తూ గది తలుపులు మూసి గుడ్డలు మార్చుకో సాగింది.

పొడిగుడ్డలు కట్టుకొని కుర్చీలో కూర్చొని మెడికల్ మాగజైనొకటి తిరగవేస్తూ కూర్చుంది. ఎవరో పేషెంటు బాధతో కేకలువేస్తూ ఉండడంవల్ల అతనిని చూడడానికి వెళ్లిపోయాడు సుందరం.

ఒంటరిగా కూర్చున్న శాంత ఆలోచనల సుడిగుండంలో పరిభ్రమించ సాగింది. 'ఏమిటిది? సుందరం ఉద్దేశ్యం ఏమై ఉంటుంది? అతను నాపై మోజు పడడంలో అర్థంలేదు. అలా ఎందుకు ప్రవర్తిస్తున్నాడు? నేనైనా అతనిని గట్టిగా మందలించలేక పోతున్నానేమిటి? ఎందుకో ఏమో నాలోని బలహీనత నన్ను వెనుకకు లాగుతూ ఉంది. ఈ విషయం బయటపడితే యింకేమైనా ఉందా? అమ్మ బాబోయ్! నాన్న నన్ను నిలువునా పాతేస్తాడు. బావ మాత్రం ఊరుకుంటాడా? ఇంతకాలం అతని సొత్తనుకున్న నాపై ఎవరిదృష్టి పడినా సహించడు. మరి...బావకు, నాకు మధ్యగల అనుబంధం తెలిసిన సుందరం యిలా ప్రవర్తించడం ఎటువంటి విషమ పరిణామాలకు దారితీస్తుందో...? ఇప్పుడు నేనేంచేయాలి? సికింద్రాబాదులో జరిగిన ఆ హఠాత్సంఘటన తర్వాత సుందరం యొక్కరూపం నా హృదయంలో ఏ మూలనో స్థావరమేర్పరచుకొని క్రమంగా దినదినాభివృద్ధి జరుగుతూ ఉంది. రామం రూపంతో నిండివుండే నా హృదయం రెండుభాగాలై నాకు అప్పుడప్పుడు మానసికవ్యధను కలిగిస్తూ ఉంది. నాకు తెలియకుండానే నేను సుందరాన్నిగురించి ఆలోచించడం లోగా ఒకటిరెండుసార్లు జరిగింది. అలా జరిగినపుడు నాకు మనశ్శాంతి దూరమవుతూ వస్తుంది.

'కనీసం శారద ఉన్నా బాగుండేది, ఆమె వెళ్ళిపోయి పదిహేను రోజులు దాటాయి. బావ తోడుగావెళ్ళి ట్రైనింగు కాలేజీలో చేర్పించి వచ్చాడు: నా హృదయంలో చెలరేగుతున్న ఈ తుఫాను ఎవరికి చెప్పుకోను? హృదయభారాన్ని ఎలా తగ్గించుకోను? నాకంతా అయోమయంగా ఉంది.

'తయారు ప్రవర్తనకు అర్థంయేమిటి? బావకు సన్నిహితురాలు కావడానికి ప్రయత్నించడంలో ఆమె ఉద్దేశ్యమేమై ఉంటుంది? బావకూడా ఆమెపై మోజు పడుతున్నాడా? హే భగవాన్ ఏమిటీ అగ్నిపరీక్ష నాకు?'

పైవిధంగా ఆలోచిస్తున్న ఆమెకు 'శాంతా! శాంతా!' అని పిలిచిన రామం పిలుపులు వినిపించి బాహ్యస్మృతి కలిగింది.

శాంత ఉన్నగది లోపలికి వచ్చిన రామం 'శాంతా! నీవిక్కడున్నావా?' అతని మాటలు ఆశ్చర్యాన్ని వ్యక్తం చేస్తున్నాయి.

'అవును బావా...అభిజ్ఞాన శాకుంతలం చదువుతూ తోటలో అలాగే కూర్చుండిపోయాను. అకస్మాత్తుగా వర్షం రావడంతో తడిసిపోయి యిక్కడికి వచ్చాను. సుందరం తాయారుగుడ్డలు తెప్పించి యిచ్చాడు. అవి మార్చుకొని వర్షం ఎప్పుడు తగ్గుతుందా అని ఎదురుచూస్తూ కూర్చున్నాను.' రామం ముఖంలోని భావాలు నర్థం చేసుకోవడానికి వ్యర్థప్రయత్నం చేస్తూ అంది శాంత.

'అంత పరధ్యానంగా ఉన్నావా? వర్షం తగ్గి పదినిమిషాలైంది 'ఇంకా యింటికి రాలేదేమిటబ్బా' అని మామయ్య ఆందోళన పడుతూఉంటే వెదుకుతూ బయలుదేరాను.' అతని ముఖంలో కొద్దిగా విసుగు ద్యోతకమైంది.

ఆ విధంగా విసుగుపడుతూన్న రామాన్ని చూసిన శాంత మనసు చివుక్కుమంది. మౌనంగా అతనిని అనుసరిస్తూ యింటివైపు నడిచింది.

(ఇంకా ఉంది)

స్వేచ్ఛాఫలం. డా॥సి. నారాయణరెడ్డి



కిటికీ చువ్వలచుట్టూ
అలమటిస్తున్న తీగ.
తీగనుంచి విడిపోవాలని
ఊగిసలాడే చిగురాకులు.
చిగురాకులమీద పాకుతున్న
చిన్న చిన్న చీమల బారులు
తీగ స్వేచ్ఛను కోరుకుంటే
ఆకులు స్వేచ్ఛను కోరుకుంటే
చీమలు స్వేచ్ఛను కోరుకుంటే
తీగకంటె ఆకులకంటె
చెదిరిపడే చిరుచీమలకంటె
సర్వోన్నతుడైన మానవుడు
స్వచ్ఛందతను కోరడంలో
విచిత్రమేముంది?
విడ్డూరమేముంది?
ఆలనాడు
నాగరికత తొలిపొద్దులనాడు
అన్నకోసమే తప్ప అన్యమెరుగని
అనాదశలో ఉన్నప్పుడు
సకల సుఖాలూ
అంగన కౌగిళ్ళలోనే ఉన్నాయని
అనుకుంటున్నప్పుడు
తినడానికి తాగడానికి
తిరగడానికి ఒరగడానికి
ఆకుపచ్చలోకం ఉపయోగించినప్పుడు
అప్పుడు—
మనిషి అనేవాడు
మత్తుకళ్ళు విప్పుతున్నాడు.
కళ్ళెదుట చెట్టు నిలిచింది.

కలకలలాడే పండు పిలిచింది.
కళ్ళకూ పళ్ళకూ చవులూరించింది.
మనసు పొరలను కెలికింది.
తనువెల్లా తియ్యనికోరికలు
పురికొలిపింది
అది మానవునికి పండు తినాలనే
ఆకాంక్ష పుట్టించింది.
అంతా గమనిస్తున్న దేవునికి
అలజడి పుట్టింది.
మూడడుగులు వేశాడు మానవుడు
ముందు కురికాడు దేవుడు.
పండును పట్టుకున్నాడు మానవుడు
పటపట పండ్లుకొరికాడు దేవుడు.
'ఆపండు తినొద్దు జాగ్రత్త!'
ఆంక్ష—దేవునిది.
'ఆపండేకావాలి నాకు'
కాంక్ష—మానవునిది,
'కౌగిట్లో ఉన్న పండును
కావలసినంత అనుభవించు
నిషిద్ధ ఫలంమీద వాలిన
నీ చూపు ఉపసంహరించు'
శాసించాడు దేవుడు.
ఘోషించాడు దేవుడు.
కంటి తెరలుమలుముకున్నాడు
మానవుడు,
ఒంటిపొరలు దులుపుకున్నాడు
మానవుడు.
తనచుట్టూ సంకెళ్ళున్నాయి
పెనవేసుకున్న పీటముళ్ళున్నాయి
తనకూ రెక్కలంటూ వున్నాయి

అవి అడకత్తెరల్లో చిక్కుకున్నాయి;
తనకు వాక్కులంటూ వున్నాయి
వాటి కుత్తుకలు నొక్కబడివున్నాయి.
ఫలాకాంక్ష పెరిగిపోతున్నది.
ఫలతలం మెరిసిపోతున్నది.
చిత్తం తిరగబడుతున్నది
రక్తం కుబుసం విడుతున్నది.
విక్రమించాడు మానవుడు
విస్తుపోయాడు దేవుడు.
దేవుడు చూస్తుండగానే
దిక్కులు చూస్తుండగానే
నించిన పండును తటాలున
తుంచుకున్నాడు మానవుడు.
దేవుడు శపించాడు
దిక్కులు ఖండించాయి.
ప్రకృతి కన్నెర్రజేసింది.
సకల గ్రహాలూ ఆగ్రహించాయి.
అవేవీ మానవుణ్ణి అరికట్టలేదు
అంతటితో అతని ఆశయం
కడముట్టలేదు
స్వేచ్ఛకుచుట్టిన శ్రీకారమది.
ప్రకృతి విజయచరిత్రలో
ప్రథమ పాదమది.
సంకెళ్ళను తెంచుకున్ననాటి మానవుడు
సర్వదా ఆరాధ్యుడు.
అతనికివారసుడుగావున్న నేటిమానవుడు
అన్నిటా ఆదర్శుడు.

ఆంధ్ర సచిత్ర వార పత్రిక 197

ఉత్తమ నటి	ఉత్తమ నటుడు	ఉత్తమ సహాయనటుడు
		
	నాగేశ్వరరావు	శోభన్ బాబు

సిని[illegible] ఎంతో ఉత్సాహంతో పాల్గొని దానిని జయప్రదం చేసిన ఆంధ్రసచిత్ర వారపత్రిక పాఠకులందరికి మా కృతజ్ఞతలు.

బాలట్ ఫలితాలు ఈ కింద యిస్తున్నాము. 10 శాతం కంటె తక్కువ వచ్చిన వ్యక్తులు, చిత్రాల వివరాలు యివ్వటం లేదు.

ఉత్తమ నటిగా ఎన్నికైన కుమారి వాణిశ్రీకి 73.2 శాతం వోట్లు రాగా మిగతావారిలో ఏ ఒక్కరికి 10 శాతం వోట్లు కూడా రాలేదు.

ఉత్తమ నటుడిగా వచ్చిన శ్రీ అక్కినేని నాగేశ్వరరావుకి 70 2 శాతం వోట్లు వచ్చాయి. శ్రీ ఎన్. టి. రామారావుకి 21.1 శాతం వోట్లు రాగా మిగతా వారందరికీ కలిపి 8.7 శాతం వోట్లు వచ్చాయి.

ఉత్తమ సహాయనటుడిగా ఎన్నికైన శోభన్‌బాబు 65.7 శాతం వోట్లు, రెండవస్థానాన్ని ఆక్రమించిన శ్రీ నాగభూషణం 11.3 శాతం వోట్లు సంపాదించగా మిగిలినవారందరికీ కలిపి 23 శాతం వోట్లు వచ్చాయి.

ఉత్తమ హాస్యనటుడిగా వచ్చిన శ్రీ రాజ్‌బాబుకి 58.7 శాతం వోట్లు

ఉత్తమనటి - వాణిశ్రీ. ఉ
శ్వరరావు. ఉత్తమ సహాయనటుడ
నటుడు రాజ్‌బాబు, ఉత్తమ సం
ఉత్తమ సహాయనటి - చంద్రకళ, ఉ
దర్శకుడు- ఆదుర్తి సుబ్బారావు.

ఉత్తమ చిత్రం

★

ధర్మదాత

0 సినిమా బాలట్ ఫలితాలు!

ఉత్తమ హాస్యనటుడు



రాజ్‌బాబు

ఉత్తమ సంగీత దర్శకుడు



మహాదేవన్

ఉత్తమ సహాయనటి



చం

త్తమ నటుడు - అక్కినేని నాగే
ం - శోభన్‌బాబు, ఉత్తమ హాస్యా
ీత దర్శకుడు - కె. వి. మహాదేవన్.
త్తమ చిత్రం - ధర్మదాత, ఉత్తమ
అందరికీ మా అభినందనలు!

త్తమ
కుడు



శ్రీ

ప త్రి
్రావు


వస్తే రెండవ వాడుగా వచ్చిన శ్రీ పద్మనా[illegible] శాతం వోట్లు వచ్చాయి.

సంగీత దర్శకులలో ఉత్తములుగా ఎన్నికయిన శ్రీ కె. వి. మహాదేవన్ 58.3 శాతం వోట్లని పొందితే మిగతా వారిలో ఏ ఒక్కరికి 10 శాతం మించి వోట్లు పడలేదు.

ఉత్తమ సహాయనటిగా ఎన్నికైన కుమారి చంద్రకళకి 47 శాతం వోట్లు, రెండస్థానంలో వచ్చిన శ్రీమతి విజయనిర్మలకి 10.5 శాతం వోట్లు వచ్చాయి.

ధర్మదాత 26.2 శాతం వోట్లతో ఉత్తమ చిత్రంగా ఎన్నికైతే రెండవ, మూడవ స్థానాలని పొందిన చిత్రాలు మరో ప్రపంచం, కోడలుదిద్దిన కాపురం చిత్రాలకి వరుసగా 21.6 శాతం 12.6 శాతం వోట్లు వచ్చాయి.

ఉత్తమ దర్శకుని ఎన్నికని పరిశీలిస్తే వోట్లు బాగా పంచబడినట్లు తెలుస్తుంది. శ్రీ ఆదుర్తి సుబ్బారావుకి 21.6 శాతం శ్రీ అక్కినేని సంజీవికి 18.3 శాతం వోట్లు వస్తే శ్రీయుతులు బాపు, యోగానంద్‌లకి సరిసమానంగా చెరి 10.7 శాతం శ్రీ సి. ఎస్. రావుకి 10.5 శాతం వోటు పడ్డాయి.



మాయ స్వార్థానికి గెలుపా, ఓటమా!

శ్రీహరి

'నీకేమన్నా మతుందిలా ...? అవ్వ! నలుగురూ నవ్విపోతారు, శాంతేమిటి? పెళ్లేమిటి...?'

'అది కాదమ్మా!'

'ఏది కాదు? పట్టుమని పదహారేళ్లు నిండాయో లేదో, దాని కప్పుడే పెళ్లా!'

'మంచి సంబంధమమ్మా! మళ్లీ కావాలంటే మాత్రం దొరుకుతుందా ...? ఎంతైనా కన్న తరవాత బాధ్యతంటూ ఉంటుందిగా...! దాన్నో మంచివాడి చేతుల్లో పెట్టేస్తే...'

'అయితే ఆ కాడికి నువ్వొకడివే బాధ్యతున్న వాడివీనూ, మేమంతా కానివాళ్లమూ అన్నమాట! ఏమిటా ప్రసాదం నీ మాటలు...?

చదివావు డాక్టరుచదువు! ఎందుకూ...? అసలు నీ వయస్సెంతని...? అహ, ఎంతని? ఇంకో ఐదేళ్లు పోతేగాని నలభైఏళ్లు రావు, అప్పుడే నీకీ ఆలోచన్నా...?'

'ఇంకా నయం! ఈమాట నాముందంటే అన్నావు! అదే కోడలి ముందంటే...'

* * *

'ఏమిటండీ మరీ చోద్యం మీకు! ఇహ మీ రొక్కరే దాని మంచీ చెడ్డా చూసే వారూనూ, మేమంతా ఎందుకూ పనికిరాని వాళ్లమూనూ! మీ కెంత బాధ్యతుందో మాకూ అంతా ఉంది! ఇంకా కావాలంటే అంతకన్నా ఎక్కువే ఉంది! అవ్వ! పెద్ద మనిషై మూడేళ్లు నిండలేదు! కనీసం ముచ్చటగా చీరలు కట్టుకునే వయసన్నా రాలేదు; చదువు నాలుగోవంతైనా పూర్తవలేదు'

'అదికాదు సీతా?'

'నో! నో! మరో ఐదారేళ్లు దాని పెళ్లి మాట ప్రస్తావించకండి! అసలు పెళ్లివిషయంలో మీ జోక్యం అనవసరం నిజం చెప్పాలంటే. మీ రేడో, మీ హాస్పిటలేదో చూసుకుంటే, అదే చాలు!

'ఈ రాద్ధాంతం అదీవింటే మనం దాన్ని మెడపుచ్చుకుని గెంటాలనుకుంటున్నాం' అనుకుంటారు! అంతకన్నా ఇంకేం అక్కర్లా, మన మొహాలు వ్రేలాడేసుకోడానికి!' అనవలసిన నాలుగూ అనేసి ఏదో పనున్నట్టు దూరంగా వెళ్లిపోయింది సీత!

నానోట మాట పెగల్లేదిక! ఏదో ఆలోచిస్తూ అలాగే కూర్చుండి పోయాను! నవ్వొచ్చింది! నవ్వాను కూడా! ఇందాక అమ్మ అన్న మాటలే దృష్టిలో మెదుల్తున్నాయి! నిజం! అమ్మ అన్నట్టు, ఇంకా నాలుగైదేళ్లు పోతేగాని నలభయ్యో పడిలో పడను!

నా చిన్నతనం ఇంకా నా కళ్లముందుంది!

* * *

'అదేమిటోదినా ప్రసాదాన్ని అలా

ఇంట్లోనే పెట్టి చదివిస్తున్నావు! బొత్తిగా ఇంటి చదువైతే ఎలా అబ్బుతుంది...? పిల్లలంటూ పుట్టినతరవాత మనం ప్రతిదీ మన ఇష్టమొచ్చినట్టు వాళ్ళని పెంచుదాం అంటే ఎలా కుదురుతుంది...? కావాలంటే ప్రయివేటు పెట్టించుకో! అంతేగాని, బడికి పంపకుండా ఇంట్లోనే పెడితే...దమ్మిడీకి కొర గాదమ్మా! ఆ...!'

'ఏం ప్రతివాళ్ళూ బడిలో చదివే పైకొస్తున్నా రంటావా ...? చదువెక్కువైతేనేం, రాసుండాలిగాని! ఆ...! అయినా ఆ బళ్ళలో నేర్చుకునేదేమిటో...? అంతా కాకిమూక! ఆ మైలగుడ్డల్లో కప్పెసోవడం, ఆ రుచీ శుభ్రం లేని భోజనాలూ... అబ్బ! చెప్పలేనొదినా ...! వాడి మనస్తత్వం నీకు తెలీదు! నలుగురిలో వాడికి నోటమాట పెగల్దు! కావాలంటే నువ్వే చూడు, మూడోమనిషి కనపడితే చాలు, నో మూల కెళ్ళిపోతాడు! వెర్రి నాగన్న! బయటికెళ్తే నెగ్గుకు రాలేడమ్మా!... అయినా వొదినా! జీతాలిచ్చి ఈ బళ్ళలో మెష్ట్రులమాత్రం చెప్పి చచ్చేదేముంది! నా బొంద? లక్షణంగా ప్రయివేటు చెప్పిస్తే పోలా...? మువ్వా మీ అబ్బాయిల్లలా...'

ముప్పై ఏళ్ళక్రితం మా అమ్మా, నీళ్ళకోసం మా యింటికొచ్చే తాయారమ్మా ఇలా మాట్లాడుకోని రోజంటూ లేదు! బడిమొహం చూడక, స్నేహితులంటే ఏమిటో తెలీక, సంతచెరువుగట్టూ, మా పొలాలూ, తోటలూ, పాలేళ్ళూ తప్ప మరేదీ తెలియని జీవితం ఒకటి, రెండు, మూడు, నాలుగు, ఐదు...పది...పదిహేను, పదిహేనేళ్ళు ముందుకు నడిచింది!

పదిహేనేళ్ళ తరవాతే...

జీవితంలో మొదటిసారిగా రైలెక్కాను. ముగ్గురు పాలేళ్ళు బందోబస్తీలో మొదటి సారిగా మావయ్య వాళ్ళింటికి రైలెక్కి వెళ్ళాను స్కూలుఫైనలు పరీక్షలు వ్రాయడానికి!

* * *

'అబ్బాయి ఫస్ట్‌క్లాసులో పాసయ్యాడుగా ..! ఇంట్లో కూర్చునేం చేస్తాడు ..! నాతోపాటు పట్నంలోనే ఉండి చదువుకుంటాడు! నువ్వుపెట్టే ఆ పప్పన్నం, ముద్దపెరుగూ మీ వొదినా పెడుతోంది! ఏమిటో నీ పిచ్చిగానీ, నువ్వుమాత్రం 'ఈ పల్లెటూళ్ళో కూర్చునేం చేస్తావ్? ... ఏదో అయినకాడికి అయినవాళ్ళమంతా వో చోటుం టేనే బాగుంటుంది ...! ఏమంటావు...? ఏమనడాని కేముందీ...! లే! ... లే! బయల్దేరు! ఈ పొలం పుట్రా కవులుకిచ్చి నువ్వు కూడా మాతో పాటే పట్నం వచ్చేయ్!'

మావయ్య గుక్క తిప్పుకోకుండా అన్న మాటలకి కనీసం మరో మాటైనా మాట్లాడలేదు అమ్మ!

మూటా ముల్లె సర్దుకుని, ఇల్లంతా అద్దెకిచ్చి, పొలాలు పాలేళ్ళ కప్పచెప్పి, పాడి అమ్మేసి, అమ్మకూడా తయారైంది!

ఇద్దరిమధ్యా కూర్చుని బ్రతుకులో మూడోసారి రైలెక్కాను!

'మావయ్యకి మామీద వెర్రి ఆపేక్ష'... అమ్మ అనుకోని రోజంటూ లేదు!

మరి 'ప్రపంచం—మనుషులూ' అంటే ఏమిటో తెలియకపోయినా మావయ్యకెందుకీ ఆపేక్షో తెల్సుకోలేనంత మూర్ఖుడ్ని కాదు!

'ఎప్పుడూ ఆముదం త్రాగిన సోజులో, మొహం ముడుచుకుని ఏదో మూలకూర్చునే మావయ్యకూతురు సీత...మొహంలో చిరునవ్వు కనపడిందంటే ... మొహానికి నాలుగంగుళాల దళసరిన పౌడరు పూసుకోవడం మొదలెట్టిందంటే ... హుషారుగా షికార్లు కొడ్తోందంటే ... అమ్మని పట్టుకుని 'అత్తయ్యా! అత్తయ్యా!' అంటూ వాటేసుకు తిరుగుతోందంటే ... నిజంగా మావయ్యెంతటి ఇంద్రజాలికుడో గ్రహించకుండా అమ్మనుకున్నట్టు నేనూ అనుకుంటే సరిపోతుందా...?

'వాడికని రాసిపెట్టుంటే కాదంటే మాత్రం అవుతుందా...?చదవనీ వెళ్ళమ్మా! మన కుటుంబాల్లో ఒక్కడైనా చదివాడనుకుందాం! మువ్వాలోచిస్తూ కూర్చుంటే పుణ్యకాలం దాటుతుంది! ఊ! కానీ! అయినా ఆ చదువూ ఇక్కడే ఉందికాబట్టి మరో ఐదేళ్ళలో ఇట్టే గడిచిపోతుంది!...తరువాత నువ్వే చూస్తావుగా ...! 'డాక్టరుగారూ! డాక్టరుగారూ!' అంటూ జనాలు మనింటి చుట్టూ ప్రదక్షిణాలు చెయ్యకపోతే ... 'ఈ గొప్పంతా ఎవర్దనుకున్నావు??? నీదే! వాడ్నికన్న నీదే.'

అమ్మ ఏనా డెదురు చెప్పిందని మావయ్యకి!!

* *

ఐదేళ్ళు గిర్రుమని తిరిగిపోయాయి!

ఈ ఐదేళ్ళలోనూ చెప్పుకోతగ్గ మార్పులే వచ్చాయి!

సెకండియర్లోనే గృహస్థుడ్ని, చదువయ్యేసరికి మూడేళ్ళ శాంతికి తండ్రినీ అయిపోయాను!

మావయ్యా, అత్తయ్యా సంవత్సరం తేడాతో దాటేశారు!

అమ్మ ఆటోమాటిగ్గా పట్నం ఇంటి యజమానురాలై పోయింది!

'సీతాభవనం' గ్రౌండ్ ఫ్లోర్ 'శాంతి క్లినిక్కై' పోయింది!

మరి పది పన్నెండేళ్ళలో...

నాకు హాస్పిటలూ, రోగులూ సర్వస్వమైతే ... నాలుగు మహిళా సమాజాలతో, చిల్డ్రన్స్ వెల్ఫేర్ సెంటర్స్‌తో, మీటింగులూ, సోషల్ సర్వీసుల్తో క్షణం తీరిక లేకపోయినా బాధ్యత వహిస్తూనే ఉంది సీత!

సీతకి తోడున్నట్టుంటుందనీ, తనకి ఒంటరితనం తప్పినట్టౌతుందనీ, తనూ సీతతోపాటే కార్లో సమాజం పెట్టేసింది అమ్మ.

అమ్మ మహిళా సమాజాలకి పెద్ద దిక్కు!

శాంతి పాపం ఏంచేస్తుంది...స్కూలూ, కాలేజీ ఉన్నప్పుడు వెళ్ళడం ... ! లేనప్పుడు వాళ్ళమ్మా, బామ్మతో తనూ కారెక్కడం...!

శాంతికి పదహారేళ్ళు నిండాయి!

గౌన్లూ, లంగాలూ పెట్టెలో పెట్టి తాళంవేసి, వోణీల్లోకి దిగింది!

'శాంతమ్మ బంగారుబొమ్మ' అమ్మ మాటి మాటికి అనేదాంట్లో చోద్యంలేదు!

'అమ్మాయిగారు మణిపూస!' దాసీలనే దాంట్లో అతిశయోక్తి లేదు!

'శాంతికి శాంతే సాటి' నలుగురూ అనుకునే దాంట్లో ఆశ్చర్యంలేదు!

నిజం! శాంతిని చూస్తుంటే నా కేదో గర్వం! ఆనందం! హాయి! అవును 'శాంతికి శాంతే' సాటి!

* * *

'పిల్లడు! శాంతి యం. బి. బి. యస్. చదవాల్సిందే...!'

'అదికాదు సీతా! కనీసం సెకండ్ క్లాసైనా రాలేదు! ఈ మార్కులు చూసి ఏ కాలేజీలో సీటిస్తారు చెప్పు? చక్కగా

మాయస్వార్థానికి..

బి. య్యేనో, బి. యస్సీవో చదివిద్దాం!'

'అదే కుదర్నంటున్నాను!'

'పోనీ అంతగా కావాలంటే దాన్ని పి. యూ. సీ. మరోసారి చదివిస్తే...'

'ఏం? ఎందుకు చదవాలి ? అహ! ఎందుకు చదవాలింట?'

నుప్పు పదిహేనువేలు మనవి కాదను కుంటే ఏ కాలేజీలో సీటు రాదు చెప్పండి? అయినా అది మీకుండాలి! మీరు చదివేశారు! అదీ మీ అంతైతే, మీకు నామోషీలాగుంది! అయినా మీరేమనుకున్నా సరే ... నేనో డెసిషను కొచ్చేశాను! మొన్ననే మా మహిళా సమాజం ప్రెసిడెంటు 'ఇందుమతీరావ్' 'సీతాదేవిగారూ! నిజంగా మీ అమ్మాయి యం. బీ. బి. యస్. చదవాలీ అంటే నేను మీకు తప్పకుండా 'హెల్ప్' చేస్తాను! 'నార్త్‌లో' నాకు తెలిసిన వో కాలేజీలో పదిహేనువేలు డొనేషనుగా ఇస్తే సీట్లి స్తున్నారు! ఆ...! అదంతా మీకు ఇంట్రెస్టుంటేనే సుమాండీ' అని అంది. మన మీద నిజంగా ఎంత ఇంట్రెస్టు లేకపోతే అలా అంటుంది...? వెధవది, మీకు అవకాశం విలువ తెలియటంలా! అవతల మిసెస్ రాఘవేంద్రరావు ఈ ఛాన్సు తన్నుకుపోవా అని తెగ తొందరపడి పోతుంది!'

'అదికాదు సీతా! ఎక్కడో వందలూ వేలూ మైళ్లవతల వేలకివేలు కుమ్మరించి హాస్టల్లో ఒక్కదాన్నీ వదిలేసి ... నువ్వే ఆలోచించు సీతా! మనం ఉండగలమా?... అసలది మంచిదంటావా... ?'

'ఏమిటి మీ రంటున్నది...? అసలు మతుండే మాట్లాడుతున్నారా ? అయినా వో విషయం! మీరు తండ్రికదా అనిచెప్పాను! ఇదే మరొకరైతే చెప్పాల్సిన అవసరంకూడా ఉందేదికాదు! అది యం. బీ. బి. యస్. చదవాల్సిందే! దానికి లక్ష ఖర్చైనా, ఒక్కతే ఉండాల్సొచ్చినా జరగాల్సిందే...! ఇదప్పుడే జూన్నెల! ఆగస్టుకల్లా కాలేజీలు తీస్తారు, చెయ్యాల్సిన ఏర్పాట్లు ముందునించీ చేస్తేనే మాట దక్కేది!' చెప్పవలసినవి వాలుగా చెప్పి కారెక్కి వెళ్ళిపోయింది 'సీత' అప్పరాహోటల్లో మీటింగుకి! టైము చూసుకున్నాను! తొమ్మిదిన్నర! అప్పుడే అరగంట ఆలస్యం అయిపోయింది! భారంగా క్రిందికి దిగాను; పేషంట్లు 'క్లినిక్'లో ఎదురు చూస్తుంటారని!

* * *

'గుడ్‌మార్నింగ్ డాక్టర్'

'గుడ్‌మార్నింగ్'...! మీ...రు...?'

'సుబ్బారావుగారబ్బాయిని ! హైద్రాబాద్‌లో వో ప్రయివేటు ఫర్మ్‌లో మెకానికల్ ఇంజనీరుగా ఉంటున్నాను.'

'వో! మీరా! సారీ గుర్తు పట్టలేకపోయాను! మిమ్మల్ని చాలా చిన్నప్పుడు చూశాను ! బాగా మారిపోయారు కూడా! రియల్లీ ఐయామ్ వెరీ హాపీ టు సీయూ!

విందుగా నవ్వాడతను!

'నాన్నగారి కింకా వీరసంగా ఉందిట ! మిమ్మల్నోసారి వచ్చి చూసి వెళ్ళమన్నారు!'

మాటలు వినిపించుకోవడం లేదు! అతని వంక అలా చూస్తున్నాను ఏదో ధ్యాసలో!

'డాక్టర్! వస్తాయకదూ!' అంటూ వెళ్ళిపోబోతున్న అతన్ని 'ఆ...! ఉండండి' అని పిలిచి 'మె ఐనో యువరేజ్' ఎలా అన్నానో నాకే తెలీదు!

'ట్వంటీ ఫోర్'

'గుడ్! మీ హెల్తు ఇంప్రూవ్ చేసుకోండి! యూ ఆర్ స్టిల్ ఇంది గ్రోయింగ్ స్టేజ్!'

'థాంక్యూ డాక్టర్...! వస్తాను' అతను వెళ్ళిపోయాడు. ఏదో ఆలోచిస్తూ అటు వైపే చూస్తున్నాను !

'డాక్టరుగారూ!' ఎవరిదో కంఠం!

కాసేపు ఆలోచనలు ఆపి పేషంట్సుని చూస్తూ ఉండిపోయాను! మధ్యాహ్నం పన్నెండైంది 'విజిట్సుకి' బయల్దేరే సరికి!

* * *

'... ఆడపిల్ల కన్నతండ్రిగా అడుగుతున్నా సుబ్బారావుగారూ! మా అమ్మాయికి మీ కోడలయ్యే అదృష్టం కలిగించగలరా?'

'డాక్టర్! మీరు...! మీ అమ్మాయిని మా అబ్బాయికి ఇవ్వడానికి బ్రతిమాలాలా? అది మా అదృష్టం అనుకుంటాం! తప్పకుండా! మా అబ్బాయి 'సరే' అంటే ఆ మూడు ముళ్ళూ ఈ నెలలోనే వేయించేద్దాం. సరేనా!...అన్నట్టు చెప్పడం మర్చిపోయాను డాక్టరుగారూ! అబ్బాయి రేపే హైద్రాబాద్ వెళ్ళిపోతున్నాడు. వీలుంటే అమ్మాయిని చూడ్డానికి ఈ సాయంత్రమే ఏర్పాటు చెయ్యగలరా? అఫ్‌కోర్స్ ఇదంతా

వామినల్ అనుకోండి!'

'ష్యూర్! తప్పకుండా' సుబ్బారావు గారూ! తప్పకుండా! సాయంత్రం నాలుగింటికి మీరూ, మిసెస్ సుబ్బారావుగారూ, అమ్మాయీ వస్తే ధన్యుణ్ణి!'

'నేను రానుగానీ, నా మిసెస్‌నీ అమ్మాయినీ పంపిస్తాను!'

'చాలా థాంక్సు సుబ్బారావుగారూ!' ఆనందంతో కరచాలనంచేసి సెలవు తీసుకుని బయల్దేరాను!

* * *

'శాంతి 'పెళ్ళి' ఇప్పుడు జరగడానికి వీల్లేదు!' శాంతిపెళ్ళి టాపిక్ రెయిజుచేసిన నాకు రెండుగంటల క్రితం ఫుంటకొట్టి చెప్పిన అమ్మా, సీతా -- వాళ్ళ ఉద్దేశాల్లో మార్పులేదు! ఏం చెయ్యాలో తోచని స్థితిలో గదిలో కూర్చుని శూన్యంలో చూస్తున్నాను!

'శాంతి! శాంతి!'

నేనూ సీతా చవిచూసిన ఆనందానికి ప్రతిఫలం...! గారాబంగా, ముద్దుగా, లాలనగా ప్రాణానికి ప్రాణంగా మెలిగిన శాంతికి పెళ్ళిచేసి దూరంగా పంపాలంటే నాకు మాత్రం బాధకాదా? కానీ తప్పదు!

టైము మూడున్నరైంది!

ఇంకో అరగంటలో వాళ్ళొస్తారు! నాకు అసహాయుడా, అసమర్థుడా, నోర్లేని వాడా... అంటూ ఏవేవో పేర్లు పెడతారు! ఇన్నాళ్ళా నాకేదో పరువున్నట్లు గొప్ప చేసిన మనుషులకి నా నిజస్వరూపం కనపడిపోతుంది! ఏం చేస్తాము? విధి అలాంటిది!

ఆఖరిసారిగా ప్రయత్నించాను!

'సీతా! నిన్ను బతిమాలు కుంటున్నాను! మంచికో చెడ్డకో ఈ సంబంధం బాగుందని పించింది! నువ్వంగీకరించు!'

తోక త్రొక్కిన తాచులా లేచింది సీత!

'అది మీ కూతురు కావచ్చు! కానీ అది ఫిఫ్టీపర్సెంటే.'

'సీతా!' గట్టిగా అరిచాను! ఏమిటి నువ్వు మాట్లాడేది? పిల్లలమీద తల్లి దండ్రులకి ఎంతెంత హక్కులున్నాయో తెలుసుకోవలసిందా ఈ టైము! ఛ! 'కూతురు పెళ్ళి' అంటే ఆనందం పరవళ్ళు తొక్కాల్సిన ఈ సమయంలో మనం హక్కులు పరిశీలిస్తూ కూర్చుంటామా? నువ్వే ఆలోచించు సీతా! శాంతి మనమ్మాయి! మన రక్తం పంచుకున్న మరో స్వరూపం!'

'మీరు లక్షచెప్పండి! దాని పెళ్ళిప్పుడు జరగడానికి వీల్లేదు!' కనీసం నానోట మరోమాట వచ్చేదాకా అయినా ఆగకుండా వెళ్ళిపోయింది సీత!

'హక్కులు!' బిడ్డపై తల్లికెంత హక్కో తండ్రికెంత హక్కో చివరికి కోర్టుకెళ్ళి తెల్సుకోవలసిన రోజులు కూడా వచ్చాయి! నవ్వుకున్నాను! నాలో నేనే నవ్వుకున్నాను. సీత మాటల్లో నిజం లేకపోలేదు! నాకెంత హక్కుందో తనకే అంత హక్కుంది! మరో పదినిమిషాలు ఈ 'డిస్కషను' నడిస్తే 'నామీదకూడా హక్కు' ఉందంటుంది; నే ప్రాక్టీసు చేస్తున్న బిల్డింగూ, నేనుంటున్న ఇల్లూ, నేనెక్కే కారూ, అన్నిటిమీదా సీత ఆస్తి 'సీటు'ంటుంది! డెఫినెట్‌గా అనుండేది; అసలు నామీద నాకే హక్కు లేదని!

* * *

'ఫరవాలేదు డాక్టరుగారూ! ఫరవాలేదు! పెళ్ళంటే కేవలం మన ఇష్టాయిష్టాలమీద సాగదు! అమ్మాయభిప్రాయం, అబ్బాయభిప్రాయం తెల్సుకోందే వెయ్యటం మంచిది కాదు! అమ్మాయిని చదువుకోనీండి! పాపం చిన్నపిల్ల! చదువు పూర్తిచేసుకోనీండి'— 'క్షమించండి సుబ్బారావుగారూ! అమ్మాయి అంతర్యం తెల్సుకోకుండా మీకు శ్రమ కలిగించాము! అమ్మాయి యం. బి. బి. ఎస్. చదువుతానని పట్టు పడుతోంది! పెళ్ళయితే చదువువల్ల గృహిణిగా పూర్తి న్యాయం చెయ్యడానికి అవకాశం ఉండదని చదువైన తరువాతే వివాహం చేసుకుంటానని అంటోంది?' పెళ్ళిచూపులకి బయల్దేరబోతున్న సుబ్బారావుగారింటికెళ్ళి జీవితంలో మొదటిసారిగా అంత అబద్ధం ఆడాను!

మరింకేం చెయ్యను?

'నా తల్లి కాదంది! నా పెళ్ళాం పసే మిరా కాదంది! నా కూతురితో నేనసలు మాట్లాడలేదు! నే నొక్కడ్నే ఏ డెసిషనుకీ రాలేను' అని అననా? ఏమన్నా...?'

శాంతి యం. బి. బి. యస్. సీటు గురించి ప్రయత్నాలు చెయ్యక తప్పింది కాదు!

నెలరోజులు గడిచిపోయినా ఏ దారీ తెన్నూ కనపడలేదు!

* * *

గంటసేపునించీ ఏమిటలా 'దూ! దూ!'



సంత్రగచి ఆంధ్రహైస్కూలు అవతరణోత్సవసందర్భంగా 'కథకంచికి' నాటిక ప్రదర్శించిన పాఠశాల బాలికల బృందం.

జనమన్నలా బుర్ర పోసేవారా? అర్థమైందా? అవి ఏర్పాట్లు!

'పెళ్ళి దివ్యంగా జరగాలి! 'ఫలానా వాళ్ళింట్లో పెళ్ళి ఎలా జరిగిందంటే' జనం చెప్పుకునేంత రికార్డ్ బ్రేక్ ఫంక్షనవ్వాలి! మీరు యం. బీ. బి. యస్. సీటు కోసం ప్రయత్నంచేసిన 'స్పీడు'లో ఏర్పాట్లు చెయ్యడానికి పెళ్ళి వచ్చే సంవత్సరం కాదు!...వచ్చే సోమవారమే! మరెలా చూసుకుంటారో...!' సీత మాటలు వింటుంటే మతి పోయిన మాట ఖాయం!

'అసలు సీతేనా మాట్లాడ్తోంది' అనే డౌటు కూడా వచ్చింది!

'ఏమైనా మేరేజస్ ఆర్ మేడిన్ హెవన్!'

* * *

సీతా భవనం దేదీప్యమానంగా వెలిగిపోతోంది!

పెళ్ళిపందిరి రంగు రంగు లైట్లతో ముత్యాలపందిరిలా ఉంది! గెస్టులకి కొదవ లేదు!

జడ్జీలు, ఇంజనీర్లు, డాక్టర్లు, ఆఫీసర్లు, ప్రొఫెసర్లు, క్లబ్ మెంబర్లు, హోస్టలు జనాలు, పెళ్ళికొడుకు ఫ్రెండ్సు ... చెప్పలేను. భలే నిండైన గ్యాదరింగు! సగంమందిని పైగా నేనే 'రిసీవ్' చేసుకున్నాను!

ఐదువందల కుర్చీల్లో ఖాళీ లేకుండా జనం!

కల్యాణ మండపం చుట్టూ వేసిన పరదాలన్నీ నిండిపోయాయి!

మంగళ వాయిద్యాలూ, కోకా కోలాలూ, గోల్డ్‌స్పాట్లూ, ఎలక్ట్రానిక్ ఫ్లాష్‌లూ, పురోహితుడి కేకలూ, ఆడవాళ్ల గాజుల చప్పుళ్ళూ, అరుపులూ—కేకలూ ... భలే కోలాహలం!

స్టెప్‌బై స్టెప్ పెళ్ళి తతంగం ముగిసిపోతోంది!

సీతకి క్షణం తీరికలేదు! అన్నీ స్వయంగా చూసుకుంటోంది!

ఎక్కడివాళ్ళు అక్కడ సర్దుకుంటున్నారు కూడా!

చివరిఘట్టం...అప్పగింతలు!

కాలం మారిన ఈ కాలం పెళ్ళి తతంగమంతా మార్నింగ్‌షో సినిమాలా గడిచిపోకేం చేస్తుంది!

మాయసార్థానికి...

'వాయించండోయ్! వాయించండి!'

'పోయిరా మాతల్లి ... పోయిరావమ్మా!' సన్నాయి మేళంలో ఏకమైన ఆపాట ఎవడ్నైనా కదిల్చేస్తుంది! పిల్లల్ని కని, పెంచి ఒకనాటితో ఇలా సంబంధం తెంపుకుని బైటికి పంపించే టైములో కళ్ళనీళ్ళు తిరగడం ఆశ్చర్యంకాదు! పద్దెనిమిదేళ్ళ క్రితం నాపెళ్ళిలో ఏడ్చాను! మళ్ళీ ఇప్పుడు!

ఎంత అపుకుందామన్నా ఆగలేదు! 'పోయిరా మాతల్లి...పోయిరావమ్మ!' ఆపాట హృదయాన్నలా కదల్చివేసింది!

సన్నాయి ఆగిపోయింది! పెళ్ళిసర్వం ముగిసిపోయింది!

'వెయ్యి అబద్ధాలాడియైనా వో పెళ్ళి చెయ్యమన్నారు!'

అది బూజువై పోయింది?


పదివేల కట్నంలో ఉన్న ఒకే ఒక్క కూతురు పెళ్ళి దివ్యంగా, ఘనంగా జరిగిపోయింది! భారం తీరిపోయింది!

శాంతి కళ్ళల్లో నీళ్ళు లీలగా చూశాను!

సీత మొగపెళ్ళివాళ్ళ కెళ్ళాల్సిన సామాన్లు తాలూకు లావాదేవీలు స్వయంగా చూసుకుంటూ చాలా బిజీగా ఉంది!

అమ్మ, భోజనాలూ, కాఫీలూ వగైరా ఏర్పాట్లతో క్షణం తీరిక లేకుండా ఉంది!

జనం పల్చబడిపోయారు!



ఎంతో కష్టపడి ఎన్నికల్లో గెలిచాం
ఇంక ఎంతో కష్టపడి డబ్బు
సంపాదించాలి!

నెమ్మదిగా లేచాను!

శాంతి నా వైపే చూస్తోంది!

ఆ కళ్ళ అందం వర్ణించలేనుగాని అందులో విషయాన్ని గ్రహించలేనివాడ్ని కాదు! తిరిగి చెప్పాను కళ్ళతోటే! నెమ్మదిగా లేచి వచ్చింది!

కాళ్ళకి పసుపూ, పారాణి ... మొహాన పెద్ద బొట్టూ... తన్మయుడ్నైపోయాను! కళ్ళు మరోసారి వర్షించాయి!

'నాసేపు రెస్ట్ తీసుకోమ్మా!... రిలాక్స్ ఫర్ సమ్ టైమ్!' ఎవ్వింది శాంతి! ఆ నవ్వు అర్థం...?

'నీకంటే, అమ్మకంటే, బొమ్మకంటే అలిసిపోయానా నాన్నా?' అని. ఏమనటానికి నోటమాట రాక మరోసారి నవ్వాను! శాంతి లోపలికెళ్ళిపోయింది!

అటువైపే చూస్తూ ఉండిపోయాను!

'అన్నయ్యగారూ!'

ఉలిక్కిపడి ప్రక్కకి తిరిగాను!

ఇందుమతి!

'చాలా థాంక్సు అన్నయ్యగారూ! నేర్పుగా దగ్గరుండి జరిపించారు! మీరూ సీతా చేసిన ఈ సహాయం మా జన్మలో మర్చిపోలేం' ఇందుమతి కృతజ్ఞతలు చెప్తుకుంది! ఆమె భర్త గిరిధర్‌రావు కూడా ఇంచుమించు అలాగే అన్నాడు!

'నేన్చేసిందేముందండీ! అంతా దేవుడి దయ!'

'అబ్బే అంత తేలిగ్గా అనేయకండన్నయ్యగారూ! మీ ఇంట్లో మీ అమ్మాయిపెళ్ళిలా, ఒక్కమాట కూడా రాకుండా దగ్గరుండి జరిపించటం అంటే మీదెంతటి నేర్పో నిడిగా చెప్పాలా అన్నయ్యగారూ! మేము నిజంగా మీ ఉభయులకీ ఎంతో ఋణపడున్నాం!' ఇందుమతి చెప్పుకుపోతోంది!

నవ్వుతూ వింటున్నాను!

'బాగుంది వరస! ఇక్కడా ఉన్నారు మీ ముగ్గురూ...! ఎక్కడికెళ్ళిపోయారా అని తెగ బెంగపడిపోయాను! లేవండి! త్వరగా రెమలాలి! ఊఁ! మొగపెళ్ళివాళ్ళు తొందరపడిపోతున్నారు! త్వరగా ... అవతల నాకు చాలా పన్లున్నాయి!' అంటూ సీత వత్తిడి చెయ్యటంతో అంతటితో ఆ సంభాషణ ఆపి భోజనానికి వెళ్ళక తప్పిందికాదు!

* * *

'మీ దెంతటి నేర్పో విడిగా చెప్పాలా అన్నయ్యగారూ!' ఇందాక ఇందుమతి అన్న మాటలే దృష్టిలో మెదులుతున్నాయి! నవ్వొచ్చింది నాకు!

ఏంతైనా ఆమాట అనగలిగిందంటే ఇందుమతెంతటి నేర్పరికాకుండా ఉంటుంది?

కొంపలో కుక్క కన్నా హీనంగా చూసినా బయట 'మా వారూ', 'శ్రీవారూ' అని చెప్పుకునే సీత తనే స్వయంగా మాట్లాడి కుదిర్చిన సంబంధం నేను 'కుదిర్చానని' చెప్పుకుందని తెలిసి కూడా నమ్మా, పెళ్లి ఖర్చులకి ఇచ్చిన పదిహేనువేలకీ సీతనీ విడివిడిగా, ఉమ్మడిగా "సమయానికి కాదుకున్నారు! మీ మేలు మర్చిపోలేము' అంటూ పొగడ్తలతో ముంచిందంటే ఇందుమతి మామూలు మనిషా? అబలా?

* * *

"ఈమాత్రం నేర్పుచాలదా? ఈమాత్రం బతుకు తెరువుంటే కానిదేముంది? సంబంధం కుదిరింది! డబ్బు దొరికింది! పెళ్లి జరిగిపోయింది!'

'నీలాంటి వాళ్లుండాలేగాని ఇందుమతి లాంటి వాళ్లకెంతమంది ఆడపిల్లలుంటే నేం...అంతా స్వార్థం! స్వార్థం తోటే గెలుపూ...! నేర్చుకో! ఆమెను చూసైనా నేర్చుకో" అని సీతతో నేనంటే...

'నాది! ఆ స్వార్థం నాది! 'రెండేళ్లలో మీఅమ్మాయిమిస్ఇండియా!ఇన్‌టూయియర్స్ యువర్‌డాటర్ వుడ్‌బి మిస్ ఇండియా! ముందు మనక్లబ్బు కాంపిటీషన్లలో 'మిస్ క్లబ్‌గా' సెలెక్ట్‌చేసి, మనక్లబ్బు ద్వారానే బొంబాయి పంపి అది జరిగేట్టు చూసే బాధ్యత నాది! బ్రైట్‌ఫ్యూచరున్న అమ్మాయికి నిజమే! మీరన్నట్టు పెళ్లిచేసి అన్యాయం చెయ్యడం మంచిదికాదు! రెండేళ్లలో డెఫినెట్‌గా మీ అమ్మాయి మిస్ఇండియా! దానికి తిరుగులేదు! మీకెందుకా బెంగ? నా కొదిలేయండి!' ఈనాలుగు మాటలూ పదిహేనువేలిచ్చి కొనుక్కున, సీతా మైడియర్ 'వైఫ్ కమ్ హజ్బెండ్ 'స్వార్థమంతా నాది' అంటుంది!

ఇందుమతి గారల్లుడు సుబ్బారావు గారబ్బాయి!

అభ్యాగతుడు — ధర్మపథం



ఇలపల వెంకటరమణయ్య

అతిథి, అభ్యాగతుడు ఇంటికి వస్తే వారిని గౌరవించాలనీ, అన్నపానాదులిచ్చి ఆదరించాలనీ అందరూ అంగీకరిస్తారు. తాము ఎదురు చూస్తూ వుండగా వచ్చినవ్యక్తి అతిథి అనీ, అనుకోకుండా వచ్చిన అతడు అభ్యాగతుడనీ 'అభ్యాగతః స్వయం విష్ణుః' అని అతడు విష్ణుస్వరూపుడనీ కొంత భేదం చూపిస్తారు కొందరు, 'సర్వదేవమయో౽తిథిః' అని-అతిథికూడా దేవస్వరూపుడే అనికూడా వుంది.

పేర్లలో భేదం వుందేగాని వీరి లక్షణంలో భేదం కావరాదు. గౌరవించడంలో ఎక్కువ తక్కువలు పాటించకూడదు.

అభ్యాగతుడు బాలుడైనా, వృద్ధుడైనా, యువకుడైనా సరే! వయస్సును బట్టి ఎక్కువ తక్కువలను ఎంచకూడదు. ఇంటికివచ్చిన అభ్యాగతుడు గృహయజమానుడికి గురువు వంటివాడు! గురువును గౌరవించినట్లే అతన్ని గౌరవించవలసిందే! ఈ సంగతినే—

'బాలో వా యది వా వృద్ధో

యువా వా గృహమాగతః

తస్యపూజా విధాతవ్యా

సర్వస్యాభ్యాగతో గురుః'

అనే శ్లోకం తెలియజేస్తూ ఉన్నది.

ఈ విధంగానే వయస్సుతో నిమిత్తం లేనట్లే జాతితోకూడా నిమిత్తం లేదు. తక్కువ కులానికి చెందినవాడయినా, ఉత్తమ కులజాని యింటికి వచ్చినట్లయితే—ఆ ఉత్తమ కులజుడు ఆ అతిథిని తగిన విధంగా గౌరవించవలసి ఉన్నది. ఆ అతిథి సమస్త దేవతా స్వరూపుడని భావించవలసి ఉన్నది.

'ఉత్తమ స్యాపి వర్ణస్య

నీచో౽పి గృహ మాగతః

పూజనీయో యథా యోగ్యం

సర్వదేవ మయో౽తిథిః'

అనే శ్లోకాన్నిబట్టి ఈ విషయం తెలుస్తుంది.

అభ్యాగతుడు ఇంచుమించుగా భోజనం చేసే సమయానికే ఏ గృహానికయినా వస్తాడు. ఆ సమయంలో అతనికి ఆహారం పెట్టకుండా పంపివేస్తే, అభ్యాగతుడు హతాశుడై వెళ్లిపోవలసి వస్తుంది. దాని వల్ల గృహ యజమానికి పాపం చుట్టుకుంటుంది. అంతేకాదు, ఆ ఆగంతుకవ్యక్తి పాపాన్ని గృహ యజమానికి అంటగట్టి అతని పుణ్యాన్ని తీసుకొని పోతాడు.

ఈ విషయాన్ని తెలిపే పెద్దల వాక్యాన్ని గమనించండి—


'అతిథిర్యస్య భగ్నాశో

గృహాత్ప్రతి నివర్తతే,

స తస్మై దుష్కృతం దత్వా

పుణ్య మాదాయ గచ్ఛతి'

అందువల్ల మనం అభ్యాగతుణ్ణి గౌరవించవలసి ఉన్నది.



జరిగిన కథ

రఘు, రామం, వేణు వరుసగా అన్న దమ్ములు. వాళ్ల ముద్దుల మరదలు సుధ. సుధ ఒంటిపిల్ల. సుధ తల్లి జానకమ్మ. బర్మానుంచి బాధితురాలిగా వచ్చిన జానకమ్మకి ఆశ్రయ మిచ్చారు శర్మగారు. ఆయన భార్య పార్వతమ్మకి సుధ అంటే ఎనలేని అభిమానం. రఘు సుధ మీద ఎక్కువ అభిమానం చూపిస్తూ వుండడం రాధ కనిపెడుతూనే వుంది. రఘుని ఆకర్షించడానికి రాధ ఫాషన్ పర్వరీకి విశాఖ చేరుతుంది. మంచి డాక్టరనిపించు కోవాలని, లక్ష్యాన్ని సాధించాలని రఘు కోరిక. దగ్గరజేరిన రాధ ఆకర్షణనుంచి తప్పుకుంటూ మనసు లక్ష్యంవైపు కేంద్రీకరిస్తుంటాడు రఘు. సుధ వివాహం కోసం చేసే ప్రయత్నాలు రఘు సలహా మీద జానకి ఆపు చేస్తుంది. రఘు మనస్సు పరిపరివిధాల పోతున్నది. సుధకి అన్యాయం చేస్తున్నా నేమో అని అతను బాధపడుతున్నాడు. సుధ కాలికి ఆపరేట్ చేశారు. సుధ ఇప్పుడు అందరిలాగా నడవ గల్గుతున్నది. రాధ ప్రవర్తన రఘుని చాలా ఇబ్బంది పెడుతున్నది. రాధ మోసపోతుందేమోనన్నదే అతని బాధ.

15

ఒకసారి ఒక రెండ్రోజులు వంట్లో బాగుండలేదన్న నెపంతో పని కెళ్లకుండా బంగ్లాలోనే వుండిపోయింది రాధ. ఆమధ్యలో ఒకరోజు హాస్పటల్లో అమెరికాకు తిరిగి వెళ్లిపోతున్న ఒక పెద్ద డాక్టరుకి వీడ్కో లిచ్చే నిమిత్తంలో వో పెద్ద టీపార్టీ కూడా అయింది. అందుక్కూడా రాధ రాలేదు. ఆ సందడి జరిగినరోజున అంత మరీ ప్రమాద మైన కేసులు తన చార్జీలో లేనందున రఘు కూడా కొంచెం త్వరగానే ఇంటి కొచ్చేశాడు.

సుధ కాలు విషయం తన పెళ్లి విషయం ఆ సమస్యలు తీరిపోవడమేగాకుండా సుధకి బాగా ఆరోగ్యం చేకూరి మెడికల్ కాలేజీలోకూడా చేరిపోయినందున రఘు చిరాకు లన్నీ చాలావరకు తీరిపోయి మనసు తేలిక పడి మళ్లీ ఆటపాటల్లో ఎప్పట్లా పాల్గొం టూండడంతోపాటు అప్పుడప్పుడూ ఏవన్నా పిక్చర్లకి కూడా వెళ్తున్నాడు. ఆరోజు ఆ ఉద్దేశంతోనే ఇంటికొచ్చాడు రఘు.

'పార్టీ బాగా జరిగిందా?' ఎక్కువగా అలంక రించుకుని హాల్లో కూర్చోనున్న రాధ అడి గింది రఘుని.

'ఆ. మీరు రాలేదేం?' అన్నాడు శాన్నాళ్లకి మళ్లీ రాధ తనంతట తనే సహజంగా మాట్లాడినందుకు ఆశ్చర్యపోతూ.

'అయినా అనుకోకుండా ఇలా అర్ధాంతరంగా ప్రయాణం కట్టేశాడేం ఈ 'గేసన్.'

'అతను కొన్ని సంవత్సరాలబట్టీ పరిశో ధనలు జరుపుతూంటే వో వ్యక్తికి ఇవ్వదగ్గ ర్భుగా ప్రజ్ఞ వచ్చిందిట. అయితే అది స్థిరంగా వుండడంలేదుట. దీన్ని గురించి ఆ పరిశోధన లింకా ఎన్నెన్నో జరపాల్సివుండ డున ఇంత త్వరగా ప్రయాణం కావల సొచ్చింది.'

'ఒక వ్యక్తిపైన కొన్ని ఏళ్ళపాటు 'ఎక్స్ పెరిమెంట్లా' ఆశ్చర్యంగా వుందే?'

'అందుకే ఆయనా అంత ఉత్సాహం చూపించడం. అసలా మనిషిని మనిషిగా తయారించింది కూడా ఈయనే అనొచ్చు. ఎందుకంటే ప్రాణం తప్ప మిగతా శరీర మంతా చెడి ఎముకలన్నీ పాడైపోయిన మనిషిట అతను.'

'ఆశ్చర్యంగా వుందే?'

'చాలాను. అందులోనూ అంతలాటి కేసు చేజిక్కిందీ'అంటే నిజంగా అది ఈ 'గేసన్' అదృష్టమని చెప్పాలి' పరిశోధన్లు జరప డంలో అపార ఉత్సాహంగల రఘుకీ ఆ మనిషి విషయుంలో అంత ఆదుర్దాగా వుంది పాపం.

'డాక్టరు ఈ కేసు నెగ్గించాడంటే ఇకాయన్ని పూర్తిగా ప్రాణం పోయగల్గే టంతటివాడనా అవుతాడనే అనుకోవచ్చు నేమో.'

'తప్పకుండానూ ఏదో వచ్చిన ఛాన్సేలాగా వచ్చింది. తనతోటే వచ్చేస్తే తనకీ హెల్పుగా వుంటుందనీనూ, ఎక్స్పీరియన్సు వస్తుందనీను రమ్మని అంటున్నారాయన.' ఎప్పుడూ అంత ధోరణిగా మాట్లాడి ఎరగని రఘు ఆకేసులో ఉండే ఆసక్తికొద్దీ అలా చెప్పుకుపోయి ఆఖర్న గుర్తుకొచ్చి నాలిక్కొరుక్కున్నాడు. 'అయితే మీరు ఇప్పుడే వెళ్లిపోతారా?' కొంచెం ఆందోళన పడు తున్నట్టుగా అంది రాధ.

'ఆయనతో కలిసి వెళ్లడంలో ఏ శ్రమా, ఏ ముందు ప్రయత్నమూ ఎక్కువ అవ సరం లేకుండానే వెళ్లిపోవచ్చునుగాని, నాకు నా స్వంత విషయాన్ని గురించి కనీసం వో నెలన్నా గడువు కావాలి. అయినా సుధ కోరసం వెల్లూరు వెళ్లినట్టే మరో రెండు మూడు ముఖ్యమైన కేసుల్ని సరిగా చూడ వలసున్నందున—'

'సుధ ఆపరేషన్కి ఈయన వచ్చారు కదూ అన్నట్టు.'

'అప్పటి మా పనికలుపుతవాన్న బట్టే అమెరికాలో ఆయన చేతికి పనికొచ్చే డాక్టర్లెంతమందో వున్నా,ప్రత్యేకంగా నన్నే ఆయన కోరడం కూడా.'

'ఇంతకీ మీ ప్రయాణంమాట?'

'రాత్రి ఆయన మళ్లీ ఆ మనిషి స్థితుల్ని గురించి తిన్నగా మాట్లాడి తెల్సు కుంటారుట. దాన్నిబట్టే ఆయన ముందుగా వెళ్లడమో లేక ఇద్దరం కలిసే వెళ్లడమో, తెలుస్తుంది.' అంటూ తన రూములో కెళ్లిపోయాడు రఘు.

'అయితే రఘు వెళ్లిపోతాడా' నాలుగేళ్ల పాటు ఈ వైద్య విషయంగా ఒకేచోట వుంటూన్న దోషంగా రఘు ఎడబాటు

రాధకి ఏదో అర్థంకాని బాధను తోపించింది, ఆ నాట్నుంచీ ఈనాటి వరకూ వీరిద్దరికీ మధ్య జరిగిన మంచి చెడ్డలన్నింటినీ వరసగా నెమరుకి తెచ్చుకోసాగిన రాధకి. 'రఘు ఎలాగైనా సాటిలేని రత్నమే! ప్రతి మంచి అలవాట్లకీ అతనికతనే సాటి' అనుకుంది రాధ తన మనసులో.

నీటుగా డ్రస్సై వచ్చి టీ తాగడాని క్కూర్చున్న రఘు 'పిక్చర్‌కి వస్తారా?' అని సభ్యతకోసరం రాధ నడిగాడు ... రానన్నట్టుగా తల అడ్డంగా తిప్పింది ఏదో ఆలోచిస్తూన్న రాధ. అన్నదే తడవుగా గబగబా నడుస్తూ వెళ్ళిపోయాడు రఘు! సినిమాలో విశ్రాంతివేళ లైట్ల వెలుగులో ఇటూ అటూ చూసిన రఘు తనకి రెండు వరసలకి ముందు ఒక ఏంగ్లోఇన్డియన్ యువతితో అతికేవలంగా ప్రవర్తిస్తూ కూర్చునున్న చంద్రమౌళిని చూసి ఆశ్చర్య పోయాడు.

తనకి తెలిగ్గా రెండు చపాతీలు మాత్రం చాల్నని గోవిందుతో చెప్పినప్పుడు రాధ తనక్కూడా సినీమాకు వెళ్తున్నానని చెప్పిందని ఆవిడకీ రొట్టెలే చేసుంచమం దనీ అన్నాడే? అతనూ' అనుకున్నాడు రఘు.

ఆట పూర్తయి రఘు ఇంటికొచ్చేసరికి మామూలు బట్టల్తో ముభావంగా కూర్చుని ఏదో చదువుకుంటూంది రాధ. నిమిషంలో తేలిగ్గా ఆహారం తీసేసుకుని తను తెచ్చిన అరటిపళ్లల్లో రెండు 'తీసుకోండి' అంటూ రాధ ముందర బల్లమీద పెట్టి మిగతా రెండూ తన బల్లమీద పెట్టుకొని తనూ ఏదో పత్రిక తిరగేస్తూ కూర్చున్నాడు రఘు.

రాధ రఘుని సినిమా విషయంగా ఏమీ అడగనూలేదు, చంద్రమౌళి సంగతి తనూ రాధతో చెప్పనూ లేదు. రాధమాత్రం పుస్తకం చేత్తో పట్టుకుందేగాని మనసు దేన్ని గురించో మథన పడుతూందని ఆ మొహం తీరు తెలుపుతూనే వుంది.

'ఇంక అయన రాసట్లేనా అమ్మా' తలుపుచాటున నిలబడి వినయంగా అడిగాడు గోవింద్!'

'ఊఁ' తలెత్తి అతనివైపు చూడకుండాన అంది రాధ. కొంచెంసేపవగానే 'గుడ్‌నైట్' అంటూ వెళ్లి పడుకున్నాడు రఘు. మరి కాస్సేపటికల్లా హాల్లో లైటు



[illegible] రాధకూడా వెళ్ళి పడుక్కుంటుందని అనుకున్నాడు రఘు.

ఒక గంటసేపు నిద్ర పోయుంటాడేమో రఘు, ఇంతలో 'గిర్ గిర్' అంటూ ఫోను రింగవటంలో ఉలిక్కిపడి లేచి గబగబా హాల్లోకొచ్చాడు రఘు. లైట్ తీసేసి ఏదో ఆలోచిస్తూ అక్కడే కూర్చునున్న రాధ తనూ లేచొచ్చిందేమో, ఆ చీకట్లో ఒకర్నొకరు బలంగా మోదుకున్నారు. అవేగానికి పడిపోబోయిన రాధని రెండుచేతులా పొదివిపట్టి ఆపాడు రఘు. రాధ ఒళ్ళు పులకరించి మైమరుపుగా అక్కడి కుర్చీలో చతికిలబడితే లైటువేసి దబ్బున ఫోన్ రిసీవర్ని అందుకున్న రఘు 'ఎవరూ రాధా దేవిగారా? ఆఁ! ఇదుగో?' అంటూ 'మీకోసరమండీ' అన్నాడు. రిసీవర్ని ఒత్తిగించిపెట్టి ఇవతలకొచ్చేస్తూ రఘు.

'హల్లో' అంటూ ప్రారంభించిన రాధ మరో నాలుగైదుమాటల్ని మాట్లాడగానే మళ్ళీ రిసీవర్ని ఒత్తిగించి వుంచి,

'అయ్యో పాపం. పాపం వి.టి.పద్మ రోడ్డుమీద పడిపోయున్నాట్ట' అంది వణికిపోతూ రఘు రూములోకొచ్చి రాధ.

'అంటే దారి ప్రమాదంవల్లా లేక తాగుడువల్లా' అన్నాడు ఆదుర్దాతో రఘు.

'ఏమో నేనడిగే అడగలేదు. అటు పోలీస్ ఇన్‌స్పెక్టర్ వెయిట్ చేస్తున్నాడు. ఆ వివరాలేవో కాస్త మీరే కనుక్కుందురూ ప్లీజ్' అంది తడబడిపోతూ రాధ.

దబ్బునవెళ్ళి, ఆ అధికారి అడిగిన ప్రశ్నలకి తగిన సమాధానాలిచ్చి నెమ్మదిగా ఆ బెడద వదిల్చేసుకుని రఘు మళ్ళీ తన గదిలో కొచ్చేసరికి, వణికిపోతూ, ఆ సమయంలో ఏం చేస్తున్నదీ తనకే తెలియని రాధ అతని మంచంమీద బోర్లా పడుకొని గట్టిగా కళ్ళు మూసుకునుంది. ఏమనడానికీ, ఏం చెయ్యడానికీ, ఎటూ పాలుపోని రఘు, గుమ్మంముందు అలాగే కాస్సేపు నిలబడ్డాక, 'మీరిందులో భయపడాల్సిన దింకేమీ లేదు. ఇంక మీ ప్రసక్తే రానవసరం లేకుండా చెప్పేశా' అన్నాడు రఘు.

'ఆ? నిజంగానే? అయినా అతను రోడ్డుమీద పడిపోతే, ఆ ఇన్‌స్పెక్టర్ నన్ను పిలవడ మేమిటీ, నాన్‌సెన్స్' అంది దిగ్గున లేచి కూర్చుంటూ రాధ.

'అతని జేబులో—మీ ఎడ్రసూ, ఆ కాయితంలో మీపేరున రిజర్వు చెయ్యబడ్డ సినిమా టికెట్లూ దొరికాయట—'

'అవును సాయంత్రం తనొచ్చి నన్ను తీసుకెళ్తానన్నవాడు మళ్ళీ, తను రావడానికి వీల్లేదని చెప్పమని నా ఎడ్రసు రాసిచ్చి, ఒక మనిషిచేత ఆ టికెట్లు పంపాడు. నాకది నచ్చక ఆ ఎడ్రసు కాయితంలోనే ఆ టికెట్లూ చుట్టబెట్టి మళ్ళీ అతనికే ఇచ్చెయ్యమని పంపించేశా' అంది కాస్త ధైర్యం తెచ్చుకుంటూ.

'ఓ. అదా సంగతి. ఏమో, నాకీ వివరాలేవీ తెలియవుగాని ఈ గొడవ తప్పించుకుందుకు అలాగే చెప్పా ఊహించుకుని.'

'ఏమని చెప్పారు?'

'ఆవిడకోసరం కొన్నాడేమో నాకు తెలియదుగాని ఆవిడ ఇంట్లోనే వున్నారూ. బహుశా, ఆ ఆంగ్లో ఇండియన్ యువతితో—

'ఏమిటీ?, ఏంగ్లో ఇండియన్ లేడీయా? అదెవరూ' అనుకోకుండానే గొంతు హెచ్చించేసింది రాధ కోపంలో.

'అదెవరో నాకు తెలియదుగాని ఇవాళ సినిమాథియేటర్లో వాళ్ళిద్దర్నీ జతగా చూశాను. అందువల్ల ఆ విషయం అలాగ చెప్పి వేశాను ఎందుకన్నా మంచిదని' అన్నాడు ముభావంగా రఘు.

'అయితే ఇవాళ అటువెళ్ళడం వల్ల పెద్ద ముప్పునుంచి కాపాడారనిపిస్తోంది. చాలా చాలా థేంక్స్ మిస్టర్ రఘూ మీ మేలు ఎన్నటికీ మర్చిపోను.' అంది నిశ్చింతగా ఊపిరి వదుల్తూ రాధ. రఘు ఏదో బదులివ్వబోతూవుండగా మళ్ళీ ఫోన్ రింగవడంతో రఘు వెళ్ళి మాట్లాడాడు.

'మళ్ళీ ఎక్కణ్ణుంచేనా?' ఎదురుగా అడిగింది రఘు రాగానే రాధ.

'మీరే నేనూహించిందే రైటు. ఆ కూడా వచ్చినావిడతో కలిసి ఒక హోటల్లో కెళ్ళి తప్పతాగి తందనాలాడాడట. ఆ కైపులో అదనుండగా అతని పెన్నూ, పర్సూ వగైరాల్ని చేజిక్కించుకుని చక్కగా ఉడాయించి వెళ్ళే, స్కూటర్‌తో సహా ఇలాగు పడి [illegible] వచ్చాడుట. వృథాగా మనల్ని సందేహించినందుకూ, శ్రమపెట్టినందుకూ క్షమాపణ చెప్పడం కోసరం పిల్చాడు' అన్నాడు క్లుప్తంగా రఘు.

'ఇంకా ఏవో విషయాలడిగినట్టున్నాడు?' అంది అంతసేపూ మాట్లాడింది ఇందుకేనా? అనుకుంటూ రాధ.

'అదా, మీరింత యోగ్యతగల డాక్టర్లై వుండీ అటువంటి తాగుబోతుతో మీకు స్నేహం ఎలా కల్గిందీ, అన్న ధోరణితో మాట్లాడాడాయన—'ఆపైన ఎలా చెప్పాలో తెలియక ఊర్కున్న రఘు, అందుకు మీరు నాగురించి అన్నీ చెప్పేశారా, అన్నట్టుగా అభిమానంతో రాధ చూడ్డం గ్రహించగానే 'అతనీ చెల్లెలు మా హాస్పటల్లో ట్రీట్‌మెన్ట్ అవుతూన్నప్పుడు ఆ నిమిత్తంగా ఇతన్ని తెల్సునేగాని మాకేమంత పరిచయం లేదే, అన్నా' అన్నాడు.

'తరవాత' హెచ్చరించింది రాధ జంకుతూనే వేమూర్ల్ని.

'మీరు అనేకసార్లు అతనితో అతని స్కూటర్లో తిరిగారటగా.' అడిగేశాడు రఘు.

'ఏదో పరిచయంగా వుంటున్నాడు గదాయని—'

'పోనివ్వండి. ఆ విషయాన్నీ అతని తోడి పరిచయాన్నీ కూడా ఇక ఇంతటితో వదిలెయ్యడం మంచిదని నా అభిప్రాయం' అన్నాడు చాలా వేళయిపోయిందన్నట్టుగా చేతి గడియారాన్ని చూసుకుంటూ రఘు.

'అరెరే ఐయామ్‌సారీ' అంటూ దిగ్గున లేచి గది బయటు కొచ్చేసింది, అప్పటి వరకూ తను ఎక్కడున్నదీ కూడా ఆలోచించని రాధ సిగ్గుతో నొచ్చుకుంటూ.

'నోనో' అంటూ 'గుడ్‌నైట్' చెప్పేసి వెళ్ళి పడుక్కున్నాడు రఘు. తనూ వెళ్ళి పడుకున్న రాధ— ఇందాక రఘు తనని మోదుకున్నదీ, పొదివిపట్టినదీ, తల్చుకుని పులకాంకితం అవుతూ మధుర తలంపులో తేలుతూంటే—అనుకోక పొరపాటుగా జరిగిన సంఘటనైనా అనుకూలించేబట్టి తప్పనిసరిగా జరుగుతున్న చర్యల్లో ఇదీ ఒక చర్యగానూ భావించుకున్న రఘు అంతలో ఆ విషయాన్ని మర్చిపోయినందుకు హాయిగా నిద్రపోయాడు. ఆ మర్నాడే తన ప్రయాణాన్ని గురించి తెలుపుతూ దాంతోపాటు ఆ కొద్ది వ్యవధిలోనూ తను చెయ్యాలనుకున్న కార్యక్రమాన్ని గురించి విపులంగా తెలియజేసి, ఈ విషయంలో వారి అభిప్రాయాన్ని సలహాని కూడా అడుగుతూ శర్మగారికే హొపెద్ద


ప్రతివారికి
రక్షణ
కావాలి
CINTHOL
DEODORANT
LUXURY
TOILET POWDER
WITH G-11
BY
Godrej
ఈ రక్షణ బాక్టీరియానుండి, చెమట
వాసననుండి—మీరు, ఇతరులు
వంకోపపడే అవస్థనుండి—
జి-11 (హెక్సాక్లోరోఫిన్)తో
కూడిన
సింథాల్ టాయిలెట్ పౌడరు
మీకీ రక్షణలన్నీ ఇస్తుంది.
ఇవేకాదు—సువాసన...
సుమసుగంధము.
సింథాల్—
దుర్గంధమునుండి
సంపూర్ణ రక్షణనిచ్చు
టాయిలెట్ పౌడరు
Interpub/GP/3 Tel

అతని లక్ష్యం

ఉత్తరం రాశాడు రఘు:

రఘుతోపాటు తనూ తిరిగి విశాఖ వెళ్ళిపోవాలనే రాధకూడా ప్రయత్నించింది గాని బదులు డాక్టరు ఇంకా రానందున మరో నెల్లాళ్ళపాటు తప్పనిసరిగా అక్కడ ఆగవలసొచ్చింది రాధ. 'సరి నే వెళ్ళగానే మురళిని కల్సుకుని మాట్లాడుతాను' అన్నాడు బయల్దేరే ముందు పేంటు జేబుల్లో చేతుల్పుంచుకుని కారు వేపు నడుస్తూ రఘు.

'ఊ... బహుశా. స్టేట్సు కెళ్ళేలోగా మిమ్మల్ని కల్సుకుందుకు వీలవదేమోనాకు... ఎందువల్లనో రాధకంఠం గద్గదికమై కళ్ళల్లో నీళ్ళు తిరిగాయి.

'మీరలాగంటే ఎలాగ, ఈ నెలాఖరు లోనే బహుశా నామేరేజ్ జరగొచ్చు. దానికి మీరు తప్పకుండా రావాలి మరి...'అన్నాడు మళ్ళీ నాలుగడుగులు వెనక్కొస్తూ రఘు.

'హో. చెప్పరేం మరి—' నాన్చింది రాధ.

'మా మామకూతురు సుధనే చేసు కుంటున్నా, నమస్తే. వస్తా' వాచీ చూసు కుంటూ దబదబా వెళ్ళి రఘు కారెక్కితే వెంటనే కారు స్టార్టు చేసేశాడు తోడి డాక్టరు జోషీ ఎక్కడ టైము మించి పోతుందో నన్న భయంతో. వెనక సీట్లో కూర్చునున్న రాధ మనసులో ఏవేవో ఆలోచన్లు— తనకి ద్రోహం ఏం చేశాడని ఈమధ్య రఘుమీద తనంత కక్ష సాధిం చింది? అసలు తనలా చెయ్యడానికి అతని మీద తనకేం అధికారం వుందని? ఇంతకీ, చెరువుమీద కోపం వచ్చి, అత్తమీద కోపం వచ్చి అన్న సామెతల్లో చెప్పినట్టు అందు వల్ల తను బావుకున్నది మాత్రం ఏవిటి? రఘు ఎంతో యోగ్యుడూ, నిండుకుండాను. అందుకే తన నీచపుచేతల్ని లక్ష్యం చెయ్య కుండా నిండుమనసుతో తనని ఆదు కున్నాడు. హుఁ సుధ అమిత భాగ్యశాలి' ఇలా పరుగులెత్తుతున్నాయి రాధ ఆలోచన్లు.

రయిలు కదల బోతుందనగా, వంద లాదీ నిలబడున్న ఆ స్నేహిత బృందం అందరికీ నమస్కారం చేసేసి మొయ్యలేనన్ని పూలమాలల్ని చేతిమీద వదేసుకుని మోస్తూ, రయిలెక్కిన రఘు అందరికీ సరసగా కరస్పర్శ చేస్తూ, వారందరిమధ్యా కందిన మొహంలో నిలబడున్న రాధకి ప్రత్యేకంగా నమస్తే చెప్పి—

'మీరు తప్పకుండా వస్తారుకదూ' అని మరోసారి హెచ్చరించి, ఇంతలో రైలు బాగా వేగాన్నందుకున్నందున ఆ వాకిట్లో ఇక చేసేదిలేక లోపలి కొచ్చి కూర్చున్నాడు.

రఘుకి రాధని తల్చుకుంటే ఏదో అర్థంకాని బాధగానే వుంటూంది. ఒకవేళ తనుగాని రాధకేదన్నా అపకారం చెయ్యలేదు గదా?...అని కూడా తనని తనే ప్రశ్నించు కున్నాడు రఘు. అయితే తనకి తెలిసినంత వరకూ అలాంటి పొరపాటు తనెప్పుడూ చెయ్యలేదు. ఇక తనమీద రాధ ఒకవేళ మనసు పడిందేమో అంటే, అందుకు తనెంత మాత్రం బాధ్యుడు కాదు. తనై రాధ అలా అభిప్రాయపడేందు కవకాశం ఇచ్చేలా ఎప్పుడూ మసులుకోలేదు. సరికదా, రాధ అటువంటి అభిప్రాయాన్ని సూచించి నప్పుడల్లా ఆ భావాన్ని ఖండిస్తూండే విధంగానే తను ప్రవర్తించేవాడు. పోనీ మొదట్లోనే స్పష్టంగా తన నిశ్చయాన్ని చెప్పేద్దామని కూడా తనెన్నిమార్లో ఆలోచించాడు. అయితే, రాధ తనయందటు వంటి భావంతో వుందనేందుకు రుజువుగా ప్రత్యక్ష నిదర్శనాలేం వున్నాయని? అసలే అదోక మొన్నారు స్వభావం గల రాధ అదోక అవమానపరిచే విషయంగా తీసుకుని తనని నిందించిందంటే?

పోనీ రాధని 'నువ్వా' అంటూ చూపినట్టు కాకుండా ఈ పెళ్ళి ప్రయత్నం మాత్రం చెప్పేసి హెచ్చరిద్దావా?' అను కుంటేనూ, సుధలో వున్న లోపాలకారణం గానూ, తన మనసు ఒక విశ్చయానికి లొంగకుండా చంచలపడ్డ కారణంగానూ, అన్నమాట తప్పాల్సిన పరిస్థితి ఏర్పడు తుందేమోనన్న బెదురుతో తను అలాగ చెప్పడానికి లేకపోయింది. ఇంతకీ పరి స్థితుల్ననుసరించి తప్పనిసరిగా నడుచుకు పోవల్సున్న ఈ విధానాలకి ఎవరు మాత్రం ఏం చెయ్యగలరని.

పాపం రాధనిగురించి, ఏదో అపార్థం చేసుకున్నానేగాని ఏదో కొంచెం గర్వ స్వభావం తప్పితే ఈ విషయంలో ఆవిడ్ని అపార్థం చేసుకుందుకు లేదు. ఎందుకంటే తనకన్ని విధాలా నచ్చిన ఓ యువకుణ్ణి, తను పెళ్ళి చేసుకోవాలని అనుకోవడమూ తప్పు పనికాదు. వివరం తెలిసిన ఒక యువతి, అందుకోసరం ప్రయత్నించడం అన్నది అంతకన్నా తప్పుకాదు. ఇక ఈ మధ్య రాధ ప్రవర్తనని గురించా! ఒకపని తనకెంతో సులువు అనుకునీ, అది సాధించలేక పోయినప్పుడు ఇటువంటి ద్వేషం ప్రారంభమవడం సాధారణ మనస్తత్వాలు గలవారందరిలోనూ కల్గేమార్పే ఇది. అందులో ఆశ్చర్యమేమిటంటే, ఇటు వంటి వారికి ఎంత త్వరగా ఆ ద్వేషం పెరుగు కొస్తుందో, అంతే త్వరగానూ, ఏదో ఒక చిన్న కారణంగా పశ్చాత్తాపము కలిగి పోతుంది. రాధా ఇప్పుడాఆఖరుస్థితికే వచ్చినట్టుంది పాపం. అందుకే తను చెప్పాల్సున్న రెండుమాటలూ ఇంటిపెద్ద చెప్పేసి మరీ బయల్దేరాడు తను—ఇలాంటి ఆలోచన్లతో చాలా సేపు అలాగే కూర్చునుండి అర్ధరాత్రికిపైన నిద్రపోయాడు రఘు.

రఘు ఉత్తరం చూడగానే ఆనందిస్తూ, ఈ విషయాన్ని ఇంట్లో వారందరికీ చెప్పారు శర్మగారు.

'అంతా ఆ పరాశక్తి అలివాంబికదయ, అయినా నా రఘు నిజంగా ఆ రఘురామ చంద్రుని అవతారమే?' అన్నారు. ఆనందంతో పరవశులౌతూ పార్వతమ్మగారు.

'అన్ని విధాలా దురదృష్టవంతురాల్నే,' అని బాధపడేదాన్నిగాని ఆ దయామయి నాయందు దయ చూపిందో ఏనా, ఆ దయ, ఇలా రఘురూపంతో...నాకెంతటి భాగ్యాన్ని చేకూరుస్తు! మరి రఘు వంటి అల్లుడు దొరకడం అంటే సామాన్యమా ఏవినా' అంది ఆనంద భాష్పాలొలుకుస్తూ, జానకి.

'మీరు నమ్మినా సరే మానేసినా సరేకానీ, రఘు చివరికిలా చేసే తీరుతాడన్నది నాకెప్పుడో తెల్సునర్రా. అయినా, ఆదర్శ నీయుడూ, లక్షల్లో ఒకడిగా ఎంచవలసిన వాడూనూ మన రఘు. భేష్. 'లక్ష్యం నిలబెట్టుకోవడం' అంటే అలా వుండాలి' అన్నాడు సంతోషం పట్టలేక పచార్లు చేస్తూ రామం.

ఇక సుధ సంగతి చెప్పనే అవసరం లేదు. బావ నోటివెంట ఆ మాట విన్నప్పట్నుంచి, లోలోపల మాత్రమే ఆనందిస్తూన్న సుధ, ఇప్పుడందరితో పాటూ ప్రత్యక్షంగానే అందురో సాలు పంచుకుంది.

అందర్నీ తలోమారూ మార్చి, మార్చి

చూస్తూ నిల్చున్న వేణు అందరి భావాల్లోనూ తనూ ఏకీభవించి, ఆనందించసాగాడు. అందుకుతోడు ఎప్పుడూ సుధని ఎందుకో ఒకదానికి అల్లరి పెడుతూండే వేణు ఇక ఇప్పుడు చెప్పాలా! 'ఏమండోయి? వదినెగారూ, ఏవండోయి?' అంటూ తనొక 'ఎం. ఏ' స్టూడెన్ట్ నన్నమాట కూడా మరిచి సుధని అల్లరిపెట్టసాగాడు. అందుకు తోడు శాంతకూడా. అతనికి మాటసాయం పడుతూండేది. ఇలా ఇంట్లో వారందరికీ రఘు నిశ్చయం అమితానందాన్ని కల్గించడం వల్ల, అతను రాసిన పద్ధతిలో ఉచిత వేగంగా పెళ్లి పనులు జరగ నారంభించాయి. ఆ మధ్యలో సుధకి మొదటి సంవత్సరం పరీక్షలు జరిగిపోయాయి. అంటే మధ్యలో ఒకసారి వచ్చి రెండురోజులు మాత్రమే వుండి వెళ్లిన రఘు మళ్లీ ఆరునెలల తరవాత ఇప్పుడొస్తున్నాడన్నమాట.

ఎప్పుడూ అందరికీ ఎంతో ఆనందాన్నిచ్చే రఘురాక ఈ సారి బ్రహ్మానందాన్నిచ్చింది. అయితే ఎప్పుడూ వచ్చీ రాక ముందే, 'బావా!' అంటూ అందరికన్నా ముందుగా తనే వచ్చే సుధమాత్రం ఈసారి ఎక్కడా కంట పడకుండా తప్పించుకు తిరుగుతూండడం రఘుకి ఆశ్చర్యాన్నీ, ఆనందాన్నీ కూడా కల్గించింది. కిందటిసారి తను వచ్చి నప్పుడు ఇంకా అందర్లాగా వదవలేక కొంచెం నెట్టుతూండే సుధ ఈసారి లేడి పిల్లలాగ చెంగుచెంగున పరుగులెత్తడం చూసి అతని మనసు ఉరకలు వేస్తూంది. సంతోషంవల్ల గావచ్చు మొహంలో మంచి కళవచ్చి, ఆరోగ్యంతో శరీరానికి మంచి ఛాయకూడా వచ్చింది సుధకి.

'పరీక్ష లెలా రాశావ్ సుధా?' తను స్నానానికి వెళ్తూ స్నానాలగదిలో తువ్వాలూ వస్త్రాలున్నుంచి వస్తూన్న సుధకి దారి అడ్డగిస్తూ అడిగాడు రఘు.

'బాగానే రాశా' తలొంచుకుని కాలి బొటనవేలితో నేలమీద గీస్తూ అంది సుధ.

'ఇదెక్కడ కొనుక్కొచ్చావ్'

'ఏది?' ఏమిటన్నట్టుగా మొహమెత్తి చూసింది.

'ఇదే. ఈ సిగ్గుని' ప్రేమతో సుధ కళ్లల్లోకి చూశాడు రఘు.

'హాఁ' నవ్వుతూ తప్పించుకు పారిపోబోయింది సుధ.

'ఎవరన్నా మామూలువాళ్లు సిగ్గుపడ్డా చదువుకునేవాళ్లు సిగ్గుపడరు. ఏదంతా తల్లోకిందులో కంగా వుందే?' అన్నాడు సుధ నడ్డగిస్తూ.

'అవును కాని నా పెద్ద ఉత్తరం అందిందా.'

'ఆ. అన్ని పేజీల ఉత్తరమేమిటి అక్కయ్యా వాళ్లంతా ఆక్షేపించేందుగ్గానీ' తలొంచుకునే మెల్లిగా అంది.

'మరి ఆ ఉత్తరం ఎన్నెన్ని ముఖ్యమైన సంగతుల్ని మోసుకొచ్చింది నీకోసరం'

'......'


'ఉష్ ఎందుకలా పరుగులెత్తుతావ్, ఈ ఒక్కమాటా విని వెళ్లు.' తప్పించుకు పోతూన్న సుధని పిల్చాడు రఘు.

'ఏమిటి?'

'అందులోని షరతు లన్నింట్లకీ తాత గారు సమ్మతించినట్టేనా'

'నిరభ్యంతరంగా, ఇక వెళ్ళనా' అంటూనే ఒక్కపరుగు తీసింది సుధ. నవ్వుకుంటూ తనూ స్నానానికి వెళ్లిపోయాడు రఘు. మరొకటి రెండుమార్లు రఘు మాట్లాడేందుకు ప్రయత్నించినా అందుకేపాటి అవకాశం ఇవ్వలేదు సుధ.

(ఇంకా ఉంది)



వారఫలం

2-4-1971 శుక్రవారం మొదలు

8-4-1971 గురువారం వరకు

మేషం: వ్యాపారంలో పోటీదారి పోటీ తగ్గుతుంది. రాజకీయ వ్యవహారాలు బాగుంటాయి. ఆర్థిక వ్యవహారాల్లో మొగమాటాలు తగవు. ఉద్యోగంలో గౌరవం లభిస్తుంది. ప్రయాణం ద్వారా కార్యసాధన చేయగలరు. విద్యా వైజ్ఞానిక రంగాల్లో మీ కృషి రాణిస్తుంది.

స్త్రీలకు:—వినోద కాలక్షేపాల్లో పాల్గొంటారు. దైవ కార్యాలు నెరవేరతాయి.

వృషభం: అన్ని వ్యవహారాల్లోను మీ శ్రమకు తగిన ఫలితం లభిస్తుంది. నూతన విషయాలను తెల్సుకొంటారు. రాజకీయ వ్యవహారాలు బాగా ఉంటాయి. మిత్రులకు సహాయం చేస్తారు. కొన్ని వ్యవహారాల్లో మీ మంచి తనమే మీకు ఇబ్బందిని కలిగిస్తుంది.

స్త్రీలకు:— ప్రయాణాలోచనలు చేస్తారు. సంతోషకరమైన వార్తలను వింటారు.

మిథునం: వృత్తి వ్యాపారాల్లో మీ కార్యక్రమాలు బాగా ఉంటాయి. పోటీదారిలో గౌరవం లభిస్తుంది. రావలసిన డబ్బు సమయానికి అందుతుంది. భాగస్వాములతో కలిసి చేసే వ్యాపారాలు బాగుంటాయి. సాహసముతో కూడిన వ్యవహారాలు లాభిస్తాయి.

స్త్రీలకు:— బంధుమిత్రులను కల్సుకొంటారు. విలాస వస్తువులు కొంటారు.

కర్కాటకం: లాభం రావలసిన వ్యవహారాల్లోనే నష్టం రావచ్చును. ప్రయాణాల్లో శ్రమ కలుగుతుంది. వారం మధ్యలో నూతన వ్యవహారాలు లాభిస్తాయి. వృత్తిలో నూతనావకాశాలు లభిస్తాయి. ప్రయోజనం గల పరిచయాలు యేర్పడతాయి.

స్త్రీలకు:— కుటుంబ వ్యవహారాలు బాగా ఉంటాయి. అధిక వ్యయం జరుగుతుంది.

సింహం: వ్యాపారంలో మీ ప్రయత్నాలు ఫలిస్తాయి. సాహిత్యకళా రంగాల్లో మీ కృషి రాణిస్తుంది. వారం మధ్యలో మీ తాలూకు వస్తువులు పోవచ్చును. సాహసముతో కూడిన వ్యవహారాల్లో నష్టం వస్తుంది. వారం ఆఖరులో అన్ని వ్యవహారాలు తిరిగి బాగా ఉంటాయి.

స్త్రీలకు:— ఆరోగ్యం బాగా ఉండదు. సంతానానికి సౌఖ్యసంతోషాలు లభిస్తాయి.

కన్య: వృత్తిలో ముఖ్యమైన వ్యక్తులను కల్సుకొంటారు. ఉద్యోగంలో గౌరవం లభిస్తుంది. మాతృ వ్యవహారాలు బాగా ఉంటాయి. వ్యాపారంలో ఆదాయం పెరుగుతుంది. వారం ఆఖరులో మీరు శ్రమ పడినా, ప్రయోజనం ఉండదు. ప్రయాణాలు వాయిదా పడతాయి.

స్త్రీలకు:— పుణ్యకార్యాలు చేస్తారు. నూతన విషయాలను తెల్సుకొంటారు.

తుల: అన్ని వ్యవహారాలు అనుకొన్నట్లుగా నెరవేరతాయి. వృత్తిలో అనుకూలవార్తలను వింటారు. స్థిరాస్తి వ్యవహారాలు బాగుంటాయి. ప్రయాణం ద్వారా కార్యసాధన చేయగలరు. సాహసముతో కూడిన వ్యవహారాలు లాభిస్తాయి, సజ్జన సాంగత్యం లభిస్తుంది.

స్త్రీలకు:— ఆరోగ్యం బాగా ఉంటుంది. వినోద కాలక్షేపాల్లో పాల్గొంటారు.

వృశ్చికం: కొన్ని వ్యవహారాల్లో మీరు శ్రమ పడినా, ప్రయోజనం ఉండదు. ఉద్యోగంలో కార్యభారం పెరుగుతుంది. వారం మధ్యలో అనుకూల పరిస్థితి ఏర్పడుతుంది. విద్యా వైజ్ఞానిక రంగాల్లో మీ కృషి రాణిస్తుంది. అధికారుల వలన జరుగవలసిన వ్యవహారాలు బాగుంటాయి.

స్త్రీలకు:— కుటుంబ వ్యవహారాల్లో చికాకులు యేర్పడతాయి. దైవ కార్యాలు నెరవేరతాయి.

ధనుస్సు: ప్రయత్నించిన ప్రతి పనీ సులువుగా నెరవేరదు. ప్రయోజనం గల పరిచయాలు యేర్పడతాయి. వారం మధ్యలో ఆందోళన కలుగుతుంది. వ్యతిరేకమైన వార్తలను వింటారు. వారం ఆఖరులో వృత్తి వ్యాపారల్లో మీ కార్యక్రమాలు బాగుంటాయి.

స్త్రీలకు:— ఆరోగ్యం బాగా ఉండదు. వినోద కాలక్షేపాల్లో పాల్గొంటారు.

మకరం: వ్యాపారంలో శ్రమవిూద అనుకూలత లభిస్తుంది. పోటీవారితో మాట పట్టింపులు తగవు. రావలసిన డబ్బు సమయానికి అందగలదు. వృత్తిలో ముఖ్యమైన వ్యక్తులను కల్సుకొంటారు. వారం ఆఖరులో కొంతమంది వ్యక్తులు మిమ్మల్ని మోసం చేయడానికి ప్రయత్నిస్తారు.

స్త్రీలకు— కుటుంబ వ్యవహారాలు బాగుంటాయి, ఆడంబరం కోసం వ్యయం చేస్తారు.

కుంభం: వృత్తి వ్యాపారాల్లో మీ కార్యక్రమాలు ప్రోత్సాహకరంగా ఉంటాయి. మిత్రుల సహాయం లభిస్తుంది. రాజకీయ వ్యవహారాల్లో చికాకులు యేర్పడతాయి. అనవసరమైన సందేహాలు కలుగుతాయి. భాగస్వాములతో కలిసి చేసే వ్యాపారాలు బాగుంటాయి.

స్త్రీలకు:— ఆరోగ్యం బాగుంటుంది. దైవ కార్యాలు నెరవేరతాయి.

మీనం: సామాన్యమైన పనులకు కూడా మీరు ఎంతో కృషి చేయవలసి వస్తుంది. స్థిరాస్తి వ్యవహారాలు బాగా ఉంటాయి. సాహసముతో కూడిన వ్యవహారాలు లభిస్తాయి. ప్రయాణాలు ఫలిస్తాయి. రావలసిన డబ్బు సమయానికి అందక పోవడం వలన ఇబ్బంది కలుగుతుంది.

స్త్రీలకు:— అధిక వ్యయం జరుగుతుంది. బంధుమిత్రులను కల్సుకొంటారు.

—మహేష్

విషాద ప్రపంచంలో అందాల రాణి

"కిరీటం ధరించిన తలలో కష్టాలు కాపురం చేస్తాయి" అని షేక్స్పియర్ రాశారు. ఈ మాట ఆనాటి చక్రవర్తులకి అన్వయించినట్లే ఈనాటి అందాల రాణులకి కూడా వర్తిస్తుందేమో ననిపిస్తుంది.

విజయం సాధించిన ఒక అందాల రాణి మూడునాలుగురోజులు కన్నీళ్లలో కాలం గడిపింది.

...ఈ వ్యాసంలో రచయిత జాన్‌కోర్ను —భారీ యెత్తున జరిగే అంతర్జాతీయ అందాల పోటీల్లోని తెర వెనుక సంఘటనల్లోకి మనల్ని తీసుకు వెళ్తారు ..

లండన్‌లో ఏటా జరిగే ప్రపంచ సుందరి పోటీలో ఎన్నికయ్యే వారి కోసం యాభైవేల పౌండ్లు ఎదురు చూస్తూ వుంటాయి ఈ డబ్బు ఆ సుందరి పేరూ, ముఖాన్నీ, శరీరాన్నీ—వ్యాపార ప్రకటనలలో వాడుకున్నందుకుగాను లభిస్తుందామెకి. హోస్టెస్‌గా పని చేసినా, టి వి ల్లో, సెలూన్లో, సినిమాల్లో నటించినా, అందుకు ప్రత్యేకంగా వస్తుంది డబ్బు.

ఈ పోటీకి ప్రపంచ స్థాయిలో ప్రచారం జరుగుతుంది బ్రిటిష్ టెలివిజన్‌లో దీన్ని చూడటానికి ఇరవై ఏడు మిలియన్ల జనం కాచుకుని వుంటారు ఈ పోటీ ద్వారా లభించిన డబ్బుని నిర్వాహకులు సహాయ సంస్థలకి యిచ్చి వేస్తారు. మేనేజిమెంటు ఫీజు క్రింద— ప్రపంచ సుందరి సంపాదనలో 25 శాతం నిర్వాహకులు తీసుకుంటారు దానితో ఆ పై సంవత్సరం పోటీలు నిర్వహిస్తారు. టెలివిజన్ స్టేషన్లు, పత్రికలు, వార్తా పత్రికలు, ఫేషన్ సంస్థలు, సౌందర్య సాధనాల ఉత్పత్తిదారులు, క్రీడా నిర్వాహకులు, వ్యాపార ప్రకటన సంస్థలూ—ఈ అందాల పోటీని వీలైనంత వరకూ వాడుకుని డబ్బు చేసుకుంటాయి లండన్‌లో పోటీ జరగటం చాలా రాష్ట్రాలలో గర్వకారణంగా పరిగణించింది. ఉగాండా, నైజీరియా, ఘనా, సైలాన్, జమైకా—అలాంటి వాటిలో ముఖ్యమైనవి.

జమైకాకు చెందిన కరోల్ జోన్ క్రాఫర్డ్ అనే 20 ఏళ్ల అమ్మాయి 1963 లో మిస్ వరల్డ్‌గా ఎన్నికయినప్పుడు, జమైకా ప్రభుత్వం ఆమె విజయాన్ని పురస్కరించుకొని ఒక తపాలా బిళ్ల విడుదల చేసింది.

సంఘటనలు

పోటీలో పాల్గొనే 50కి పైగా అందమయిన అమ్మాయిల మందస్మిత వదనాల వెనక బాధలు అంచులూ ఉండకపోవు! వోడిపోవటం కన్నా, గెలవటం ఒక్కొక్కప్పుడు పెద్ద బాధగా ఉంటుంది.

ఉదాహరణకి 1961 లో ప్రపంచ సుందరిగా ఎన్నికయిన రోజ్ మేరీ ఫ్రాంక్‌లాండ్ అన్నిసాయంత్రనాడి గెలుపొందాక ఆ మొదటి మూడురోజులూ కన్నీళ్లలో కాలం గడిపాను. షాక్ ఏక మోత. అడ్డూ, ఆపూ లేకుండా ఒకటే కాల్స్. వారాల తరబడి కొత్త ముఖాలతో గడపవలసి వచ్చింది ఒంటరితనం భరించలేకపోయగాను అంటుందామె

కొన్నేళ్ల కిందట ఇటలీకి చెందిన ఒక అందగత్తె పాడింగ్ చేసిన స్విమ్ సూట్ ధరించి వచ్చి ఒడింది. [పాడింగ్ అంటే స్విమ్ సూట్ లోపల పెరుకులు ఎత్తుగా కనిపించటం కోసం స్పాంజి వేసి కుట్టారు] అప్పట్నుంచి యీ పోటీలో కృత్రిమ సాధనాలు ఉపయోగించే అభ్యర్థుల్ని పోటీకి అనర్హులుగా నిర్ణయించటం జరిగింది

అర్హతలు

మిగిలిన అరతల [illegible] పాల్గొనే అందగత్తెలు 17 నుంచి 25 ఏళ్ల లోపు వారై ఉండాలి. చిన్న ఉపన్యాసం చెప్పగలిగే పాటి సామర్థ్యం ఉండాలి [illegible]పిల్ల కాదని నిరూపించుకోవాలి గనుక!] 5 అడుగుల 5 అంగుళాల నుంచి 5 అడుగుల 8 అంగుళాల వరకూ పొడవుగా వుంటే యువతులు యీ పోటీలో గెలుపొందవచ్చునని ప్రపంచ సుందరి న్యాయనిర్ణేతలు చెబుతారు. ఛాతి కొలతా, పిరుదుల కొలతా 34 అంగుళాలు వుండాలనీ, నడుం కొలత 22 నుంచి 24 అంగుళాల వరకూ వుండవచ్చునీ కూడా అంటారు.

అంటే—కాస్త పొట్టి విగ్రహం కలిగిన అమ్మాయి గెలవలేదనీ, ఒడ్డూ పొడుగూ కావలసిన దానికన్నా ఎక్కువ కొలతలు వున్న అమ్మాయి వోడిపోదనీ కాదు కేవలం ఫోటోలకి పనికి వచ్చే అందానికి—ఈ పోటీలో గెలుపొందే అదృష్టం కలిగిఉండవచ్చు


(64 వ పేజీ చూడండి)



ఆస్ట్రేలియాకి చెందిన సుందరి ఏవాదర్నాబెన్ స్టైయిన్ (వాకెన్)

న్యూస్ పేపర్ వుమన్

పొతినేని వెంకట నరసింహారావు



✳ శ్రీమతి వేడికాఫీతెచ్చి ముందుపెట్టింది.

క్షమించాలి. అదేం ఘనకార్యం కాదనీ, ప్రతి శ్రీమతీ కాకపోయినా మెజారిటీ శ్రీమతులు నిత్యం చేస్తున్న సామాన్యమైన సేవని సవినయంగా మనవి చేసుకుంటున్నాను. పాత చింతకాయ పచ్చడితో పాఠకుల్ని బోర్‌కొట్టించడం నా అభిమతం కాదని మరోసారి విన్నవించుకుంటున్నాను.

అప్పుడే వచ్చిన న్యూస్‌పేపరు ఎదురుగ్గావుంది. ప్రాణం లేచొచ్చింది. వార్తలు గరమ్ గరమ్‌గా వున్నవి.

'కలకత్తాలో పట్టపగలు ఇద్దరు పోలీసు ఆఫీసర్ల హత్య...'

'మెడికల్‌సీట్ల విషయంలో అప్పీలుకు అనుమతి నిరాకరణ' హైకోర్టు తీర్పు.

'ఫిలిప్పీన్స్‌లో తుఫానువల్ల వెయ్యిమంది మరణం.'

'రాజభరణాల రద్దు చెల్లనేరదని పల్కీవాలా వాదం'

వస్తైరా...వస్తైరా...

నా బుర్ర వేడెక్కిపోయింది. సమయం గుర్తుచేస్తూ గడియారం ఆరుకొట్టింది. ఉలిక్కిపడ్డాను. గంటకుపైగా పేపరు పఠనంలో మునిగిపోయా నన్నమాట.

వంటింట్లో చప్పుళ్లు లయబద్ధంగా వినిపిస్తున్నవి. తీవ్రత చూస్తే శ్రీమతి కోపం తారాపథం అందుకున్నట్లుగా వుంది. ఆవిడ స్వగతం నా అనుమానాల్ని ధృవపరచింది.

'తప్పు నాది! మంగాకర్నే పెండించి ఏం ప్రయోజనం?' ఇత్తడి పళ్లెం క్రింద పడి ఖంగున శబ్దం చేసింది.

'అయినా నే నెవర్నిగనుక? జీతం బత్తెం లేని నౌకర్ని'

స్టీలుగిన్నె దబ్బున క్రిందపడిన శబ్దం.

ఇహ నేం? నావల్ల ఏదో అపరాధం జరిగిపోయింది. అనుమానం లేదు. ఏమిటిచెప్మా? ఆఫీసునుండి రాగానే చిరునవ్వుతో కాఫీ అందించిన శ్రీమతి ఇంతలోనే కాళీరూపం ధరించిందేమిటి? నాకేమీ అర్థంకాలేదు.

క్షణ క్షణముల్ జవరాండ్ర చిత్తముల్...

టవల్ తీసుకుని బాత్‌రూమ్‌లోకి నడిచాను. చల్లటినీళ్లతో బుర్ర తడిపేశాను. ప్రాణం హాయనిపించింది.

చటుక్కున గుర్తొచ్చింది.

ఇంటికి రాగానే పేపరు పఠనంలో మునిగిపోవడం తప్పుగాదూ?

మునిగితే మునిగాను. శ్రీమతి చెప్పింది ఎటెంటివ్‌గా వినకపోవడం నేరంకాదూ?

అది చాలదన్నట్లు ఆవిడ ఎన్‌క్వయిరీస్‌కి 'అవును' అనవలసినచోట 'కాదు' అనడం, 'కాదు' అనవలసినచోట 'అవును' అనడం ఘోరమైన తప్పు.

ఇదీ శ్రీమతి ధాం ... ధాం ... లకు కారణం.

అదేం దురదృష్టమో గాని, నేను ఆఫీసునుండి యింటికి చేరుకోవడమూ, పేపరుకుర్రాడు తప్పుక్కున పేపరు విసిరేసిపోవడమూ, ఇంచుమించు ఒకే సమయంలో జరుగుతవి. నేనుంటున్న వూళ్లో సాయంత్రానికిగాని పేపరు రాదు.

'ప్రపంచాన్ని మరచి చదివేంతటి మత్తు పేపర్లో ఏముంటుందో?' శ్రీమతికి ఇప్పటికీ, ఎప్పటికీ అర్థంకాని విషయం. ఆవిడ దృష్టితో పేపర్ని 'యిలా' చూసి 'అలా' పారెయ్యాలి.

'పేపరు చదవటం ఒక్క దండగమారి వ్యాపకం' అని ఆవిడ అమూల్యమైన అభిప్రాయాల్లో ఒకటి.

అయినా పేపరు తిరగేస్తూనే వుంటుంది. నేను పేపరు చదవాలనుకునే సమయంలోనే ఆవిడకీ కావాలి. కేవలం వాదంకోసం కాకపోతే మరేమిటి? నాకు గొప్ప చిరచిరగా వుంటుంది.

'ఈ బిన్నీ చీర చూడండి ఎంత బావుందో?' పేపర్లో చూపిస్తూ. 'ఖండా


వివా
రెండు విధములుగా ఆరోగ్యమును కలిగించే పానీయము
పగలంతా ఎంతో శక్తి...
రాత్రంతా సుఖమైన విశ్రాంతి
వివా త్రాగండి—వేడిగా లేక చల్లగా, నీళ్లలో లేక పాలలో. మాల్ట్, గోధుమ మరియు ప్రోటీనులతో పుష్టివంతముగా చేయబడినదే వివా. అది స్నాయువులను బలపరుస్తుంది, నరములకు ఉపశమనమును కలిగిస్తుంది, కండరములకు సేద దీరుస్తుంది.
ప్రొద్దున్న వివా త్రాగుతే రోజంతా ఉత్సాహముగా ఉంటారు!
రాత్రి వివా త్రాగుతే గాఢముగా నిద్రపడుతుంది!
వివా సులభముగా జీర్ణమవుతుంది. అది రోగులకు, రోగము నుంచి కోలుకొంటున్న వారికి ప్రత్యేకముగా సిఫార్సు చేయబడినది.
రుచిగా ఉంటుంది కమ్మగా—
జీర్ణమవుతుంది త్వరగా!
VIVA
The Double-Action Health Drink
FORTIFIES YOU FOR THE DAY..
RELAXES YOU FOR THE NIGHT

దైనేమ్ ఈజ్ వుమన్

లంగా వుంది' అని మనసులో అనుకుని పైకి మర్యాదకోసం 'బావుంది' అంటాను.

'ప్రెషర్ కుక్కర్లోకి, ఇడ్లీగిన్నె లొస్తున్నాయండీ. ఇలా చూడండి' లేని వుత్సాహం తెచ్చుకుని చూస్తాను.

'ఏమండీ! కొంచెం వినిగర్ తెచ్చి పెడుదురూ!' వంటకాల శీర్షికతో నామీద ప్రయోగాలు.

ఒక్కొక్కసారి నా సహనం దెబ్బ తింటుంది, ఎంతకని సర్దుకుపోవడం? అలాటప్పుడు యుద్ధం జరగడం తథ్యం. అలాంటి అనేక యుద్ధాల తరువాత నా శ్రీమతి తేల్చిందేమిటంటే;

నాకు హృదయంలేదని!

'పెట్టంత మనిషిని అందులోనూ తన లాంటి దాన్ని ఎదురుగా పెట్టుకుని ముష్టి పేపరుకోసం తనను నిర్లక్ష్యం చేసేంత టేస్ట్ లేని మనిషినని.'

మధ్యనే మరింత విచిత్రమయిన ధోరణి బయటపడింది. ఒకరోజున పేపరు నామీద విసిరికొడుతూ 'ఇదిగో మీ ముద్దుల పెళ్ళాం' అంది. నాకు నవ్వొచ్చింది. ఆవిణ్ని మరింత వుడికిద్దామని పేపర్ని గట్టిగా ముద్దుపెట్టుకున్నాను.

'సిగ్గులేకపోతే సరి'

నిజంగా పేపరు చదివితే ఎంత రిలీఫ్? రోజంతా ఆఫీసులో గొడ్డుచాకిరీ చేశాక అంతమాత్రం రిక్రియేషన్ లేకపోతే మనిషి పిచ్చెత్తిపోడూ? కొంచెం బ్లంట్‌గా చెప్పాలొస్తోందిగాని నిజంగా పేపరిచ్చే ఆనందం ఎందరు పెళ్ళాలు మొగుళ్ళకివ్వగలుగుతున్నారు? గుండెలమీద చెయ్యి వేసుకుని చెప్పమనండి? చూద్దాం!

అందుకే శ్రీమతి పేపర్ని నా ముద్దుల పెళ్ళాం అనడం నాకు కొంచెం సరదాగానే వుంది. ఒకరోజున చిన్నవాదంతో నా సరదా కాస్తా బైటకి వెళ్ళగక్కేశాను. 'అయితే అయిందిలెమ్మా!' అన్నాను విసురుగా. నేనలా అనకుండా వుండాల్సింది. శ్రీమతి చాలా సీరియస్‌గా తీసుకుంది. నిజంగా నాకు మరో పెళ్ళాం వున్నట్టూ, ఆ శూర్పణఖ నన్ను వశంచేసుకుని తనకన్యాయం చేస్తున్నట్టూ ఫీలయి తన అక్కసంతా పేపరుమీద వెళ్ళగక్కడం మొదలు పెట్టింది. వీలయినప్పుడల్లా పేపర్ని దుమ్మెత్తిపోస్తోంది.

అసలే నాది జాలిగుండె. అన్యాయంగా ఇన్ని నిందలు భరిస్తున్న పేపర్లకు నా సానుభూతి తప్ప మరేం చూపగలను?

మొత్తంమీద ఇంత చిన్నవిషయం మాయిద్దరిమధ్యా కలహకారణం కావడం అర్థం లేదనిపించింది. అసలు నేను సరదాయిన మనిషినని నా నమ్మకం. అందుకే ఒక చిన్న విషయంమీద భార్యను దుఃఖపెట్టడం ఏమంత విజ్ఞత? ఏదో ఆడవాళ్ళ మొండితనం కొద్దీ కొన్ని విషయాల్లో పట్టుదల చూపడం సహజం. అలాటిది నేను సర్దుకుపోతేపోయె, సంసారం అంటే ఎన్నో సర్దుబాట్లు అవసరం. పట్టూ విడుపూ వుండాలి. బాత్‌రూమ్‌నుండి 'యురేకా' అంటూ బయటపడ్డాను. మనసు తేలిక పడింది. పేపరు మూలకంగా మాయిద్దరిమధ్యా కలతలు రాకుండా చూసుకోవాలి. ఆ బాధ్యత నాదే. శ్రీమతిమీద జాలివల్లకానీండి, మరేకారణం అయినా కారణం కానీయండి నేను స్వార్థంగా సరెండర్ కావడానికి సిద్ధపడ్డాను. శ్రీమతి పేపరు తింటేస్తోంది సీరియస్‌గా.

'ఈరోజు శనివారం కాదూ?' అన్నాను మాట కలుపుదామని. శనివారం అని నాకు తెలుసు.

'ఏమో?' అంది తుంచేస్తూ.

'రాత్రికేం టిఫిను చేశావు?' ఆవిడ శనివారం రాత్రిళ్ళు భోజనం చెయ్యదు. నాకలాటి పిచ్చి నమ్మకాల్లేవు.

'ఆఁ నా తిండి సంగతెవరికి పట్టిందనీ లెద్దురూ?'

ఈ ధోరణిలో వుండగానే రాకెట్‌లా నా ప్రతిపాదన విసిరేద్దామనిపించింది. అప్పుడు గాని ఎఫెక్టివ్‌గా వుండదు.

'ఒకమాట చెప్పనా?'

'చెప్పండి'

'రేపట్నుంచీ పేపరు మానివేద్దాము. ఏమంటావు?'

శ్రీమతి ఆశ్చర్య చకితురాలయింది. ఇంత పేపరుపిచ్చిగాణ్ని ఇంత తేలిగ్గా వదిలివేస్తున్నానంటే నమ్మకం కలిగినట్టు లేదు.

'నిజంగా?'

'ముమ్మాటికీ'

డైనమ్ ఈజ్ ఫ్యూషన్

'ఎందుకు స్వామీ అంత త్యాగం? పెళ్ళాన్ని మరచిపోయేంత పిచ్చి వద్దన్నాను గాని...'

'మరిక అడ్డుచెప్పకు. నా నిర్ణయం తిరుగు లేనిది. మనిద్దరి మధ్యా కలహకారణంగా వుంటున్నదాన్ని నేను క్షమించలేను'

కొంచెం ఉద్రేకంగానే అన్నాను. నా ముఖంలోని సిన్సియారిటీ చూసిగబోలు...

'మీ యిష్టం' అంది.

* * *

నా జీవితంలో ఇంత దరిద్రగొట్టు నిర్ణయం మరొకటి చెయ్యలేను. ఏదో క్షణికోద్రేకంలో శ్రీమతిని ప్లీజ్ చేద్దామని అలా లొంగిపోయ్యాను గాని నిజంగా పేపరు చూడకుండా వుండటం నా తరమా?

సాయంత్రం అయేసరికి మనసంతా చిందర వందరగా వుండేది. ప్రపంచం ఏమయిపోతోందో?

'కలకత్తాలో నక్సలైట్ గొడవెలా గుందో?'

'మెడికల్ సీట్ల విషయం సుప్రీం కోర్టులో ఏమయిందో?'

'రాజభరణాల రద్దు సంగతి?...'

ఛీ... ఛీ... నా దురదృష్టాన్ని తిట్టుకున్నాను. జీవితంలో ఏదో విలువైన వస్తువుని పోగొట్టుకున్నట్టుగా వుంది. ఇంట్లో హాయిగా వాలుకుర్చీలో కూర్చుని పేపరు చదువుకోవడం ఫండమెంటల్ రైట్స్‌లో ఒకటి. రాజ్యాంగం ఇచ్చిన ఆ హక్కుని నా చేజేతులా పోగొట్టుకుని యిప్పుడు విలపిస్తే యేం లాభం? నా అసమర్థతకు నేనే బాధ్యుణ్ణి.

సంసారంలో కలతలు లేకుండా వుండే నిమిత్తం నేను చేసిన త్యాగం నిష్ఫలమై పోయింది. రోజూ ఆఫీసునుండి వుసూరుమంటూ రావడం మూడ్ సరిగా వుండక పోవడం మామూలయి పోయింది. శ్రీమతి నన్నుత్సాహ పరచడాని కనేక ప్రయత్నాలు చేసింది.

'అలా గున్నారేం?'

'అబ్బే! ఏం లేదే?'

'ఏం లేక పోవడమేమిటి? చూడండి ఎంత నీరసంగా కనిపిస్తున్నారో!'

నాకు నిజంగానే నీరసం ముంచు

కొచ్చేది. నేను మౌనరాగా వుండిపోవడం మామూలయి పోయింది. ఈ మార్పంతా ముష్టి పేపరుకోసమని శ్రీమతికి తట్టదు.

వారంరోజులు భారంగా గడిచినవి. ఒక రోజున చటుక్కున బ్రహ్మాండమైన ఐడియా వచ్చింది. పత్రికలకోసం ఇంటికి పేపరు తెప్పించుకోగూడదు. సరే! లైబ్రరీలో చదవొచ్చునుగా?

ఆఫీసు మూయగానే లైబ్రరీకి పరుగెత్తాను. అంట్రటోతు అప్పుడే తలుపులు తెరుస్తున్నాడు. రీడింగ్‌రూమ్‌లో అడుగు పెట్టాను. అబ్బ! ఎంతదృష్టం? ఎన్ని పేపర్లు? నా పేపరుకోసం కళ్ళు గాలించాయి. పేపర్లవరసలో మధ్యన హుందాగా వుంది. ప్రాణం లేచొచ్చింది. పెరపెర లాడే ఇస్త్రీ చీరకట్టుకున్న అందమైన స్త్రీలా వుంది.

ఆప్యాయంగా చేతిలోకి తీసుకుని గుండెలకు హత్తుకున్నాను.

ఆత్రంగా వార్తలన్నీ చదివాను. హమ్మయ్య!

ప్రపంచం ఏమీ అయిపోలేదు. వారం రోజుల క్రితం ఎలాగుందో ఇంచుమించు ఈరోజూ అలాగే వుంది.

అవే సమస్యలు అంతులేని సమస్యలు. ఉత్సాహంగా ఈల వేసుకుంటూ ఇంటికెళ్ళాను.

ఈ ఏర్పాటు చాలబాగా వుంది. ఒక్క దెబ్బకి మూడు పక్షులు. అటు నా బెంగమూ వెళ్ళింది, ఇటు నాకోరికా తీరింది, అటు శ్రీమతితో తగూ తప్పింది.

రోజూ ఒకగంట ఆలస్యంగా యింటికి చేరుకుంటున్నాను. శ్రీమతి ఆట్టే పట్టించుకోవడం లేదు. ఆఫీసులో పనెక్కువగా వుందనీ, ఎవడో స్నేహితుడు కనిపించి ఆలస్యమయిందనీ తేలిగ్గా టోకేస్తుండే వాణ్ణి. అబద్ధాలు చెప్పి నమ్మించడం ఎంతతేలికో నాకర్థమయింది. ఏం చేస్తాం మరి? కుంచంతో మామూలుగా కొలవడం వీలుకాకపోతే తల క్రిందులుగానైనా కొలవమన్నాడు గ్రేట్ గిరీశం. అదే శరణ్యం.

మొత్తంమీద సంసారం హాయిగా సాగిపోతోంది.

అసలు భార్యాభర్తల మధ్య అంకురించే చిన్నచిన్న సమస్యల్ని కొంచెం తెలివుపయోగిస్తే ఎంత సున్నితంగా పరిష్కరించుకోవచ్చు? నాలో కాన్ఫిడెన్స్ పెరిగింది. శ్రీమతి ఈ మార్పుని గుర్తించింది.

'చూడండి! ఇప్పుడెంత హాయిగా వుంటోందో?'

'ఎందుకనో?'

'ఎందుకేమిటి? ఇదివర్లో పేపర్లో మునిగిపోయి ఉలుకూ పలుకూ వుండేవారు గారు. ఎప్పుడూ కొంపలు మునిగిపోతున్నట్లు ముటముట లాడుతూ వుండేవారు. ఇప్పుడు పీడా విరగడైపోయింది.'

'అవును సుమా!'

'అందుకే ఆడదానిమాట విన్నవాళ్ళు చెడిపోరు.'

దైనేమ్ ఈజ్ వుమన్

"నిజం."

ఇలా వుండగా ఒక వారం రోజుల పాటు ఫ్లూ జ్వరం వచ్చే అదృష్టం కలిగింది నాకు. అదృష్టం అని ఎందుకన్నానంటే అసలు నాకు చిన్న చిన్న రుగ్మతలెప్పుడూ రావు గట్టిపిండాన్ని. అందుకే జ్వరం వచ్చిన నాళ్ళు మహాసీ అనాయాసపడుతుంటాను. హాయిగా ఇంట్లో కూర్చుని మామూలుగా నను కూడని సపర్యలన్నీ చేయించుకోవచ్చు.

పేపరుకోసం కొంచెం ఇబ్బంది ఫీలయ్యాను. అయినా ఫరవాలే దనిపించింది. వయసువగానే వెళ్ళి పాత పేపర్లన్నీ చదివెయ్యొచ్చు. జ్వరంతో వున్నపుడైనా పేపరు తెప్పిస్తుందని ఆశపడ్డాను. నోరు విడిచి అడిగినా లాభం లేకపోయింది.

'హానిద్దురా! నే నెదురుగా కూర్చుని కబుర్లు చెబుతాగా?' అంది శ్రీమతి.

తనెప్పైనా రాయిటర్సా, పి. టి. ఐయా, ఆలిండియా రేడియోనా? వార్తలందించ డానికి. నేను నోరు మూసుకుని వూరుకున్నాను.

రెండునెలలు గడిచాయి. ఒక ఆదివారం తీరిగ్గా ఇంట్లో మధ్యాహ్నం శ్రీమతితో వంటలో సాయం చేస్తున్నాను.

'అమ్మా! పాత పేపర్లు వేస్తారా?' బయట అరుపు.

'ఉండబ్బీ! వుండు' అంటూ వెళ్ళి పాతపేపర్ల కట్టవి అతనిముందు వేసింది.

'ఉండు. మా తక్కెడ, రాళ్ళూ తెస్తాను మిమ్మల్ని నమ్మగూడదు.' అంటూ లోపలికి వెళ్ళింది. అమ్ముతున్నది పాతపేపర్లు. అందులోకూడా అంత అప్రతిమైన బేరం. కుతూహలంతో వరండాలోకొచ్చాను. శ్రీమతి బేరం టెక్నిక్ పరిశీలించడానికి.

పేపర్లదొంతర నీట్‌గా వుంది. అట్టే నలిగినట్లుగా కూడా లేవు అయినా అసలు పేపరు తెప్పించడం మానివేసి చాలరోజు లయిందిగా? ఇన్ని పేపర్లెక్కడివి?

పైనున్న పేపర్లు తీశాను.

నిన్నటిది...మొన్నటిది ... అటు మొన్నటిది...ఆ క్రితంరోజుది వరుసగా పేపర్లన్నీ వున్నవి. నా కాశ్చర్యం వేసింది.

'మీరెందుకండీ ఇక్కడా?' అంటూ శ్రీమతి తక్కెడా రాళ్ళతో ప్రవేశించింది.

'మనం ఎప్పుడో పేపరు ఆపివేశాముగా? ఇవన్నీ ఎక్కడివి?'

'ఒక్కరోజుకీ మానలేదు.'

'ఏమిటీ? రోజూ పేపరొస్తోందా?'

'వస్తోందంతా.'

'అయితే నాకు కనిపించడం లేదేమి?' కొంచెం విసుగ్గా అన్నాను.

'అయ్యోరామ! మీరెట్టుకు మీరే పేపరు ముట్టన'ని శపథం చేస్తిరిగదా? అర్ధాంగిని గనుక మీ ఆశయం నిర్విఘ్నంగా సాగేట్టు చెయ్యడం నా కర్తవ్యం'

'మరి పేపరెందుకు? దండుగా?'

'ఏం మనుషులండీ మీరు. చదివినా చదవకపోయినా పేపర్ తెప్పించుకోవడం స్టేటస్‌కి చిహ్నం. అదీగాక ఎదురింటి లలిత రెండు పేపర్లు తెప్పిస్తోంది సెప్ప చదివేసి దాంలాగా! మనమేనా అంత చేతగాని వాళ్ళం?'

నేను బిక్క చచ్చి పోయాను.

అఫ్టరాల్ వుమన్ ఈజ ఎ వుమన్. ●

సినిమా

'మేకింగ్ ఈజు రిచ్, టేకింగ్ ఈజు సుపర్బ్' అనెడి పేరును తెచ్చుకున్నారు జగపతి రాజేంద్రప్రసాద్. తెలుగు చిత్ర పరిశ్రమలో సరికొత్త రికార్డును 'దసరా బుల్లోడు' చిత్రం సృష్టించింది. మొదటి ప్రయత్నమే (దర్శకునిగా) అయినా, ఏస్ డైరెక్టరు అనే పట్టాన్ని ఇచ్చి సత్క రించారు ఆంధ్ర ప్రేక్షకులు.

దిగ్విజయ యాత్ర సాగిస్తున్న 'దసరా బుల్లోడు' దర్శకుడు రాజేంద్రప్రసాద్‌ను హబిబుల్లారోడ్డులోని జగపతి ఆఫీసులో కలిసి, హార్టీ కంగ్రాచ్యులేషన్స్ చెప్పి, 'మీ తదుపరి చిత్రం ఎప్పుడు' అని అడిగాను. 'సబ్జెక్టు కోసం వెతుకుతున్నాను. ప్రేక్షకులు ఈసారి ఇంకా మంచి చిత్రాన్ని యెదురు చూస్తారు. వాళ్ళ వూహలమేరకు వుండా లి గా. అందుకే మంచి కథను వేటాడు తున్నాను' అన్నారు.


మారిషస్‌కి తెలుగుచిత్రాలు

తర్వాత పిక్చర్‌ను విదేశాల్లో తీస్తారని రూమర్‌గా వుంది. 'నిజమేనా' అన్నాను. 'మంచి లొకేషను (ఫారిన్‌లో) వున్నచోట తీయవచ్చు. మే 18 న మారిషస్‌కు వెడు తున్నాము కూడా,' అని చెప్పారు. 'ఏమయినా ప్రింట్లను తీసికెడుతున్నారా?' అన్నాను. 'ఆరాధన, ఆత్మబలం, ఆస్తిపరులు, అక్కా చెల్లెలు, అదృష్టవంతులు, దసరా బుల్లోడు ప్రింట్లను మారిషస్ ప్రభుత్వం వారికి యివ్వడానికి వెడుతున్నాను. హీరో నాగేశ్వరరావు, నేను గాక మరి ఎనమండు గురు ఈ యూనిట్‌లో వుంటారు. అక్కడి నుండి యింటిమేషన్ రాగానే, మిగతా వివ రాలను విపులంగా చెప్తాను' అన్నారు రాజేంద్రప్రసాద్.

నిర్మాణంలో తేడా

గిరిరోడ్డులోని మధు పిక్చర్స్ ఆఫీసుకు వెళ్ళాను. ఆఫీసురూములో ఫాను స్పీడుగా తిరుగుతూ వుంది. ఏ.సి. ఆర్‌పేసి వుండింది. నిర్మాత మల్లికార్జునరావు ('మంచి కుటుంబం' నిర్మాత) చిరునవ్వు లొలికిస్తూ, కూర్చోమన్నారు నన్ను. 'మీ న్యూస్ వ్రాసి చాలా రోజులయింది, ఉగాది సంచికకు ఏదయినా చెప్తారా?' అని అడిగాను. 'తెలుగు చిత్రాన్ని హీరో నాగేశ్వర

(57 వ పేజీ చూడండి)



ఎన్. టి. రామారావు.

(చిత్రకారుడు: శ్రీ ఎం. ఆర్. ఎన్. ప్రసాదరావు)



'అభిమానులకు అబద్ధం చెప్పక తప్పదు!'

ప్రతి చిత్రానికి ఒక్కొక్క మెట్టు పైకి వెడుతున్న నటి వాణిశ్రీ. 'ఉగాది' సందర్భాన ఆమెతో జరిపిన ప్రత్యేక యింటర్వ్యూ.

ప్ర: మీకు ఏకాంతంగా వుండడం ఇష్టమా? లేక పదిమంది నడుమ వుండడం యిష్టమా?

జ: పదిమందితో సరదాగా కలిసి మెలిసి వుండడమే నాకు యిష్టం.

ప్ర: మీరు ఎప్పుడయినా, ఎవరినయినా తిట్టేవున్నారా? లేక ఎవరిచేతనయినా చీవాట్లు పడియున్నారా?

జ: మనిషి అన్న తర్వాత, తిట్టడం తిట్టించుకోవడం సహజం.

ప్ర: మీకు ప్రాణస్నేహితులెవరో చెప్తారా?

జ: అబ్బో! చాలామంది వున్నారు. చెప్పడం కష్టం.

ప్ర: మీకు ఎప్పుడయినా అబద్ధం చెప్పే అలవాటుందా? ఎవరికయినా మాటయిచ్చి తప్పేవున్నారా?

జ: నన్ను చూడవచ్చే అభిమానులు మా యింటికి ఒకసారి రండి అని పిలుస్తారు. తప్పక వస్తానని చెప్పడమే గాని, ఒక్కసారికూడా వెళ్లిన పాపాన పోలేదు.

ప్ర: భగవంతుడికి దణ్ణం పెట్టేప్పుడు, ఏమయినా వరాలు కోరుతారా?

జ: నా కోర్కెలు తీర్చమని నేను దేముణ్ని యెప్పుడూ ప్రార్థించను.

ప్ర: మీకు కోపం రావాలంటే ఏం చెయ్యాలి? మిమ్మల్ని నవ్వించడం ఎలా?

జ: నిద్రపోయేటప్పుడు లేపితే, చాలాకోపం వస్తుంది. ఇలాంటి ప్రశ్నలు వినేప్పుడు నవ్వు వస్తుంది.

ప్ర: మీకు నచ్చిన దేశనాయకు లెవరు?

జ: స్వర్గీయ నెహ్రూ. చిన్నప్పట్నుంచి ఆయనంటే అభిమానం. ఎందుకో తెలియదు.

ప్ర: మీ దగ్గరవున్న 'మేనరిజమ్' ఏమిటి?

జ: గోళ్లు కొరకడం.

ప్ర: మీకు బాగా నచ్చిన డ్రస్ ఏది? ఏ రంగు అంటే యిష్టం?

జ: లంగా, వోణి; తెలుపు, ఆరంజి, నలుపు, వయొలెట్.

ప్ర: మీ దగ్గర ఎన్ని రకాలయిన చీరెలు, ఎన్నిడజన్లు వున్నాయి?

జ: చెప్పడం కష్టమే. లెక్కపెట్టలేదు.

ప్ర: 'నటన' గాక మరే కళ అయినా మీకు వచ్చా?

జ: పాకశాస్త్రంలో మంచి ప్రావీణ్యం వుంది.

ప్ర: మీరు షాపింగుకు వెడితే ఎంత డబ్బు తీసికెడతారు?

జ: నేను షాపింగుకు వెడితే, నేనసలు డబ్బు తీసికెళ్ళను.

ప్ర: మీరు రోజుకు ఎన్నిసార్లు అద్దం ముందు నిలబడతారు?

జ: లెక్కలేనన్ని సార్లు.

ప్ర: ఇంటిపనులు ఏమయినా చేస్తారా?

జ: ఒక్కటా — రెండా చెప్పడానికి. అన్నిపనులూ చేస్తాను.

ప్ర: మీ జీవితంలో భరించరాని బాధ ఎప్పుడయినా అనుభవించారా?

జ: నేను హైస్కూలులో చదువుకునేటప్పుడు, 'వచ్చే ఆదివారం మనమంతా ఎక్స్‌కర్షన్ వెళ్లుతున్నాము' అన్నారు టీచరు. నాకు చాలా సంతోషమేసింది. వెళ్ళబోయే ముందురోజు మా డ్రస్, జడ ఎలా వేసుకోవాలి అని స్నేహితులమంతా మాట్లాడుకున్నాం. శనివారం రాత్రి వచ్చింది. ఆదివారము రోజుకు కావలసిన దుస్తులన్నీ సర్దాను. ఆరోజు రాత్రి నిద్ర పట్టలేదు. ఎప్పుడు తెల్లవారుతుందా అని ఎదురుచూచాను.! తెల్లవారింది. అందరం బస్సు ఎక్కబోయాము. నాకు చెవిపోటు ప్రారంభమైంది. అంతే, విహార యాత్రకు వెళ్ళి ఏమి చూశాను అనేది కూడా తెలియకుండానే యిల్లు చేరుకున్నాను. అటువంటి బాధ మళ్ళీ నాకు సంభవించలేదు. అది నా జీవితంలో మరపురాని బాధ; [illegible] గారు.

— ఇంటర్వ్యూ: శ్రీనివాస్


రాస్తతోనే అక్టోబరులో ప్రారంభించాలను కుంటున్నాను. పై నెల హిందీ చిత్రాన్ని స్టార్టు చెయ్యాలనుకుంటున్నాను.' అన్నారు. 'తెలుగులో చిన్న పిక్చరు నిర్మించవచ్చుగా'? అని ప్రశ్నించాను. 'రెండు సంవత్సరాల క్రితం బడ్జెటు పిక్చరుకు 3 లక్షలా 75 వేలు అయ్యేది. ఇప్పుడదే చిత్రానికి ఐదు లక్షలు అవుతుంది. చిన్న పిక్చరుకు లక్ష వచ్చేది లాభం ఆ రోజుల్లో... ఇప్పుడు ఆ లక్ష నిర్మాణానికి సరిపోతుంది ఫ్యాన్సీకి తీసుకో వాలిసిందే బడ్జెటు పిక్చరిని' అన్నారు.

కొత్త కృష్ణంరాజు

గిరిరోడ్డు నుండి తిరుమూర్తి వీధికి వచ్చాను. డాల్టన్ పిక్చర్స్ వాకిట ముందు నటుడు కృష్ణంరాజు ఠీవిగా నిలబడి వుండడాన్ని చూచాను 'ఇప్పుడు కాలు ఎలా వుంది' అని అడిగాను. 'ఆల్‌రైట్,' అని బ్యాండేజిని చూపించారు.' రియాలిటీ కోసం రెండుసార్లు యాక్సిడెంటుకు గురి అయ్యారు కృష్ణంరాజు. ('బంగారుతల్లి' షూటింగులో). 'బంగారుతల్లి' విడుదల అయితే కృష్ణంరాజును పట్టుకోవడం కష్టం. సునీల్‌దత్తు కు తీసిపోకుండా నటించాడు అనే చెప్తారు సరు.

సినిమాగా జీవన తరంగాలు

తిరుమూర్తి వీధి నుండి బోగ్‌రోడు కు వెళ్ళాను. సురేష్ మూవీస్‌లోకి వెళ్ళబోతుంటే, నిర్మాత రామానాయుడు మెట్లు దిగి వచ్చారు. 'ఉగాదికి కొత్తవార్తలేమయినా యిస్తారా?' అన్నాను. 'యద్దనపూడి సులోచనారాణి వ్రాసిన 'జీవన తరంగాలు' కొన్నాను. చెంగయ్య స్క్రీన్‌ప్లే తయారు చేస్తున్నారు. నాయకపాత్రను నటసామ్రాట్ పోషిస్తారు.' అని చెప్పారు. 'ప్రేమనగర్' చిత్రాన్ని సర్వాంగ సుందరంగా, సర్వజన రంజకంగా నిర్మించడానికై నా శాయ శక్తులా ప్రయత్నిస్తున్నాను. ఆచార్య ఆత్రేయ కలంబలం, వెంకటరత్నం కెమరా కౌశలం, మహదేవన్ సంగీతసారం సమవుజ్జీలుగా పోటి చేస్తున్న ప్రేమనగర్ చిత్రంలో నాగేశ్వరరావు వైవిధ్యమైన నటన్ను చూపెడుతున్నారు,' అని రామానాయుడు చెపుతూవుంటే, పిక్చర్‌రష్ చూడాలనేటి ఆతురత ఎక్కువైంది. 'రెండు మూడు రోజుల్లో చూపిస్తాను అన్నారు' నిర్మాత.



'రైతుబిడ్డ'లో రామారావుకి వాణిశ్రీ చెప్తున్నది ఆసక్తి కరంగానే ఉన్నట్లుంది!

సినిమా

సత్యచిత్ర ప్రారంభం

బోగ్‌రోడ్డు నుండి వాహినీకి వెళ్ళాను. మార్చి 15 న ఉదయం గం 10.20 ని లకు మొదటిఫ్లోర్ వి. ఐ. పి. లతో నిండి వుండింది. కారణం సత్యచిత్రావారి షూటింగు ప్రారంభం గావడమే. వేద పండితులు మంత్రాలు వల్లించగా, నిర్మాత ఎన్. వి. వి. సత్యనారాయణ, ప్రధాన నటి జమున, ద్విపాత్రాభినయం చేస్తున్న శోభన్‌బాబు, దర్శకుడు కె. ఎస్. ప్రకాశ రావు, ఆచార్య ఆత్రేయ, మహదేవన్, వెంకటరత్నం కొబ్బరికాయలుకొట్టి కర్పూర హారతిని కళ్ళకు అద్దుకుని ప్రముఖనిర్మాత బి. నాగిరెడ్డిచే క్లాప్, లక్ష్మీ ఫిలింస్ అధినేతల్లో ఒకరయిన శివరామకృష్ణయ్యచే స్విచ్ ఆన్ చేయించి మొదటి షాటును జమునపై చిత్రీకరించారు. ఇటీవల ఏ ప్రారంభోత్సవానికీ యిందరు పెద్దలు సమావేశం కాలేదు.

'విధి—విన్యాసాలు' కథను సత్యచిత్రా సంస్థ చలనచిత్రంగా రూపొందిస్తున్నారు. అంతేకాదు శోభన్‌కు తన నటనాశక్తి ప్రదర్శించే మహదవకాశాన్ని కలిగిస్తున్నారు



నోట్లో సిగరెట్టు బొట్టు లేని అకట్టుతో అల్లురామలింగయ్యాని ఆకట్టుకున్న ఆమె లీలా రాణి యింటికి ఎందుకొచ్చినట్లు? 'అత్తలూ—కోడళ్ళూ' చిత్రంలో ఒక దృశ్యం.

మరొక విశేషం—జమునతో శోభన్‌ను జత పరచడమే. ఈ సముజ్వల సాంఘికానికి ఎస్. ఆర్. నంది మాటలను, మహదేవన్ సంగీతాన్ని, వెంకటరత్నం ఛాయను, స్క్రీన్‌ప్లే అండ్ డైరెక్షన్ను కె. ఎస్. ప్రకాశరావు నిర్వహిస్తున్నారు. ప్రధానపాత్రలను జమున, శోభన్, నాగభూషణం, చంద్రకళ, నిర్మల, కొత్తతార వరలక్ష్మి పోషిస్తున్నారు.

దర్శకుని ముందడుగు

వాహినీ నుండి బ్రహ్మపురానికి వచ్చాను. రామవిజేతా పిక్చర్స్‌కు వెళ్ళాను. 'ఉగాదికి న్యూస్ యిస్తారా' అని అడిగాను. దర్శకుడు బాబురావు, నిర్మాత ప్రభాకర్ 'హీరోయిన్సే మినహా మిగతా వివరాలను చెప్పగలము' అని సమాధాన మిచ్చారు. 'రామవిజేతా పిక్చర్స్‌వారి మూడవ సాంఘికం—షూటింగు త్వరలోనే ప్రారంభం; రికార్డింగు ఉగాదినాడు వుంటుంది. కథ, స్క్రీన్‌ప్లే, దర్శకత్వాన్ని నా తమ్ముడు బాబురావు నిర్వహిస్తారు. కెమరాను బుల్‌బుల్; సంగీతాన్ని ఘంటసాల, సంభాషణలను పినిశెట్టికి అప్పగించాము. ప్రధాన పాత్రలను శోభన్‌బాబు, జగ్గయ్య, అల్లురామలింగయ్య, రాజబాబు, ప్రభాకరరెడ్డి, లకనం ధరించగలరు.' యిప్పటికి యింతవరకే నిర్ణయించామన్నారు సోదరులు. 'మీరు మూడు బయటి చిత్రాలను డైరెక్టు చేస్తున్నట్టు వినికిడి. మరి...' అన్నాను. 'అవునండీ. నవభారత్ పిక్చర్స్‌కు, నాగేశ్వరీ ప్రొడక్షన్సుకు, జ్యోతి

సినిమా

నారాయణరావుగారి కుమారుడు శేఖర్ నిర్మించే చిత్రానికి—యివిగాక ఒక హిందీ చిత్రానికి, ఒక కన్నడ చిత్రానికి డైరెక్టు చెయ్యడానికి అంగీకరించాను' అన్నారు బాబురావు.

విచిత్ర దాంపత్యం

బ్రహ్మపురం నుండి మా లైవేడు హైరోడ్డులో వుండే ఉషశ్రీ ఆఫీసుకు వచ్చాను. నిర్మాత చిన్నపరెడ్డి హారీబరీగా ప్రయాణం కాబోతూ నన్ను చూసి 'డబ్బింగు పని జరుగుతూ వుంది. లూప్స్ తీసికెడుతున్నాను. వస్తారా స్టుడియోకి' అని ప్రశ్నించారు. 'పిక్చరు విడుదల తేది దగ్గర పడిందన్నమాట. ఎప్పుడేమిటి,' అన్నాను. 'ఏప్రిల్ మొదటి వారంలో వుండొచ్చు. పిక్చర్ బాగా వచ్చిందట. యిట్ నాట్ ఏ ఫ్లాప్. పర్వాలేదు; పెట్టుబడికి నష్టం రాదు' అని నిక్కచ్చిగా చెప్పినందుకు చిన్నపరెడ్డిని అభినందించాను.

మంచి సంప్రదాయం

మార్చి 15 న జమున యింట్లో డిన్నర్, రాత్రి 8 గంటలకు, అని చెప్పారు. తిరుమలపిళ్ళెరోడ్డు నెం. 29 లో ఉన్న జమున యింటికి నేను గం. 7.45 ని.లకు వెళ్ళాను. నీలిరంగు బనారస్ పట్టుచీరె + ఆదేరంగు జాకెట్టు ధరించి జమున యినుమడించే అందంతో మేడ వాకిటముందు



'జగత్ కంత్రీలు'లో జయలలిత.

నిలబడి, అందరినీ సాదరంగా ఆహ్వానించింది. ఆమె యిటీవల ఒక మంచి పద్ధతి నొకదాన్ని ప్రారంభించింది. తను నాయికగా నటించే ప్రతి చిత్రంయొక్క యూనిట్‌ను యింటికి పిలిచి, వారిని విందు భోజనంతో సత్కరించడమే. ఈ డిన్నరుకు పాత్రికేయులను ఆహ్వానించి, వారితో మనస్సు విప్పి మాట్లాడుతుంది. చిత్రంలోని తన పాత్రను నిర్మాత, దర్శక, సాంకేతికవర్గం యిచ్చిన సహకారాన్ని ప్రశంసిస్తుంది. 'మట్టిలో మాణిక్యం' విడుదల సందర్భంగా జమున ఈ డిన్నరును ఏర్పాటు చేసింది.

శ్రీ వేంకటేశ్వర వైభవము

కలియుగంలో భక్తిని మరచి భుక్తి కోసం చెయ్యరాని పనులకు అలవాటు పడుతున్నారు పామరులు. కాని, జనంలో భయం (దేముడిమీద) వుంది అనడానికి నిదర్శనమే ఏడుకొండలవాడి సన్నిధి. ఆసేతు హిమాచలం వెంకన్న అంటే తెలియనివారు వుండరు. తిరుపతి నాథునిలో ఏదో ప్రత్యేక ఆకర్షణశక్తి వుండబట్టే, భక్తులను అయస్కాంతంలా తన వైపుకు ఉధృతంగా గుంజుతున్నాడు. అయన్ను ఎన్నిసార్లు చూచినా, ఆశ తీరదు. ఆ ఆపద మొక్కు

సినిమా డైరీ

● మార్చి 7న గాయని వసంత బొంబాయి షణ్ముఖానంద సభలో పాటకచ్చేరి చేసింది. మహేష్ కుమార్‌తో కలసి మూడు గంటలసేపు పాడింది. మూడువేలమంది విన్నారు.

● హీరో నాగేశ్వరరావు మార్చి4 నుండి 15 వరకు విశ్వభారతివారి శ్రీమంతుడు షూటింగులో పాల్గొన్నారు. జమున, గుమ్మడి, రాజబాబుకూడా వున్నారు. దర్శకుడు కె. ప్రత్యగాత్మ.

● హీరో ఎన్. టి. ఆర్. మార్చి 15 నుండి 20 వరకు డి. వి. ఎస్. వారి షూటింగులో పాల్గొన్నారు. దేవిక, వాణిశ్రీ, కూడా వున్నారు. దర్శకుడు కె. విశ్వనాథ్.

● జమున సత్యచిత్ర షూటింగులో మార్చి 15నుండి 19 వరకు పాల్గొంది. శోభన్ నిర్మల, చంద్రకళ, కొత్తతార వరలక్ష్మి, కూడా నటించారు. దర్శకుడు కె. ఎస్. ప్రకాశరావు.

● మహేష్ మూవీస్ ప్రేమనగర్ పాట రికార్డింగు మార్చి18న విజయా గార్డెన్స్‌లో జరిగింది. ఆచార్య ఆత్రేయ వ్రాసిన పాటను, మహాదేవన్ ఆధ్వర్యంలో ఘంటసాల, ఈశ్వరి పాడారు

● విజయలక్ష్మి కంబైన్స్ మాస్టర్ కిలాడి ఏప్రిల్ 2న నిర్మల పిక్చర్స్‌ద్వారా విడుదలవుతుంది. మల్లికార్జునరావు దర్శకుడు.


చలం సమర్పించు శ్రీరమణ చిత్రవారి
మట్టిలో మాణిక్యం
దర్శకత్వం: B.V. ప్రసాద్
సోల్ డిస్ట్రిబ్యూటర్స్ శ్రీ ఫిలింస్
SUVARNA

వాడిని కొలువని వారుండరు. ఎంత పాడినా తరగదు, ఎంత వేడినా తనివితీరదు—అదే ఆ లీలామానుష విగ్రహంలోని ప్రత్యేకత. వెంకటేశునికి అందరూ సమానులు. ఆయనకు నిత్యం జరిగేపూజలు.వుత్సవాలు నేత్రపర్వంగా వుంటాయి. స్వామివారికి జరిగే అనంతోత్సవ మహత్యాన్ని చూచే మహత్‌భాగ్యాన్ని తిరుమల తిరుపతి దేవస్థానంవారు 'శ్రీ వేంకటేశ్వర వైభవము' చిత్రంద్వారా ఆంధ్ర ప్రేక్షక జనావళికి కల్పిస్తున్నారు. మనస్సులో పరవశాన్ని కలిగించే మధురమయిన పాటలు, రంగు రంగుల సుప్రభాతసేవ, వేదమంత్ర ఆలాపనము, యింకా అనేక విశేషాలుగొన్న ఈ చిత్రం ప్రజల్లో దైవ చింతను ఎక్కువ చేస్తుంది. ఆచార్యఆత్రేయ వ్రాసిన ఒక వుదాత్తమయిన పాటను తిలకించండి.

'కోటికి పడగెత్తిన శ్రీమంతుడు
నీ గుడి ముంగిట సామాన్యుడు
కూటికోసం శ్రమపడే నిర్భాగ్యుడు
నీకృపకెప్పుడూ సమపాత్రుడు'

తన దర్శనం కోరివచ్చే వారందరికీ అభయ హస్తం యిస్తాడు, అనేడి భావాన్ని పైపాట తెలుపుతూంది. శ్రీ ఎం. చంద్రమౌళిరెడ్డి సమర్పించే ఈ చిత్రానికి పి. డి. ప్రసాద్ దర్శకత్వాన్ని, కె. ఎస్. ప్రసాద్ ఛాయాగ్రహణాన్ని రాజేశ్వరరావు సంగీత సారథ్యాన్ని నిర్వహిస్తున్నారు. లక్ష్మి ఫిలింస్ విడుదల.

సినిమా

* * *

పురాణపురుష పాత్ర నిర్వహణకు ఎన్. టి. రామారావు పెట్టింది పేరు; ముఖ్యంగా శ్రీకృష్ణుడి పాత్రకు ఎన్. టి. ఆర్. సరికొత్త రూపకల్పన నిచ్చి తనే ఆ నీల మేఘ శ్యాముడు అనే పేరును సంపాదించి యున్నారు. అలాగే ఆంజనేయ భూమికను రాజనాల చక్కగా నిర్వహించి యున్నారు. ఎన్. టి. ఆర్. కృష్ణుడిగా, రాజనాల ఆంజనేయునిగా, వాణిశ్రీ సత్యభామగా నటిస్తున్న 'శ్రీకృష్ణాంజనేయ యుద్ధం' చిత్రాన్ని పూర్ణిమాపిక్చర్స్ నిర్మిస్తున్నారు. డి. ఎన్. రాజు (బాలనాగమ్మ నరసింహరాజు) నిర్మించే యీ పౌరాణికానికి సముద్రాల సంభాషణలను, టి. వి. రాజు సంగీతాన్ని, జి. కె. రాము ఛాయాగ్రహణాన్ని నిర్వహిస్తారు. సి. ఎస్. రావ్ దర్శకత్వంలో తయారు కానున్న యీ చిత్రం మేలో ప్రారంభమవుతుంది.

* * *

మీకు తెలుసా?

హిందీనటి మీనాకుమారి ఉర్దూలో కవిత్వం వ్రాస్తుందట. ఆమె వ్రాసిన పాటలకు, ఆమే సంగీత బాణీలను సమకూరుస్తుంచట.


తమిళ హాస్యనటుడు చంద్రబాబు తాను 17 సంవత్సరాలుగా నివసించిన యిల్లును వదిలి మరొక యింట్లోకి ప్రవేశించాడు.

వ్యభిచారిణిగా ఒక చిత్రంలో నటించిన హాలివుడ్ నటి ఆ చిత్రాన్ని తన కుమారుడు చూడరాదని శాసించింది. కారణం—అతడు సినిమా చూసి తన్ను హీనంగా మాట్లాడుతాడేమోననే అనుమానంతో.

వంగభాషా చిత్రాలు ఎంత బాగా వున్నా, ఎంత వసూలు చేసినా వంద రోజులు ప్రదర్శింపబడవట. కారణం—థియేటర్ల కొరతేనని తెలుస్తుంది.

తెలుగు నటి శారద మళయాళం, తమిళం, హిందీ సినిమాల్లోనేగాక అతిత్వరలో బెంగాలీ చిత్రాల్లో నటించే అవకాశం వున్నట్టు తెలుస్తోంది.

తెలుగు నిర్మాతల్లో చాలా మందికి కలర్ మీద మోజు యేర్పడింది. వీళ్లకు కలర్ ఫిలిం ఎలా దొరుకుతుందో అర్థం గావడం లేదు. బ్లాకులో కొంటే, పిక్చర్ కాస్ట్ విపరీతంగా పెరుగుతుంది: మన మార్కెట్టు చాలా చిన్నది. తారలు రేట్లు పెంచేసారని ఒక ప్రక్క గొణుక్కుంటూ, మరొక ప్రక్క కలర్ చిత్రనిర్మాణానికి వుపక్రమించడాన్ని పరికిస్తే, 'కొని తెచ్చుకుంటున్నారా కష్టాన్ని' అనేడి భావాన్ని కలిగిస్తుంది. నలుపు తెలుపు చిత్రానికి, కలర్‌కు నాలుగులక్షల పైచిలుకు వ్యత్యాసం వుంటుంది నిర్మాణపు ఖర్చులో. నలుపు తెలుపుకు ఎనిమిది అయితే, కలర్‌కి కనీసం 11లక్షలు అవుతుంది. ప్రింట్లు, పబ్లిసిటీ మొత్తం కలిపితే 14 అవుతుంది. 14 లక్షలు పెట్టి పిక్చరు తీస్తే, ఎంత కలెక్టు చెయ్యాలో తెలుసా? మినిమమ్ 26 లక్షలు వసూలు చెయ్యాలి, వూపిరి ఆడ



ఏమిటో ఆ రహస్యం? 'అమాయకురాలు'లో చంద్రమోహన్, కుమారి పద్మిని.

డానికి. మన తెలుగు మార్కెట్టు యింత డబ్బును యివ్వగలదా? 'దసరాబుల్లోడు' యివ్వలేదా అనొచ్చు. అలాంటి పిక్చరు పది సంవత్సరాలకొకసారి వస్తుందేమో. తెలుగు పరిశ్రమ పుట్టిన దాది యింతవరకు ఏ పిక్చరుకు రానంత డబ్బు 'దసరాబుల్లోడు'కు వచ్చింది. అన్నీ అలాగేపే చేస్తాయని రంగం లోకి దిగితే, ఎదురుదెబ్బ తగలొచ్చు. మన నిర్మాతలు కలర్ మోజును తగ్గించి, మంచి క్వాలిటీ పిక్చర్ల నిర్మాణానికి పూనుకుంటే బాగుంటుందేమో.

వెర్రిబాగులోడు

ఎం. ఎల్. ఎస్. ప్రొడక్షన్స్‌వారి ప్రథమ సాంఘిక చిత్రానికి 'వెర్రిబాగులోడు' అని పేరు పెట్టారు. మార్చి 7 వ తారీకున మద్రాస్ భరణి స్టూడియోలో

'సేపలూ—బలే—బలే సేపలూ
బాబులూ—మజా మజా సేపలు...'

అనే పాటను యల్. ఆర్. ఈశ్వరి పాడగా సంగీత దర్శకులు బ్రహ్మానందం స్వర కల్పన చేశారు. మార్చి 17 నుంచి 25 తేదీ వరకు అమలాపురం, మరమళ్ళ, గోదావరి తీర ప్రాంతంలో షూటింగ్ జరుగుతుంది. పై పాటని కథానాయికమీద చిత్రీకరిస్తారు. మరో ప్రపంచము జంట సలీమా, విజయచంద్ర, గౌతమ్, శీలారాణి, సాక్షి రంగారావు, జనార్దన్, రత్నగిరి, డా. శివరామకృష్ణయ్య, కాకరాల, మాస్టర్ ఆదినారాయణ, సంగీతరావు గుర్నాధరావు, పి. మార్కండయ్య, జి. విశ్వనాథం, వెంకటరావు, ఎం. ని. శంకరరాజు, పెండెకల్లు వెంకట్రామయ్య నటిస్తున్నారు.

ఛాయ: జనార్దన్, కళ: శ్రీనివాసరావు, కూర్పు: మార్తాండ్, దర్శక, నిర్మాత: యం. రంగారావు, నిర్వహణ: సంగీతరావు గుర్నాధరావు. 10 రీళ్ల పైగా ఈ చిత్రం పూర్తయింది.

—శ్రీనివాస్ ●

'సినిమా పరిశ్రమని జాతీయం చేయడమంటే...!'

చిత్రంలో కనిపించే కొన్ని ప్రధాన సహాయ పాత్రలను ధరించే వారిని 'క్యారెక్టరు ఆర్టిస్టు' అంటారు. మనకున్న కొద్దిమంది గుణచిత్ర నటుల్లో గుమ్మడి ఒకరు. 'ఉగాది' సందర్భంగా ఆయనతో నేను జరిపిన ఇంటర్వ్యూ యిది:

ప్ర: నటుడు రాజకీయాల్లో పాల్గొనడం తప్పా?


జ: అని ఎవరన్నారు? ప్రజలతో ప్రత్యక్ష సంబంధం వుండే పరిశ్రమ యిది. ప్రభుత్వానికి కోట్ల ఆదాయాన్ని తెచ్చిపెట్టే పరిశ్రమ యిది. సినిమా పరిశ్రమలో ఎన్నో సమస్యలు వున్నాయి. వాటిని పరిష్కరించుకోవాలంటే, మాలో కొంతమందిని ప్రభుత్వం ప్రోత్సహించి, మమ్మల్ని ఎన్నికల్లో పాల్గొనేట్టు చెయ్యాలి. అలా జరిగిననాడు, సినిమా పరిశ్రమకు సంబంధించి వ్యవహారాలను ప్రభుత్వానికి విప్పిచెప్పి, యేదయినా కొంత మంచిని పరిశ్రమకు చెయ్యగలమనే అభిప్రాయం వుంది నాకు.

ప్ర: 'గుణచిత్ర నటుడు' అంటే ఎవరు?

జ: సినిమాల్లో మంచిచెడుపాత్రలను (సహాయ భూమికలను) నిర్వహించే వారిని 'కారెక్టరు ఆర్టిస్టు' అంటారు. అంటే మన హీరోలు వివిధ రకాల పాత్రలను పోషించలేరని అనుకునేరు సుమా. వాళ్ళు కూడా ఏ పాత్రనయినా సమర్థవంతంగా పోషిస్తారు. కానీ ప్రజలు హీరోలను చెడ్డ పాత్రల్లో చూడలేరేమోనన్న అనుమానంతో, వాళ్ళు మంచి పాత్రలనే ధరించడానికి అంగీకరిస్తారు. అలాగని కథానాయక పాత్రధారులే వుత్తమ నటులు అని చెప్పడం సమంజసమేనా, చెప్పండి.

ప్ర: సినిమా పరిశ్రమను జాతీయం చెయ్యడం మంచిదా? కాదా?

జ: ప్రస్తుత ప్రభుత్వ వ్యవస్థ నడిచే తీరు తెన్నుల్లో సినిమా పరిశ్రమను జాతీయం చెయ్యడమంటే,



—గుమ్మడి

పశ్చిమ బెంగాల్‌లో నడివీధుల్లో వ్యక్తులను నరికి వేసినట్లే.

ప్ర: మన దేశానికి ఎలాంటి ప్రభుత్వం వుంటే బాగుంటుంది?

జ: అందరం కోరేది— ప్రతి మనిషికి కడుపునిండా తిండి, కట్టుకునేందుకు గుడ్డ, వుండడానికి నీడ—ఈ మూడు సమకూర్చగల ఏ ప్రభుత్వమయినా ఆమోదమే.

ప్ర: 'నవ్వు నాలుగువిధాల చేటు'—ఈ సామెతపై మీ వ్యాఖ్య?

జ: మానవుడికి వున్న ఒకే వరం నవ్వు. ప్రాణికోటిలో ఎవ్వరికీ లేని బంగారంలాంటి వరం నవ్వు. నవ్వలేనివాడ్ని మానవుడు అనడం నాకు చేతకాదు.

ప్ర: మీ జీవితాశయమేమిటి? నిర్మాత అయ్యే ఆయిడియా వుందా?

జ: మంచి మనిషిగా బ్రతకడమే ఆశయం; నేను పిక్చరంటూ నిర్మిస్తే, దానికి బంగారు పతకం రావాలి.

ప్ర: నటీనటుల మధ్య 'నటన'లో పోటీ అవసరమా? కాదా?

జ: ఆరోగ్యకరమయినపోటీ అవసరమే. అనవసరంగా క్రోధాలు పెంచుకుని, వున్న నటన్ను పాడుచేసుకునే పోటీ ఎవరికీ మంచిది కాదు. పాత్రపట్ల ఏకాగ్రత, నిర్వహణలో జాగరూకత కనపరచి, ఉత్తమ నటుడు అనిపించుకునేంత వరకు పోటీ అవసరమే.

ప్ర: పోటీ నటీనటు లెవరయినా మీకు సలహాలిస్తే పాటిస్తారా? లేక...

జ: సమంజసంగా వుండి, సహేతుకంగా వున్న సలహాలను తప్పకుండా పాటిస్తాను.

ప్ర: ఒక నటుడు జీవితంలోకూడా నటిస్తాడు అనేడి వాదంపై మీ అభిప్రాయం?

జ: 'జీవితమే ఒక నాటకరంగం, జీవులంతా పాత్రధారులు' అన్నారు యెవరో. ఈనాటి లౌకిక ప్రపంచంలో ప్రతివ్యక్తి నటించాల్సిందే.

ప్ర: తెలుగు చిత్రాలకు విదేశీ మార్కెట్టు లభించడం ఎలా?

జ: ఇతర భాషా చిత్రాలకు ఏ మాత్రం తీసిపోదు మన తెలుగు సినిమా. ప్రభుత్వం పాక్షిక దృష్టితో వ్యవహరించకుండా వుంటే, మన చిత్రాలకు విదేశీ మార్కెట్టు తప్పకుండా లభిస్తుంది. భారతీయ సంస్కృతిని, మన ఆచార వ్యవహారాలను, మన జానపద నృత్యాలను ప్రతిబింబింప చేసే చిత్రాలకు విదేశాల్లో మంచి ఆదరణ వుందని నాకున్న విదేశీ అనుభవంతో చెప్పగలను. అన్ని భాషలకు చెందిన వారిని ఒక కమిటీగా వేసి, వారి ద్వారా ప్రతి భాషకు చెందిన మంచి చిత్రాన్ని సెలెక్టు చేసిన నాడు, విదేశీ మార్కెట్టు అతి సులభంగా లభిస్తుంది. ప్రభుత్వం మన పరిశ్రమపై చిన్న చూపు చూస్తోంది.

ప్ర: మీ మనస్సుకు, నిజ జీవితానికి దగ్గరగా వున్న పాత్రనేదయినా ధరించారా?

జ: నాకు విద్యాబుద్ధులు చెప్పి

(64వ పేజీ చూడండి

పుస్తకాలు

కందుకూరి వీరేశలింగం డైరీలు, లేఖలు

సంకలన కర్త: అక్కిరాజు రమాపతిరావు, ప్రతులకు, విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్, ఏలూరు రోడ్, విజయవాడ—2, డెమ్మీ 154 పుటల వెల మూడు రూపాయలు.

అద్యతనాంధ్ర నిర్మాత కందుకూరి వీరేశలింగం తమ దిన చర్యలన్నీ క్రమ పద్ధతిలో వ్రాసుకోలేదు. ముఖ్యంగా జ్ఞాపకం పెట్టుకోవలసిన కొన్ని సంగతులు మాత్రమే తమ డైరీలలో అప్పుడప్పుడు పొందు పరచు కున్నారు. అలాగే ఆయన వ్రాసిన లేఖలన్నీ నేడు పూర్తిగా దొరకడం లేదు.

అయినా అక్కిరాజు రమాపతిరావుగారు చాలా శ్రమపడి, ఆయన డైరీలలో లేఖలలో కొన్ని సంపాదించి తెనుగువారి కందించారు. ఈయన వీరేశలింగం మీద విపుల పరిశోధనా వ్యాసం, రచించి తమ డాక్టరేట్ సంపాదించు కున్నవారు. అదీగాక వీరేశలింగం వంటి మహనీయుని ఎడల విశేషంగా గౌరవాభిమానాలు పెంపొందించుకున్న వారు.

కవుల చరిత్ర తిరిగి వ్రాయాలనుకున్న వీరేశలింగంలో చెలరేగిన తపన, నిష్ఠ, తహతహ ఈ లేఖలలో విస్పష్టంగా రూపు కట్టినట్టు గోచరిస్తాయి. అవసాన కాలంలో కూడా ఆయన కార్య దీక్ష పరిశీలిస్తే ఎంతటి నిశిత పరిశోధనా వ్యగ్రత! అనిపిస్తుంది. చివరి రోజులలో వీరేశలింగం అనేకవిధాల కష్టాల పాలయ్యారు. అయినా ఆయన తమ అవంచల రచనా దీక్ష విరమించ లేదు!

ఈ డైరీలు, లేఖలు ఒక ఎత్తు! అక్కిరాజు వారు ఈ సంపుటికి వ్రాసిన ప్రవేశిక ఒక ఎత్తు! ఆయన దీనితో ఈ డైరీలు, లేఖలు సంపాదించడానికి తాము పడిన శ్రమ, తపన, లేఖల సంపాదనకు సంబంధించిన వివరాలు మొదలయిన వన్నీ విపులంగా చర్చించారు. ఇంకా వీరేశలింగం బహుముఖ సారస్వత కృషి కూడా కొన్ని ముఖ్య విషయాలలో వివరించారు. ఈ లేఖలు, డైరీలు చదువుతూంటే ఇవి అన్నీ సమగ్రంగా లభించి ఉంటే ఎంత బాగుండేది! అనిపిస్తుంది. ముఖ్యంగా వంగూరి సుబ్బారావు గారికి వీరేశలింగం వ్రాసిన లేఖలు కొన్ని నేటి పరిశోధకులలో నిశిత జిజ్ఞాస రేకెత్తించగలవు.

వీరేశలింగానికి సంబంధించిన వాఙ్మయంలో రమాపతిరావు గారిది జ్ఞాపకం పెట్టుకోదగిన రచన. ఈ పుస్తకం ప్రచురించిన విశాలాంధ్ర వారు అభినందనీయులు.

—శాస్త్రి

రా

కవితా సంకలనము. రచన జ్వాలాముఖి. పేజీలు 84. వెల: రు 2—50. ప్రతులకు: స్పందన డిస్ట్రిబ్యూటర్స్, 817/2 చిక్కడపల్లి, హైదరాబాదు—20.

దిగంబర కవిత్వ పద్ధతిలో కొనసాగించిన వచన కవితల సంకలనం. కమ్యూనిస్టు మానిఫెస్టో కంటె తాకట్టుకపోయినా, జీవితం, నా చుట్టూ ఉన్న ప్రపంచం నాకు మార్క్సిజమ్ పాఠాలు నేర్పింది. అంటారీ కవి తమ సహ్జ ముందు ప్రవేశికలో. ఈ సంకలనంలో అంతట విపరీతమయిన వెర్రి ఆవేశంతో బాటు ఉద్రేకమయిన నిజాయితీ అడుగడుగునా ప్రతిధ్వనిస్తుంది. అయితే అగ్ని శిఖలు వంటి రెండు మూడు కవితలలో కొన్ని పంక్తులలో మాత్రమే, ఈ ఆవేశము నిజాయితీ కవితగా ప్రతిధ్వనిస్తాయి. మిగిలిన వాటిల్లో చాలా వరకు మార్క్సిస్టు ధోరణి నినాదాలే చాలావరకు తీవ్రావేశంతో వినిపిస్తాయి. ఏది ఏమయినా నేటి దిగంబర కవిత ఆధునిక కవితగా కొనసాగుతున్నది. ఈ ధోరణి కవితలో తెంతటి పరిశీలించాలంటే రా ఒక అద్భుతమయిన ఉద్యమంలా ఉపయోగిస్తుంది. —శాస్త్రి

సత్యం కార్టూన్లు

యువచిత్రకారుడు శ్రీ సత్యం వివిధ పత్రికలలో వేసిన కార్టూన్లని ఎ. ఎస్. పబ్లికేషన్స్, 33 ఎం 8 వింగ్, మల్లేపల్లి, హైదరాబాదు—1 వారు పుస్తకరూపంలో వెలువరించారు. వెల: రు. 1.50 ఈ పుస్తకంలో గల సుమారు 195 కార్టూన్లలో చాలా భాగం సునిశితమైన హాస్యంతో పాఠకులని అలరించేవిగా వున్నాయి. ముఖచిత్రం, ముద్రణ ఆకర్షణీయంగా ఉన్నాయి. [బి. వి.]

వార్షిక సంచిక

శ్రీ నటరాజ కళాసుందరి, విజయవాడ ప్రచురించిన 15వ వార్షిక సంచిక మా కార్యాలయం చేరినది 128 పేజీలు గల ఈ సంచికలో ప్రముఖుల సందేశాలు, సంస్థని గురించిన వివరాలు మొదలైనవెన్నో ఉన్నాయి. ●

విషాద ప్రపంచంలో . . .

(47 వ పేజీ తరువాయి)

దాని అర్థం. అందంగా వున్నామనుకునే అనేకమంది అమ్మాయిలకు యీ పోటీలు ఆశాజనకంగా ఉండవు!

ఎన్నికయ్యాక ఏం చెయ్యాలి?

ప్రపంచ సుందరిగా ఎన్నికయిన అందాల రాణిని లండన్‌లోని హోటల్లో మంచం మీద కూచో బెట్టి అనివార్యంగా ఫోటోలు తీస్తారు. ఆ అమ్మాయి తలపై ఒక రాజదండం వుంటుంది. తల మీద కిరీటం ఉంటుంది. ఎదురుగా అభినందనలు తెలిపే టెలిగ్రాముల కట్టలు వుంటాయి. ఆమె డైరీలోని పేజీలు చెయ్యాల్సిన పనులతో నిండి పోతాయి. ప్రదర్శనశాలలో హాజరవటం, వ్యాపార సంస్థలకి ప్రారంభోత్సవాలు చేయటం— మొదలయిన వాటి ద్వారా ఎంతయినా డబ్బు సంపాదించుకోవచ్చు.

ప్రతి క్షణం ప్రయాణం, అసంఖ్యాకంగా అభిమానుల ఉత్తరాలు, వందల కొద్దీ కొత్త మొహాలు, చిరాకెత్తించే టెలిఫోన్ కాల్స్, ప్రత్యర్థుల ఈర్ష్యా ద్వేషాలూ—ఆ క్షణం నుంచీ ప్రపంచ సుందరి జీవితంలోకి ప్రవేశిస్తాయి. కొందరికి తాము ఎన్నికైన తొలి సంవత్సరం ఆనందాన్ని కలిగిస్తుంది. మరికొందర్ని ఇబ్బందులకు గురి చేస్తుంది.

ఎవరికి జ్ఞాపకం?

అయిదేళ్ల కిందటి ప్రపంచ సుందరి పేరు మీకు జ్ఞాపకం వుందా? ఆమె పేరు ఎవరైనా చెప్పగలరా? మరెందుకీ హడావిడి? సంవత్సరం అయ్యాక యీ సుందరీమణి సంగతేమిటి? ఎవరు పట్టించుకుంటారు.

కొందరికి ఫిలిమ్ టెస్ట్‌లు జరుగుతాయి. అంతవరకే! 1951 నుంచి ఇప్పటివరకూ, ఒకే ఒకమ్మాయికి సినిమాల్లో చిన్నవేషం లభించింది. కొందరు, మోడల్స్‌గా జీవితాన్ని కొనసాగిస్తారు. మరికొందరు మోడల్ ఏజన్సీస్ స్థాపిస్తారు. ఈ అందాల రాణుల్లో అధికభాగం—తమ అందాన్ని పరిరక్షిస్తూ పోషించగల భర్తల్ని వెతుక్కొని వివాహం చేసుకుంటారు.

(ఫో. వ. ఫి) ●

సినిమా పరిశ్రమని...

(6_ వ పేజీ తరువాయి)

నట జీవితానికి నాందీవాక్యం పలికిన మా తెలుగు మాష్టారూ, నన్ను నేటికీ ప్రపంచం తెలియని పసిపిల్లవాడిగా పరిగణించే తాం భ్ర యే ం డ్ల మా నాయనమ్మ (యింకా జీవించి వుంది) చెప్పే సలహా 'కులదైవం' చిత్రంలోని పెద్దన్నలాగా నిజ జీవితంలో కలకాలం వుండమని. సోదరుల కోసం, కుటుంబం కోసం, నీతి నిజాయితీల కోసం కట్టుబడి వున్న త్యాగమూర్తి పాత్రే ఆ పెద్ద అన్న పాత్ర.

ప్ర : 'ఉగాది'కి మీ కోరిక ఏమిటి?

జ : 'మంచి మనిషికి మంచి రోజులొస్తాయి'—యీ సామెతకు న్యాయం జరగాలి—యిదే నా కోరిక.

ఇంటర్వ్యూ—శ్రీనివాస్ ●

Printed and Published by S. Nageswara Rao at the Andhra Patrika Press; 6 & 7 Thambu

Regd No. 4479 ANDHRA SACHITRA VARA PATRIKA.

